అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 03-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

12 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

సంపుటి : 10 సంచిక : 254

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar



నల్లమల అందాలు చూసొద్దామా!

సాగర్ టు శ్రీశైలం లాంచీ ప్రయాణం ప్రారంభం

11లో..

రెండేండ్ల తర్వాత కదిలిన లాంచీ

రెండేండ్ల తర్వాత నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణాన్ని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రారంభించింది. శనివారం ఉదయం 10 గంటలకు 40 మంది ప్రయాణికులతో బయల్దేరిన లాంచీని నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ పూజలు చేసిన అనంతరం జెండా ఊపి ప్రారంభించారు.



ఎంపీల హక్కులు అణగదొక్కొద్దు

సీపీఐ(ఎం) డిమాండ్

న్యూఢిల్లీ : పార్లమెంట్ సభ్యుల హక్కుల ఉల్లంఘనను తక్షణమే ఆపాల్సిందిగా సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. వెనిజులా రాజధాని కారకస్‌లో ఫాసిజానికి వ్యతిరేకంగా పార్లమెంటేరియన్ల ఫోరం కార్యక్రమానికి హాజరయ్యేందుకు గానూ సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యులు డాక్టర్ వి.శివదాసన్‌కు రాజకీయ అనుమతిని నిరాకరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. పాలక పార్టీ అభిప్రాయాలకు అనుగుణంగా లేని వాణిని అణచివేసేందుకు జరిగిన ప్రయత్నమే ఇదని విమర్శించింది. వెనిజులా నేషనల్ అసెంబ్లీ నిర్వహిస్తున్న పార్లమెంటేరియన్ల ఫోరం కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా సీపీఐ(ఎం)కు వెనిజులా పార్లమెంట్ నుంచి ఆహ్వానం అందింది. ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు డాక్టర్ వి.శివదాసన్‌ను పార్టీ నామినేట్ చేసింది. ఈ కార్యక్రమంలో పలు దేశాలకు చెందిన పార్లమెంటేరియన్లు పాల్గొంటున్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతి లభించినా విదేశాంగ శాఖ శివదాసన్‌కు రాజకీయ అనుమతిని నిరాకరించడం తీవ్ర విచారకరమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇది ఒక పార్లమెంట్ సభ్యునిగా ఆయనకు గల హక్కులను ఉల్లంఘించడమేనని విమర్శించింది. రాజకీయ వివక్ష విధానాన్ని కేంద్రం అనుసరిస్తోందని సీపీఐ(ఎం) విమర్శించింది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా లేని వ్యక్తులు తమ అభిప్రాయాలు తెలియజేయకుండా వారి నోరు నొక్కడమే చేయగలదని పేర్కొంది. ఈ అంశం ప్రతిపక్షాలకు, పార్లమెంట్ సభ్యులకు తీవ్రంగా ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది.

నాలుగేండ్లూ రేవంతే సీఎం

రెండోసారి ఎవరనేది అధిష్టానమే నిర్ణయిస్తుంది



సంక్రాంతిలోపు గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు

రాష్ట్రంలో 20 లక్షల ఇండ్ల నిర్మాణమే లక్ష్యం

ఇందిరమ్మ ఇండ్లకు బహు పేదరికమే కీలకం

లబ్దిదారుల ఎంపిక బాధ్యత గ్రామసభలదే

ఈ నెల 30లోపు కొత్త ఇండ్ల నిర్మాణం ప్రారంభం

20 లోపు లబ్దిదారుల ఎంపిక పూర్తి

ప్రత్యేక యాప్‌లో ఇండ్ల వివరాలు అప్‌లోడ్

నాలుగు దశల్లో నిధులు విడుదల

కేంద్రం ఎంత ఇచ్చినా తీసుకుంటాం...మిగతాది సర్కారే భరిస్తుంది : ఇష్టాగోష్టిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తమ ప్రభుత్వానికి ఒక నెల నాలుగేండ్ల సమయం ఉందనీ, అప్పటివరకు రేవంతే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తిరిగి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, అప్పుడు సీఎం ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందని చెప్పారు. ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి ప్రతిపక్షాల నేతలు అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. డిసెంబర్‌లో సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయనీ, వచ్చే సంక్రాంతి నాటికి కొత్త పాలక వర్గాలు కొలువుదీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఇష్టాగోష్ఠిగా విలేకర్లతో మాట్లాడారు. రానున్న 15 రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల తుది జాబితా సిద్ధమవుతుందని తెలిపారు. మొదటి దశలో స్థలాలు ...11లో

మీకంటే మేమే బెటర్

మోడీ వ్యాఖ్యలన్నీ అవాస్తవాలు, అపోహలు...

- ప్రతీ హామీని నిబద్ధతతో అమలు చేస్తున్నాం
- ఉద్యోగాల కల్పనలోనూ ముందంజలో ఉన్నాం
- ప్రధాని కామెంట్లకు సీఎం రేవంత్ కౌంటర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంపైనా, ప్రభుత్వంపైనా ప్రధాని నరేంద్రమోడీ అపోహలు, అవాస్తవాలతో కూడిన ప్రకటన చేశారని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అధికార దుర్వినియోగం తర్వాత గతేడాది డిసెంబర్ 7న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన దరిమిలా ఉత్సాహం, నమ్మకం పెరిగాయని తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజుల్లోనే మొదటి హామీ మహిళలకు టీజీఎస్ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం, రెండో హామీ రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీని రూ.10 లక్షలకు పెంచినట్టు గుర్తుచేశారు. గడిచిన 11 నెలల్లో సోదరీమణులు, తల్లులు ఒక్క రూపాయి వెచ్చించకుండా 101 కోట్ల ఉచిత బస్సు ట్రిప్పుల్లో ప్రయాణించారనీ, దీంతో వారికి రూ.3,433.36 కోట్లు మిగిలాయని చెప్పారు. ఏడాది పాలన కంటే ముందే భారతదేశ చరిత్రలోనే రైతును రాజును చేస్తూ 22,22,365 మందికి రుణమాఫీ చేసినట్టు తెలిపారు. ఒక్కో రైతుకు అత్యధికంగా రూ.2 లక్షల చొప్పున కేవలం 25 రోజుల్లోనే రూ.18,000 కోట్ల రుణమాఫీ అమలు చేసినట్టు వివరించారు. ఇండ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యంతో మహిళలు తమను ఆశీర్వదిస్తున్నారని గుర్తుచేశారు.

తెలంగాణలో గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తుంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ ధరలను ప్రజలు భరించలేకపోతున్నారని విమర్శించారు. ఇప్పటికే తెలంగాణలో 1.31 కోట్ల గ్యాస్ సిలిండర్లను 42,90,246 మందికి అందజేసినట్టు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దశాబ్దకాలం పాటు యువతకు ఉద్యోగాల కల్పన, పరీక్షల నిర్వహణలో విఫలమైతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల కన్నా తక్కువ కాలంలోనే గ్రూప్ 1, 2, 3, 4 ఇలా అన్ని రకాల పరీక్షలను రెగ్యులర్‌గా నిర్వహిస్తూ 50 వేల ...11లో



వంద-శాతం వర్సిటీల ప్రక్షాళన

విశ్వవిద్యాలయాల గౌరవాన్ని పెంచాలి

దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలి

సమగ్ర అధ్యయనం చేసి చర్యలు చేపట్టాలి

మంచి పని చేసేందుకు స్వేచ్ఛనిస్తాం

తప్పు చేస్తే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకుంటాం

నూతన వీసీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

11లో..

నాలుగు రోజులకో జర్నలిస్టు హతం



చాలా కేసుల్లో శిక్షలు పడని వైనం

యునెస్కో నివేదిక స్పష్టం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2022-23లో ప్రతి నాలుగు రోజులకు ఒక జర్నలిస్ట్ మరణించాడని, జర్నలిస్టుల హత్యలకు సంబంధించిన చాలా కేసుల్లో శిక్షలు పడటం లేదని యునెస్కో స్పష్టం చేసింది. యుఎన్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) శనివారం నివేదిక విడుదల చేసింది. జర్నలిస్టుల మరణాలు 38 శాతం పెరిగాయని, వీటిని ఆపాలని ప్రభుత్వాలను కోరింది. జర్నలిస్టుల మరణాలు పెరుగుదల "ఆందోళనకరం" అని నివేదికలో స్పష్టం చేసింది. "సత్యాన్ని అనుసరించడం, వారి కీలకమైన పనిని చేస్తున్నందుకు 2022-23లో ప్రతి నాలుగు రోజులకు ఒక జర్నలిస్ట్ చంపబడ్డాడు" అని యునెస్కో డైరెక్టర్ జనరల్ ఆడ్రీ అజౌలే తెలిపారు. ఈ నేరాలు తగ్గేలా మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆమె ప్రపంచ దేశాలను కోరారు. 2022-23లో సంఘర్షణలను కవర్ చేస్తూ మరణించిన వారిలో స్థానిక జర్నలిస్టులు 86 శాతం ఉన్నారని యునెస్కో నివేదిక పేర్కొంది. 2023లో పాలస్తీనాలో అత్యధిక కేసులు నమోదయ్యాయని, 24 మంది జర్నలిస్టులు తమ బాధ్యతలు నిర్వర్తిస్తూ మరణించారని స్పష్టం చేసింది. గతేడాది అక్టోబర్ నుంచి గాజా, ఇజ్రాయిల్, లెబనాన్‌లలో మరణించిన జర్నలిస్టుల సంఖ్య 135 కంటే ఎక్కువగా పెరిగింది. గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయిల్ యుద్ధాలను కవర్ చేస్తున్నప్పుడు జర్నలిస్టులు ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు. ఇజ్రాయిల్ ...11లో

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంపు

ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సంక్షేమ హాస్టళ్లతోపాటు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఆర్ఈఐఎస్)లో చదువుతున్న ...2లో

జనవరి 9న ఓటర్ల తుది జాబితా ఖరారు

అక్టోబర్ 29 నాటికి 3,34,26,323 మంది ఓటర్లుగా నమోదు

గతం కంటే 1.8 శాతం పెరుగుదల : తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి సుదర్శన్ రెడ్డి



మెట్రో రెండో దశకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

11లో..

పరిపాలనా అనుమతులతో జీవో జారీ

25 నుంచి పార్లమెంట్

డిసెంబర్ 20 వరకు కొనసాగింపు 11లో..

వక్ఫ్, జమిలీ వంటి కీలక, వివాదాస్పద బిల్లులపై చర్చ

జనవరిలో పంచాయతీ ఎన్నికలు?

వడివడిగా అడుగులేస్తున్న సర్కార్

కుల గణన, ఓటరు నమోదు, ఇందిరమ్మ ఇండ్ల హడావుడి అందుకే

ఎలక్షన్లు నిర్వహించకపోవటం వల్ల కేంద్రం వద్ద రూ.1,800 కోట్లు పెండింగ్

ప్రక్రియ పూర్తయితే వాటిని రాబట్టుకోవచ్చని అంచనా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే కొత్త సంవత్సరం (2025)లో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నారా? అందుకు సంబంధించి కసరత్తులు షురూ అయ్యాయా? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. 2025లో నిర్వహించబోయే అన్ని ఎన్నికలకు ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించటం, ఈనెల ఆరు నుంచి కుల గణన ప్రారంభం కానుండటం, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను త్వరలోనే ఎంపిక చేస్తామంటూ మంత్రి పొంగులేటి ప్రకటించటం తదితర పరిణామాలన్నీ 'పంచాయతీ' నగరాకు సన్నాహాలుగా కనబడుతున్నాయి. ఈ యేడాది జనవరితో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీకాలం పూర్తయిన సంగతి విదితమే. అప్పటి నుంచి.. అంటే దాదాపు పది నెలల నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. ఈ క్రమంలో కుల గణన చేపట్టిన వెంటనే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్, ఆయన మంత్రివర్గ సహచరులు చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఆ ప్రక్రియ ప్రారంభం కాబోతోంది. మరోవైపు పంచాయతీ ఎలక్షన్లు నిర్వహించకపోవటం వల్ల నిబంధనల ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన రూ.1,800 కోట్లను విడుదల చేయకుండా కేంద్రం నిలిపేసింది. సత్వరమే ఎన్నికలను నిర్వహించటం ద్వారా ఆ నిధులను రాబట్టుకోవచ్చని



రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశముందని ఉన్నతాధికారులు తెలిపారు.

మరోవైపు రాష్ట్రంలో కుల గణన పూర్తయితే...ఆ లెక్కల ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తారా? లేదా? అన్నది వేచి చూడాలి. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కలిపి సుమారుగా 80 శాతానికి పైగా ఉన్నారు. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ కుల గణనను చేపట్టి, ఆ ప్రకారంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేస్తుందా? లేదా? అన్నది కూడా పెద్ద ప్రశ్నే. ఒకవేళ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం వాటిని అమలు చేయాల్సి వస్తే, 80 శాతం మేర అమలు చేయాలి. కానీ ఏ అంశంలోనైనా 50 శాతానికి మించి రిజర్వేషన్లను అమలు చేయకూడదంటూ కోర్టులు తీర్పులిచ్చాయి. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎలా ముందుకెళుతుందనేది వేచి ...11లో

రూ. 24 కోట్ల ఖరీదైన వజ్రాలు, నగలు సీజ్

మహా ఎన్నికల్లో ఓటరుపై పార్టీల గాలం



ముంబై : మహారాష్ట్ర ఎన్నికలకు కౌంట్‌డౌన్ షురూ అయ్యింది. 20వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి మందు, మనీతో పాటు కోట్లు విలువ చేసే ఆభరణాలను గుట్టుచప్పుడు కాకుండా పార్టీలు దింపుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలోకి అక్రమంగా ప్రవహించే డబ్బు ప్రవాహాన్ని అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. తాజాగా రూ. 24 కోట్లు వజ్రాలు, బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. అహల్యానగర్ జిల్లాలో ఉన్న సుపా టోల్‌ప్లాజా వద్ద పోలీసులు, ఈసీ అధికారులు ఓ కారును ...11లో

క్యూబాపై ఆంక్షలు తొలగించాల్సిందే

187 దేశాల మెజారిటీతో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం

వ్యతిరేకించిన అమెరికా, ఇజ్రాయిల్

ఆంక్షల వల్ల క్యూబా ప్రగతిపై ప్రతికూల ప్రభావం

న్యూయార్క్ : క్యూబాపై అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య, ద్రవ్య ఆంక్షలకు ఇక స్వస్తి చెప్పాల్సిన అవసరం నెలకొందని పేర్కొంటూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అక్టోబరు 30న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 187 దేశాలు ఈ తీర్మానానికి మద్దతునిచ్చాయి. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు వ్యతిరేకంగా ఓటు చేయగా, మాల్దోవా గైర్హాజరైంది. మిగిలిన దేశాలన్నీ క్యూబాకు అనుకూలంగా ఓటు వేశాయి.

1991 నుండి ప్రతీ సంవత్సరం ఇదే తీర్మానం అత్యధిక మెజారిటీతో ఆమోదం పొందుతూ వస్తూనే వుంది. కోవిడ్ వల్ల 2020లో మాత్రమే ఓటింగ్ జరగలేదు. 20ఏళ్ళకు పైగా ఇజ్రాయిల్, అమెరికాలు మాత్రమే తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేస్తున్నాయి. ప్రతి ఏటా ఒకటి రెండు దేశాలు గైర్హాజరవుతునే వుంటాయి.

జనరల్ అసెంబ్లీలో ప్రతినిధులనుద్దేశించి క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ మాట్లాడారు. అమెరికా అమలు చేస్తున్న ఆర్థిక ఆంక్షల వల్ల క్యూబాకు అత్యంత కీలకమైనటువంటి ఉత్పత్తుల రవాణా ఎలా నిలిచిపోతోందో ఆయన వివరించారు. అంతర్జాతీయ ఆర్థిక వనరులు అందుబాటులోకి రాకుండా పోతున్నాయన్నారు. ఉత్పత్తులు, ఆర్థిక వనరుల కొరత కారణంగా క్యూబన్ల జీవితాలకు సంబంధించిన ప్రతీ అంశమూ దెబ్బతింటోందని చెప్పారు. ఈ ఆంక్షల వల్ల జరుగుతున్న ప్రతికూల ప్రభావాలపై క్యూబా విదేశాంగ శాఖ సెప్టెంబరు 12న సమగ్ర సమీక్ష ఇచ్చింది.



అయితే ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ఓటింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత వుంది. క్యూబాను తీవ్రంగా నష్టపరిచిన, క్యూబావ్యాప్తంగా అనేక రోజుల పాటు విద్యుత్ సంక్షోభానికి కారణమైన హరికేన్ ఆస్కార్ వచ్చిన వెంటనే ఈ ఓటింగ్ జరిగింది. విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి చమురు లేక దేశం చీకటిలో మగ్గిపోయింది. పెట్రోలియం ఉత్పత్తుల రవాణాపై ఆంక్షలు అమల్లో వున్నాయి. అలాగే అంతర్జాతీయ నిధులు కూడా చాలా పరిమితంగానే వస్తున్నాయి. ఈ కారణాలతో విద్యుత్ సంక్షోభం నెలకొంది. తాజాగా క్యూబన్లకు, ప్రభుత్వానికి అసాధారణమైన కష్ట సమయం నెలకొంది. రోజువారీ అవసరాలకు కావాల్సిన మౌలిక సరఫరాలు, సామాగ్రి అందుబాటులో వుండడం లేదు. డబ్బులు కొరతగానే వుంది. పైగా ద్రవ్యోల్బణం కూడా ఎక్కువగానే వుంది. దీనికి తోడు పర్యాటకం కూడా క్షీణించింది. విదేశీ కరెన్సీ ...11లో

కులగణనపై సలహాల స్వీకరణకు 5న ఖర్గే, రాహుల్ గాంధీ రాక

- 7న అఖిల పక్ష సమావేశం
- సీఎం ఉండగా...కొత్త సీఎం అనే ప్రస్తావన ఎక్కడిది?
- మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా పని చేస్తున్నారు : టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీమేరకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన కార్యాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కులగణనపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ ఈనెల 5న హైదరాబాద్‌కు వస్తున్నారని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా కులగణన చేయాలంటూ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 5న బోయిన్‌పల్లి ఐడియాలజీ సెంటర్‌లో సాయంత్రం నాలుగు గంటలకు రాహుల్‌గాంధీ కుల, విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం అవుతారని వెల్లడించారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సర్వేలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిని మార్చి ఆయన స్థానంలో మరొకరికి సీఎం బాధ్యతలు అప్పగిస్తారంటూ శాసనసభలో బీజేపీ పక్షనేత మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనకు కుర్చీనే లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందన్నారు. ప్రస్తుతం సీఎం ఉండగా కొత్త సీఎం అనే ప్రస్తావన ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. ఈనెల 6 లేదా 7న కులగణనపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కేంద్రంలో బీజేపీ హామీ ఇచ్చిందనీ, ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ ఎప్పుడూ వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. కానీ, మోడీ విమర్శలను కూడా రాహుల్‌గాంధీ పాజిటివ్‌గా తీసుకుంటారని గుర్తు చేశారు. కులగణన కోసం కనెక్టింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యేలు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని తెలిపారు. కులగణన విషయంలో రాహుల్‌గాంధీ చిత్తశుద్ధితో ఉన్నారని చెప్పారు. వంచించిన కేసీఆర్‌ను దించి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని తెలిపారు. సీఎం, మంత్రులు, పార్టీ నేతలు ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా పాలన అందిస్తున్నారని వివరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా పని చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రజాస్వామిక స్వేచ్ఛ, ఏ ఇతర పార్టీలోనూ లేదనీ, బీజేపీలో అంతకన్నా లేదని ఆయన తెలిపారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు 15

- ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు ఈనెల 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌ను విద్యార్థులకు అందిస్తున్నదని తెలిపారు. జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవడంతోపాటు పునరుద్ధరణ దరఖాస్తులను ఈనెల 15 వరకు సమర్పించేందుకు అవకాశముందని పేర్కొన్నారు. 2024 వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు తాజాగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులను పునరుద్ధరణ చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు http://scholarship.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ నోడల్ అధికారులు (ఐఎన్‌ఓ) పరిశీలించేందుకు చివరి తేదీ ఈనెల 30 వరకు ఉందని తెలిపారు. టాప్ 20 పర్సెంటైల్ సాధించి తాత్కాలికంగా ఎంపికైన 59,355 మంది విద్యార్థుల జాబితాను tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు. వారిలో జనరల్ అభ్యర్థులు 13,676 మంది, ఓబీసీలు 32,392 మంది, ఎస్సీలు 8,089 మంది, ఎస్టీలు 5,198 మంది ఉన్నారని తెలిపారు.

కులగణన విధులు ఉపాధ్యాయులందరికీ కేటాయించాలి : తపస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల ఆరో తేదీ నుంచి నిర్వహించే కులగణన విధులను ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు కేటాయించడాన్ని తపస్ తీవ్రంగా ఖండించింది. ఉపాధ్యాయులందరికీ కేటాయించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాఠశాలలను నడిపి మధ్యాహ్నం తర్వాత సర్వే చేయాలంటూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. కానీ ఆ సమయంలో ఇండ్లలో ప్రజలు ఎవరూ ఉండబోరనీ, పనులకు వెళ్తారని పేర్కొన్నారు. ఆ సర్వే వల్ల ఎలాంటి ప్రయోజనం లేదంటూ ఉప ముఖ్యమంత్రి భట్టికి వివరించామని గుర్తు చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఉపయోగించుకోవాలని సూచించారు. బడులకు రెండు రోజులు సెలవులిచ్చి ఉదయం పూట మాత్రమే సర్వే చేపట్టాలని కోరారు. ఎస్జీటీలకు సర్వే బాధ్యతలు కేటాయించడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు.

ఎస్జీటీలకు సర్వే అప్పగించడం వివక్ష : ఎస్జీటీయూ

కులగణన విధులను ఎస్జీటీలకే కేటాయించడం వివక్ష అని ఎస్జీటీయూ విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్జీటీల పట్ల వివక్షను విడనాడాలనీ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకూ కులగణన విధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సర్వేలో ఉపాధ్యాయులందరినీ భాగస్వామ్యం చేయాలి : టీఎస్‌పీటీఏ

కులగణన విధుల్లో ఉపాధ్యాయులందరినీ భాగస్వామ్యం చేయా లని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్జీటీలకే సర్వే విధులను కేటాయిస్తూ ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపడతామని తెలిపారు.

నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ వేగం పెంచాలి

- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి : వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నర్సింగ్ కళాశాలల్లో తరగతుల ప్రారంభానికి ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. తక్షణం విద్యార్థినులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో 15 మెడికల్ కళాశా లలకు అనుబంధంగా 15 నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో జనగాం, భూపాలపల్లి, కరీంనగర్, కొడంగల్, అందోల్, ఆసిఫాబాద్, మెదక్, కుత్బుల్లాపూర్, ములుగు, నారాయణపేట, నిర్మల్, రామగుండం, మహేశ్వరం, నర్సంపేట, యాదాద్రిలో నర్సింగ్ కళాశాలలున్నాయని చెప్పారు. రాష్ట్ర వైద్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఎండీ హేమంత్ సహదేవ్‌రావుతో కలిసి సమీక్షించారు.

లెబనాన్‌పై దాడుల్లో 52మంది మృతి

- దీటుగా జవాబు చెబుతాం : ఖమేని ఎర్ర సముద్ర తీరంలో ఇరాక్ డ్రోన్ దాడులు
- కంటి తుడుపు చర్చలేనన్న హమాస్

గాజా/ బీరుట్ : తాజాగా లెబనాన్‌పై ఇజ్రాయిల్ ఆర్మీ జరిపిన దాడుల్లో 52మంది మరణించగా, 72మంది గాయపడ్డారు. లెబనాన్‌లోని ఈశాన్య ప్రాంతంలోని గ్రామాల్లో ఇజ్రాయిల్ ముమ్మరంగా వైమానిక దాడులకు పాల్పడింది. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న తరుణంలో ఇజ్రాయిల్ ఈ దాడులకు తెగబడింది. ఖాన్ యూనిస్ పట్టణంలో 20మంది వున్న ఇంటిపై దాడి జరగడంతో తొమ్మిది మంది మరణించారు. అమజ్ పట్టణంలో జరిగిన దాడిలో 12మంది మరణించారు. ఈశాన్య ప్రాంతంలోని 12కి పైగా గ్రామాల్లో జరిగిన పలు దాడుల్లో 31మంది చనిపోయారు. మొత్తంగా ఈ దాడుల్లోనే 52మంది మరణించారని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. దాంతో కుటుంబాలకు కుటుంబాలు చేతికందిన దాన్ని పట్టుకుని భయంతో దట్టమైన ఆ పొగలు, విధ్వంసం మధ్యనే ఆ ప్రాంతాన్ని వీడి వచ్చేస్తున్నారు. ఇప్పటివరకు లెబనాన్‌పై దాడులతో దాదాపు 14లక్షల మంది నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి సంస్థలు అంచనా వేశాయి.



కంటి తుడుపు చర్చలు : హమాస్

కాల్పుల విరమణ చర్చలు కంటి తుడుపు చర్య మాత్రమేనని హమాస్ విమర్శించింది. గాజాపై దాడులు కొనసాగించేందుకు అవసరమైన సమయం కోసం ఈ చర్చల పేరుతో నెతన్యాహు తమకు కావాల్సిన సమయాన్ని తీసుకుంటున్నారని హమాస్ ప్రతినిధి సామి అబూ జుహరీ విమర్శించారు. ఇజ్రాయిల్ దురాక్రమణను నిలువరించడం, బలగాల ఉపసంహరణ, నిర్వాసితులైన పాలస్తీనియన్లను తిరిగి మాతృ దేశానికి రప్పించడం వంటి ప్రతిపాదనలేవీ కాల్పుల విరమణ ప్రతిపాదనల్లో లేవని ఆయన విమర్శించారు. పాలస్తీనియన్లకు ఎంతగానో అవసరమైన భద్రత, సుస్థిరత, స్వాంతన, పునర్నిర్మాణం వంటి అంశాలేవీ ఈ ప్రతిపాదనల్లో వుండడం లేదని హమాస్ సీనియర్ అధికారి బాసెమ్ నయీమ్ విమర్శించారు.

దీటుగా బదులిస్తాం: ఖమేనీ

తాజాగా ఇజ్రాయిల్ జరిపిన దాడికి దీటుగా బదులిస్తామనిఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేని అన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణపూర్తి దాడులు అంతకంతూ విస్తరించి, పశ్చిమాసియా ప్రాంత యుద్ధంగా దీనిని మార్చాలని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు చూస్తున్నాయి. ఖమేని ప్రసంగ వీడియోను ఇరాన్ ప్రభుత్వ మీడియా విడుదల చేసింది. దాడి ఎప్పుడు చేసేది వెల్లడించలేదు. దక్షిణ ఇజ్రాయిల్‌లో ఎర్ర సముద్రం తీరంలో ఇలట్ రిసార్ట్‌పై నాలుగు డ్రోన్ దాడులు జరిపినట్లు ఇరాక్‌లోని సంకీర్ణ గ్రూపులు ప్రకటిం చాయి. కీలకమైన లక్ష్యాలపైనే దాడి చేసినట్లు పేర్కొన్నాయి.

గాజా దాడుల్లో 20మంది మృతి ఉత్తర గాజాలో చిక్కుకున్న 4వేల మంది గర్భిణులు

గాజాలో శనివారం తెల్లవారుజాము నుండి జరిగిన దాడుల్లో 20మంది మరణించారు. దాడుల తర్వాత విధ్వంసం చాలా తీవ్రంగా వుందని అక్కడి మీడియా బృందాలు పేర్కొన్నాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో 20మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ సైనికులు అదుపులోకి తీసుకున్నారు. మరోపక్క ఉత్తర గాజా దిగ్బంధనం ఇప్పటికి గత నాలుగు వారాలుగా కొనసాగుతోంది. దాదాపు నాలుగు వేల మంది గర్భిణులు ఆ ప్రాంతంలో చిక్కుకుపో యారని ఐక్యరాజ్య సమితి జనాభా నిధి (యుఎన్ఎఫ్‌పిఎ) పేర్కొంది.

మూసీ ప్రక్షాళన తప్పక చేయాల్సిందే

- ఓట్ల కోసమే బీజేపీ నార్త్, సౌత్ విభేదాలు : ఢిల్లీలో మీడియాతో సీపీఐ జాతీయ కార్యాదర్శి నారాయణ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మూసీ ప్రక్షాళనను ఎవరు అడ్డుకున్నా.. వాళ్ల హైదరాబాద్‌కు ద్రోహం చేసిన వాళ్లే అవుతారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సిటీలోని ఫిరంగి నాలా ఆక్రమణలను ఖాళీ చేయించాలని, మూసీ ప్రక్షాళన చేపట్టాలని తాను ముందు నుంచి డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకంగా మూసీ ప్రక్షాళన చేయాలని తాను పార్టీ సెక్రెటరీగా పాదయాత్ర కూడా చేసినట్టు చెప్పారు. ఇప్పుడు కూడా తాను, పార్టీ అదే మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. అయితే మూసీ విషయంలో బీజేపీ లోనే ద్వంద వైఖరి ఉందని తెలిపారు. ఒక వర్గం మూసీ ప్రక్షాళనను స్వాగతిస్తుంటే.. మరో వర్గం విమర్శిస్తున్నాయని చెప్పారు. ఇక బీఆర్ఎస్ ఈ విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. శనివారం ఢిల్లీలోని సీపీఐ కార్యాలయం అజయ్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ ప్రక్షాళన తప్పక చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. అయితే ఏ ఒక్క బాధితుడికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలనేది తమ ప్రతిపాదనన్నారు. ప్రపంచంలోని పలు ప్రముఖ దేశాలలోని సిటీలతో పాటు ఏపీలోని తెనాలిలో ఊరి మధ్య నుంచి అందమైన కాలువ వెళ్తు ఉందన్నారు. అలాంటి మంచి కాలువలు ఉండాలి కానీ, మూసీలాంటి మురికి కాలువలు కాదన్నారు. హైదరాబాద్‌కు రైల్లో వెళ్లే ప్రయాణికులు మూసీ కంపు వాసన రాగానే సిటీ వచ్చిందనే గుర్తించే వరెస్ట్ స్థితి ఉందన్నారు. మూసీ ఎఫ్టీఎల్ విషయంలో ప్రభుత్వం రాజీ పడకూడదన్నారు. ఫస్ట్ మూసీ రివర్ డెవలప్మెంట్ పై ఫోకస్ చేసి... తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల పరిరక్షణ చేపట్టాలని సూచించారు.

> ఈ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించే వాళ్లు.. హైదరాబాద్ ద్రోహులే

నార్త్, సౌత్ విభేదాలు సృష్టిస్తున్నారు

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పాలన ముదనష్టంగా ఉండి... బీజేపేతర ప్రాంతాల్లో పాలనపై ప్రధాని మోడీ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని నారాయణ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ పాలన తీరు, ఉచితాలపై మోడీ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఇప్పటికే విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై పొలిటికల్‌గా మోడీ ఒకవైపు, అడ్మినేషన్ పరంగా గవర్నర్లతో మరోవైపు నుంచి దాడి జరుగుతుందన్నారు. దీంట్లో భాగంగా సౌత్, నార్త్ పేరిట కామెంట్లతో దేశాన్ని విచ్ఛిన్నం చేసి... నార్త్ ఇండియాలో మెజార్టీ ఓట్లతో సాధించేలా రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ పేరుతో దేశాన్ని ఐక్యంగా ఉంచొద్దన్న యోచనలో బీజేపీ ఉందన్నారు. ప్రాంతీయ పార్టీలు బలపడే కొద్ది... జాతీయ పార్టీలకు నష్టం ఉంటుందన్నారు. అది లెఫ్ట్ పార్టీలకు ఏం అతీతం కాదన్నారు. ఒకప్పుడు బంద్‌లు, రాస్తారోకోలు, జన జీవనాన్ని స్థంభింపజేసే పరిస్థితులు ఉండేవన్నారు. అయితే ఇప్పుడు ఆ ఆధారాలు తగ్గాయని చెప్పుకొచ్చారు.

మహేశ్వర్ రెడ్డిది చిలకజోస్యం...

త్వరలో తెలంగాణ సీఎంని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ మార్చుతుందంటూ బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి చిలక జోస్యం చెబుతున్నారని నారాయణ ఎద్దేవా చేశారు. చిలక జోస్యానికి, ప్రాక్టికల్‌కు సంబంధం లేదన్నారు. మహేశ్వర్ రెడ్డివి కేవలం కలలు మాత్రమే అన్నారు. తెలంగాణ సీఎం మారాల నేది బీజేపీ ఆశ అని... అది నిరాశగానే మిగులుందన్నారు.

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్ శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలంటూ అధికారుల కమిటీ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదించిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన దస్త్రంపై గతనెల 30న ఆయన సంతకం చేశారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాలయాలు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థలు, ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంస్థలోపాటు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థలో చదువుతున్న విద్యార్థులకు ఈ పెంపు వర్తిస్తుందని తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరం నుంచి మెస్, కాస్మోటిక్ చార్జీలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. వాటిని ఇప్పుడు పెంచామని వివరించారు.

నిత్యావసర వస్తువుల ధరలు ముఖ్యంగా కూరగాయలు, నూనెలు, చక్కెర, ఆహార పదార్థాలు, గ్యాస్ వంటి ధరలు పెరిగాయని తెలిపారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచామని పేర్కొన్నారు. మెస్, కాస్మోటిక్ చార్జీల పెంపు ఈనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయని వివరించారు. ఈ నిర్ణయం వల్ల సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

మెస్ చార్జీల పెంపు

కేటగిరీ	ప్రస్తుత చార్జీలు	పెంచిన చార్జీలు
3 నుంచి ఏడో తరగతి	రూ.950	రూ.1,330
8 నుంచి పదో తరగతి	రూ.1,100	రూ.1,540
ఇంటర్ నుంచి పీజీ	రూ.1,500	రూ.2,100

కాస్మోటిక్ చార్జీల పెంపు

తరగతి	ప్రస్తుత చార్జీలు	పెంచిన చార్జీలు
3 నుంచి ఏడు (అమ్మాయిలు)	రూ.55	రూ.175
8 నుంచి పది (అమ్మాయిలు)	రూ.75	రూ.275
3 నుంచి ఏడు (అబ్బాయిలు)	రూ.62	రూ.150
8 నుంచి పది (అబ్బాయిలు)	రూ.62	రూ.200

ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా

అరుదైన గుండె జబ్బుకు నిమ్స్‌లో చికిత్స

దేశంలోనే తొలిసారిగా 35ఎంఎం వాల్వ్‌ను అమర్చిన వైద్యులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ గుండె వైద్య నిపుణులు దేశంలోనే తొలిసారిగా 20 ఏండ్ల రోగి ఒకరికి 35 మిల్లీమీటర్ల కొలత కలిగిన వాల్వ్‌ను అమర్చారు. గుండె కుడి కవాటం నుంచి పల్మనరీ ఆర్టరీ వరకు దీనిని రక్త ప్రసరణకు ఆటంకాలు కలగకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడనున్నది. దీనికి తోడు ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే కేవలం రెండు, మూడు గంటల వ్యవధిలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులు రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు వసూలు చేస్తున్న ఈ చికిత్సను నిమ్స్‌లో సీఎంఆర్ఎఫ్ కింద కేవలం రూ.15 లక్షల ఖర్చుతో పూర్తి చేశారు. ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను శనివారం హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో కార్డియాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఒ.సాయి సతీష్ వివరించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నారాయణపూర్‌కు చెందిన బానోత్ అశోక్‌కు 20 సంవత్సరాలు. అతను పుట్టుకతోనే గుండె జబ్బుతో జన్మించాడు. తన ఐదో ఏటా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నీలిరంగులోకి మారిపోవడం వంటి లక్షణాలు ఉండటంతో సమీపంలోని ప్రయివేటు ఆస్పత్రి లో ఆపరేషన్ చేయించుకున్నాడు. గడిచిన నాలుగేండ్ల వరకు ఆరోగ్యంగా ఉన్న తను శ్వాస తీసుకోవడం లో ఇబ్బంది, గుండెదడ రావడంతో పలు కార్పొరేట్ ఆస్పత్రులను సంప్రదించాడు. రోగనిర్ధారణలో అతను పల్మనరీ వాల్వ్ నుంచి రక్తం వెళ్లే మార్గంలో ఇబ్బందిని ఎదుర్కొంటున్నట్టు బయటపడింది. దీంతో ఇతర అవయవాలకు వెళ్లాల్సిన రక్తం తిరిగి వెనక్కి రావడంతో ప్రాణాలకే ముప్పు ఉండొచ్చని గుర్తించారు. అయితే చికిత్సకు కార్పొరేట్ చెప్పిన మొత్తం ఖర్చు భరించే స్తోమత లేని వారు నిమ్స్‌ను ఆశ్రయించారు.

అక్కడి వైద్యులు పరీక్షలు చేసి ఓపెన్ హార్ట్ సర్జరీ మరోసారి చేయడం మంచిది కాదని నిర్ణయించారు. దీంతో వాల్వ్‌ను తొడ భాగం నుంచి పంపించి అమర్చేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే 20 ఏండ్ల వయస్సు, రోగికి 35 ఎంఎం వాల్వ్ అవసరమైంది. వాల్వ్‌లను తయారు చేసే కంపెనీలు ఆ సైజ్‌వి ఉత్పత్తి లేవని చెప్పడంతో సమస్య మొదలైకొచ్చింది. దీంతో నిమ్స్ చొరవ తీసుకోవడంతో కంపెనీ ప్రత్యేకంగా 35ఎంఎం వాల్వ్‌ను సరఫరా చేసింది.

ఆపరేషన్ విజయ వంతం కావడంతో రోగిని డిశ్చార్జ్ చేస్తున్నట్టు డాక్టర్ సాయి సతీష్ తెలిపారు. గర్భవతులుగా ఉన్న సమయంలో వైరల్ ఇన్ఫెక్షన్లు, కొన్ని రకాల మం దుల వాడకం ద్వారా ఇలాంటి లోపాలతో పిల్లలు పుట్టే ప్రమాదముందని హెచ్చరించారు. గుండె జబ్బులకు సంబంధించిన కుటుంబ వారసత్వ చరిత్ర కలిగిన వారు గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో జన్యు సలహాలు, కౌన్సిలింగ్ తీసుకుంటే మంచిదని డాక్టర్ సాయి సతీష్ సూచించారు. మేనరికపు వివాహాల కారణం గా అన్ని రకాల జబ్బులు వచ్చే అవకాశముం దని తెలిపారు. ఈ సమావేశంలో బానోత్ అశోక్‌తో పాటు ఆయన తల్లి పాల్గొన్నారు. కాగా ఈ ప్రొసీజర్‌ను డాక్టర్ సాయి సతీష్ నేతృత్వంలో డాక్టర్ హేమంత్, డాక్టర్ శైలేష్ భాటియా, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అమర్ నాథ్, డాక్టర్ తియగు, అనేస్తియటిస్ట్ డాక్టర్ అద్నాన్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్లు ఓం ప్రకాష్, ప్రమీల, ఎం.శ్రీనివాస్ బాబు, సిస్టర్స్ ఫ్లోరెన్స్, మీనా కుమారి విజయవంతం చేశారు.

రిజర్వేషన్ దామాషా ఖరారుకే..

- బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం : రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్
- విజ్ఞప్తులను స్వీకరించిన బీసీ కమిషన్



నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ దామాషాను ఖరారు చేసేందుకు బహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. బహిరంగ విచారణలో భాగంగా రాష్ట్ర బీసీ కమిషన్ బృందం ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వివిధ కుల సంఘాల ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించింది. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి అభిప్రాయాలు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే ప్రారంభమవుతుందని, సర్వే జరిగేటప్పుడు తమ వివరాలను ఎన్యుమరేటర్లకు అందించాలని చెప్పారు. ఆయా జిల్లాల కలెక్టర్లు బీసీల స్థితిగతుల ఆధారంగా వివిధ అవకాశాల కల్పనకు కృషి చేయాలన్నారు. కొన్ని కులాలు తమ కులం పేర్లను మార్చాలని నివేదించాయని, కమిషన్ ఇందుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. సర్వేలో అన్ని కుటుంబాలు నమోదయ్యేలా ఆయా కుల సంఘాల ప్రతినిధులు చూడాలని చెప్పారు. అంతకుముందు జిల్లా కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, సభ్యులకు హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, దివాకర, రిజ్వాన్ భాషా షేక్ మొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎండీ రియాజ్, అదనపు కలెక్టర్లు వెంకటొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూటమి గెలుపుతోనే రాజ్యాంగ పరిరక్షణ

- జార్ఖండ్ ఎన్నికల్లో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ కూటమి విజయంతోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమని జార్ఖండ్ ఎన్నికల పరిశీలకులు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. శనివారం జార్ఖండ్ రాష్ట్రంలోని రాంఘడ్ నియోజకవర్గంలో విస్తృతంగా ఆయన పర్యటించారు. రాంఘడ్ నియోజకవర్గంలోని దుల్మి, చిత్తార్పూర్, గోలాస్ బ్లాక్‌లలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం, బూత్ స్థాయి సమావేశాలు, సోషల్ మీడియా ప్రచారం తదితరాంశాలపై స్థానిక బ్లాక్ కాంగ్రెస్ నేతలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రాంఘడ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మమతాదేవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ, భావ ప్రకటన, అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వం ఉండాలని సూచించారు. ఆ లక్ష్యం నెరవేరాలంటే ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోపాటు స్థానిక నేతలతో కూటమి మ్యానిఫెస్టోలపై ఆయన చర్చించారు. సమావేశంలో డిప్యూటీ సీఎంతోపాటు ఏఐసీసీ మెంబర్ సుధాకర్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు తారిఖ్ అన్వర్, కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు షాజాద్ అన్వర్, రాంఘర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బజరంగ్ మహతో, జిల్లా అధ్యక్షులు మున్నా పాశ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

మెస్‌చార్జీల పెంపు హర్షనీయం

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడం పట్ల ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెస్ చార్జీలను మూడు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1,330 వరకు, ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1,110 నుంచి రూ.1,540 వరకు, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.1,500 నుంచి రూ.2,100 వరకు పెంచిందని తెలిపారు. కాస్మోటిక్ చార్జీలు మూడు నుంచి ఏడో తరగతి విద్యార్థినులకు రూ.55 నుంచి రూ.175 వరకు, ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థినులకు రూ.75 నుంచి రూ.275 వరకు, అబ్బాయిలకు మూడు నుంచి ఏడో తరగతి వరకు రూ.62 నుంచి రూ.150 వరకు, ఎనిమిది నుంచి పదో తరగతి అబ్బాయిలకు రూ.62 నుంచి రూ.200 వరకు పెంచుతూ జీవో 9ని ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈ చార్జీల పెరుగుదలతో విద్యార్థినీ, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గురుకుల పాఠశాలల టైం టేబుల్ మార్పు, డిప్యూటీ వార్డెన్ల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

ప్రయివేట్ బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- 31 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం





నవతెలంగాణ-కోదాడరూరల్

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని కట్టకొమ్ముగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం తెల్లవారుజామున ఆగి ఉన్న ప్రయివేటు బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. 31 మందికి గాయాలయ్యాయి. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి రాజమండ్రి గోకవరానికి ప్రయాణికులతో వెళ్తున్న మహి ట్రావెల్స్ బస్సును డ్రైవర్ కోదాడ సమీపంలో 65వ నెంబర్ జాతీయ రహదారి పక్కన కొద్దిసేపు ఆపారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వేగంగా ఢీకొంది. దీంతో రెండు బస్సుల్లోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన 31 మందిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు ముందు భాగం సగం వరకు పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణికుల్లో వెంకటేశ్వరరావు, కె.మణి, దానియేలు పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైన నవ్య, ఆదిత్య, తేజ, డేవిడ్‌కు కోదాడలోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని టౌన్ పోలీసులు తెలిపారు.

మొయినాబాద్ గురుకుల కోడింగ్ పాఠశాలపై అసత్య ప్రచారం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మొయినాబాద్ ప్రాంతంలోని ప్రత్యేక పాఠశాలగా ప్రారంభమైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కోడింగ్ పాఠశాలని మూసేస్తున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ పాఠశాలని శంకర్‌పల్లి బాలికల గురుకుల పాఠశాలకు అనుసంధానంగా మార్చినట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన కోడింగ్ నైపుణ్యాన్ని నేర్పించేందుకు నిర్మాణాత్మక చర్యల్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

'సేంద్రియం' సర్వరోగ నివారిణి కాదు

ఎరువులు, క్రిమిసంహారకాల వినియోగం ఉండదు | పోషక విలువలూ ఎక్కువే

కానీ ఎల్లవేళలా సురక్షితం కావు
కలుషితం కాలేదన్న గ్యారంటీ లేదు
కొనుగోలులో జాగ్రత్తలు అవసరమన్న నిపుణులు

ఇప్పుడు ఎవరి నోట విన్నా సేంద్రియ ఆహారం గురించిన ప్రస్తావనే ఎక్కువగా వినిపిస్తోంది. సోషల్ మీడియా పుణ్యమా అని దానికి విశేష ప్రచుర్యమూ లభిస్తోంది. ఖర్చు ఎక్కువే అయినా సేంద్రియ ఆహార పదార్థాల కొనుగోలుకే మధ్య తరగతి ప్రజలు, సంపన్నులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్య రక్షణపై అవగాహన పెరగడమే దీనికి కారణం. సేంద్రియ పంటలు అంటే ఏమిటి? రసాయనాలు, కీటక నాశనులు ఉపయోగించకకుండా పండించినవే సేంద్రియ పంటలు. వాటి ద్వారా తయారైనవే సేంద్రియ ఆహార పదార్థాలు. జన్యుపరంగా అభివృద్ధి చేసినవి సేంద్రియ పంటలు కావు. మరి ఈ ఉత్పత్తులు సురక్షితమైనవేనా లేక వ్యాపారాభివృద్ధి కోసం కంపెనీలు పన్నిన మాయాజాలమా అనేది తెలుసుకోవడం కష్టమే.

సేంద్రియం అంటే...

న్యూఢిల్లీ : ఎలాంటి క్రిమిసంహారకాలను ఉపయోగించకుండా, రసాయన ఎరువులు వేయకుండా, జన్యుపరంగా అభివృద్ధి చేయకుండా సహజసిద్ధంగా లభించే వాటిని ఉపయోగించి పండించేవే సేంద్రియ ఉత్పత్తులు. సేంద్రియ వ్యవసాయంలో భూ ఆరోగ్యం సంరక్షించ బడుతుంది. క్రిమికీటకాలను అరికట్టేందుకు సహజసిద్ధమైన పద్ధతులనే అనుసరిస్తారు. పర్యావరణ ప్రభావం తక్కువగా ఉంటుంది. ప్రకృతి వ్యవసాయం జీవ వైవిధ్యాన్ని కాపాడుతుంది.

పోషకాలు ఎక్కువే కానీ...

అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే సేంద్రియ, సహజ ఆహారాలు ఒకటి కావు. సహజ ఆహారాలన్నీ సేంద్రియ ఆహార పదార్థాలు కావు. అయితే సేంద్రియ ఆహార పదార్థాలన్నీ సహజమైనవే. సహజ ఆహార పదార్థాలు అని చెప్పడానికి సరైన నిబంధనలేవీ అమలులో లేవు. కృత్రిమ రంగు, రుచి లేనివి, నిల్వ చేయడానికి రసాయనాలు వాడని వాటిని సాధారణంగా సహజ ఆరోగ్య పదార్థాలు అంటాము. కానీ అవి జన్యుపరంగా అభివృద్ధి చేసినవి కావని, వాటిలో సింథటిక్ ఎరువులు వాడలేదని చెప్పడం కష్టం. ఇతర ఆహార పదార్థాలతో పోలిస్తే సేంద్రియ ఆహార పదార్థాలలో యాంటీఆక్సిడెంట్లు, కొన్ని విటమిన్లు, ఖనిజాలు కొంతమేర ఎక్కువగానే ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆహార పదార్థాలలో పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలంటే భూ నాణ్యత, పంట రకం, సీజన్, నిల్వ పద్ధతులు కీలక పాత్ర పోషిస్తాయి. ఆహార పదార్థాల లేబుల్‌పై పోషక విలువలు ముద్రించినంత మాత్రాన సరిపోదు.

ఈ జాగ్రత్తలు అవసరం

ఏదేమైనా ఇంటి బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకోవడం అవసరం. ఉత్పత్తులు సేంద్రియ మైనా కాకపోయినా పోషక విలువలు సమృద్ధిగా ఉన్నవైతే చాలు. సమతూకమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. సంప్రదాయ ఉత్పత్తులతో పోలిస్తే సేంద్రియ ఆహార ఉత్ప త్తులలో క్రిమిసంహారకాల వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ, అవి పర్యావరణానికి మేలు కలిగించినప్పటికీ, ప్రత్యేక వ్యవసాయ పద్ధతులు పాటించి పండించినప్పటికీ అవి ఎల్లప్పుడూ సురక్షిత మైనవని చెప్ప లేము. సంప్రదాయ పంటల ఉత్పత్తులతో పోలిస్తే వాటిలో అధిక పోషకాలు ఉంటాయనీ చెప్పలేము. సేంద్రియ ఆహార ఉత్పత్తుల లేబుల్‌పై ఉన్న విషయాలను తెలుసుకొని కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచించారు. అందులో చక్కెర ఏ మేరకు ఉన్నది, నిల్వ చేయడానికి ఏవైనా రసాయనాలు వాడారా అనేది చూడాలి. ఇండి యా ఆర్గానిక్, యూఎస్‌డీఏ, జైవిక్ భారత్ వంటి సంస్థలు ఇచ్చిన సర్టిఫికెట్ ఉన్నదా లేదా చూడాలి. సేంద్రియ ఉత్పత్తిని ఆరోగ్యంతో ముడిపెట్టడం సరికాదని డైటీషియన్లు స్పష్టం చేశారు. మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఆ పదార్థాలలో ఏమేమి ఉన్నాయో విధిగా తెలుసుకోవాలి.

ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించుకోవాలని అను కున్న వారికి సేంద్రియ ఆహార ఉత్పత్తులు మంచివే. కానీ అవే సర్వరోగ నివారిణి కావు. మన ఆరోగ్యానికి అవేమీ భరోసా ఇవ్వవు. సేంద్రియ ఉత్పత్తుల ఖర్చు అధికంగా ఉండడం ఆందోళన కలిగించే విషయం. ఈ ఆహార పదార్థాలు ఎక్కువ కాలం నిల్వ ఉండవు. కాబట్టి వృథా అయ్యే అవకాశం ఉంది. ఒక్క విషయం మాత్రం సుస్పష్టం. సేంద్రియ ఉత్పత్తులు ఎల్లవేళలా ఆరోగ్య కరమైనవి కావు. ప్రాసెస్ చేసిన సేంద్రియ ఉత్పత్తు లలో చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయన్న విషయాన్ని మరువకూడదు.

డైటీషియన్లు ఏమంటున్నారు?

ఆరోగ్యకరమైన జీవనం సాగించాలంటే పంటను ఎలా పండించారో పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఏ సీజన్‌లో లభించే ఉత్పత్తులను ఆ సీజన్‌లో బాగా వినియోగిస్తే చాలునని డైటీషియన్లు చెబుతున్నారు. సేంద్రియ ఆహార ఉత్పత్తి అయినా, సంప్రదాయ ఉత్పత్తి అయినా కలుషితం కాలేదన్న గ్యారంటీ ఏమీ లేదని వందనా వర్మ అనే డైటీషియన్ తెలిపారు. క్రిమిసంహారకాలు లేని ఉత్పత్తులు కావాలంటే సేంద్రియ ఉత్పత్తులే మేలని అంటూ యాపిల్, టమాటా వంటి పండ్లు, కూరగాయలను తోలుతో సహా తినే వారు సేంద్రియ పంటనే ఎంచుకోవడం మంచిదని చెప్పారు.



తేడా ఏమిటి?

సంప్రదాయ ఉత్పత్తులు దూర ప్రాంతాలకు రవాణా అవుతుంటాయి. దీంతో వాటిలో తాజా దనం దెబ్బతింటుంది. అదే సేంద్రియ ఉత్పత్తులు స్థానికంగానే లభిస్తాయి. కాబట్టి అవి తాజాగా ఉంటాయి. సేంద్రియ, సంప్రదాయ ఆహార ఉత్పత్తుల మధ్య కన్పించే ప్రధాన తేడా రసాయనాల వినియోగం. సేంద్రియ వ్యవ సాయంలో వీటి వాడకం తక్కువగా ఉంటుంది. విషపూరితమైన రసాయనాలు, క్రిమిసంహారక మందులపై ఆధారపడరు. అయితే సేంద్రియ ఉత్పత్తులు త్వరగా పాడైపోతాయి. ఎందుకంటే వీటిని నిల్వ చేయడానికి ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. ఇక సేంద్రియ ఆహార ఉత్పత్తుల వ్యయం అధికంగానే ఉంటుంది. ఎందుకంటే వాటి లభ్యత తక్కువ. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన వారు సేంద్రియ ఉత్పత్తుల జోలికి పోరు.

మంకీపాక్స్ దడ..

- కాంగో, ర్వాండాల్లో 50వేల మందికి వ్యాక్సినేషన్ : డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడి

జెనీవా : డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ర్వాండాల్లో 50వేల మందికి పైగా ప్రజలకు మంకీ పాక్స్ (ఎంపాక్స్) వ్యాక్సినేషన్‌ను అందజేసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) చీఫ్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ తెలిపారు. అమెరికా, యురోపియన్ కమిషన్ అందజేసిన విరాళాల ఫలితంగా ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ, దాని భాగస్వామ్య పక్షాలు ఏర్పాటు చేసిన యంత్రాంగం కింద దాదాపు తొమ్మిది లక్షల వ్యాక్సిన్ డోసులను తొమ్మిది దేశాలకు కేటాయించామని ఆయన విలేకర్లకు తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దాదాపు 60లక్షల డోసులు అందుబాటులో వుంటాయని చెప్పారు. ఈ వ్యాధి ఇప్పటికీ ఇంకా అదుపులోకి రాలేదని ఆఫ్రికన్ యూనియన్ ఆరోగ్య పర్యవేక్షణ సంస్థ గురువారమే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆయన ప్రకటన వెలువడింది. కోవిడ్ కన్నా మరింత తీవ్రమైన అంటువ్యాధి కాకుండా నివారించాలంటే ముందుగానే జాగ్రత్తపడాల్సి వుందని, ఇందుకోసం అవసరమైన వనరులను అందించాల్సిందిగా కోరింది. ఇప్పటివరకు ఆఫ్రికాలో 1100మందికి పైగా ఎంపాక్స్‌తో మరణించారు. జనవరి నుంచి 48వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. మెజారిటీ మరణాలు కాంగోలో సంభవించాయి. దీంతో గత నెలలో ఇక్కడ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను చేపట్టారు.



మంకీపాక్స్ లక్షణాలతో తిరుచ్చి ప్రభుత్వాస్పత్రిలో వ్యక్తి ఐసొలేషన్

షార్జా నుంచి వచ్చిన 32ఏండ్ల వ్యక్తి ఎంపాక్స్ లక్షణాలతో బాధపడుతుండడంతో తిరుచ్చి ప్రభుత్వా సుపత్రిలో ఐసొలేషన్ వార్డులో వుంచారు. గురువారం తెల్లవారు జామున ఎయిర్ ఇండియా విమానంలో వచ్చిన ఆ వ్యక్తి షార్జాలో ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడని అధికారులు తెలిపారు. స్వల్పంగానే లక్ష ణాలు కనిపిస్తున్నాయని, ఆ వ్యక్తి నమూ నాలను సేకరించి చెన్నైకు పరీక్షల నిమిత్తం పంపినట్లు పేర్కొన్నారు. ఇంకా ఫలితాలు రావాల్సి వుందన్నారు. అప్పటివరకు ఐసొ లేషన్‌లో వుంచుతామని తెలిపారు.

అసంబద్ధం... నిరాధారం

కెనడా ఆరోపణలపై భారత్ నిరసన
హై కమిషన్ అధికారికి సమన్లు

న్యూఢిల్లీ : తమ దేశంలో ఖలిస్తాన్ వేర్పాటువాదుల హత్య వెనుక కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రమేయం ఉన్నదంటూ కెనడా చేసిన ఆరోపణలపై భారత్ నిరసన వ్యక్తం చేసింది. కెనడా హై కమిషన్‌కు చెందిన అధికారిని పిలిపించి తన నిరసన తెలియజేసింది. కెనడా చేసిన ఆరోపణలు అసంబద్ధంగా ఉన్నాయని, వాటికి ఆధారాలేమీ లేవని స్పష్టం చేసింది. కెనడా ప్రభుత్వం భారత అధికారులపై ఆడియో, వీడియో నిఘా వేయడాన్ని తప్పుపట్టింది. 'కెనడా హై కమిషన్ కార్యాలయానికి చెందిన ప్రతినిధులను శుక్రవారం పిలిపించాం. ఒట్టావోలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంపై దౌత్యపరమైన నోట్‌ను అందించాము' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శనివారం విలేకరులకు తెలిపారు. కేంద్ర హోం మంత్రిని ఉద్దేశించి చేసిన అసంబద్ధమైన, నిరాధారమైన ఆరోపణలపై ఆ నోట్‌లో తీవ్ర నిరసన వ్యక్తం చేశామని చెప్పారు. భారత్‌ను అప్రదిష్టపాలు చేసేందుకు, ఇతర దేశాలలో పలుచన చేసేందుకు ఉద్దేశించిన వ్యూహంలో భాగంగానే కెనడా ఇలాంటి నిరాధారమైన ఆరోపణలను అంతర్జాతీయ మీడియాకు లీక్ చేస్తోందని జైస్వాల్ మండిపడ్డారు. ఇలాంటి బాధ్యతా రాహిత్యమైన చర్యలు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని ఆయన అన్నారు.


ఒడిశాలో రోడ్డు ప్రమాదం

ఆరుగురి మృతి

భువనేశ్వర్ : ఒడిశాలోని సుందర్‌ఘర్ జిల్లాలో శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారు. హేమగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గైకనపాలి ప్రాంతంలో నిలిపి ఉన్న ట్రక్కును ప్రయాణీకులతో ప్రయాణిస్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. దట్టంగా ఉన్న పొగమంచు కారణంగా ప్రమాదం సంభవించి ఉండవచ్చునని చెప్పారు. మృతుల్ని జిల్లాలోని కందగోడ, సమర్పింద గ్రామాలకు చెందిన వారుగా గుర్తించారు. గాయపడిన వారిని సమీపంలోని స్థానిక ఆసుపత్రికి తరలించినట్లు అధికారి తెలిపారు. బాధితులంతా కళాకారులు. ఒక సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించిన అనంతరం తమ ఇళ్లకు తిరిగి వెళు తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానికులు రోడ్డుపై ఆందోళనకు దిగారు.

జమ్ముకాశ్మీర్‌లో
జంట ఎన్‌కౌంటర్లు

ముగ్గురు ఉగ్రవాదులు మృతి
నలుగురు భద్రతా సిబ్బందికి గాయాలు



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో శనివారం జరిగిన జంట ఎన్‌కౌంటర్లలో మొత్తంగా ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారు. మరో నలుగురు భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. శనివారం శ్రీనగర్ జిల్లాలోని ఖన్యార్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది మరణించాడు. మృతుడు పాకిస్థాన్‌లోని లష్కరే తోయిబాకు చెందిన సీనియర్ ఉగ్రవాది అని ఒక పోలీస్ అధికారి చెప్పారు. అలాగే ఈ ఎన్‌కౌంటర్‌లో సిఆర్‌పిఎఫ్‌కు చెందిన ఇద్దరు జవాన్లు, ఇద్దరు పోలీసులు గాయపడినట్లు తెలిపారు. వీరిని ఆర్మీకి చెందిన 92 బేస్ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. ఖన్యార్ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కొని ఉన్నారనే ఖచ్చితమైన సమాచారంతో భద్రతా సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఎన్‌కౌంటర్ ఘటన చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. అలాగే శనివారం అనంతనాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. వీరిలో ఒకరు విదేశీయుడని, మరొకరు స్థానికుడు అని ఆర్మీ అధికారులు చెప్పారు. జిల్లాలోని హల్కన్ గలి ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ప్రాంతంలో ఇంకా మరికొంత మంది ఉగ్రవాదులు దాక్కొని ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని అధికారులు చెప్పారు.







పేదల గొంతుకగా పోరాడేది ఎర్రజెండానే..

- అదానీ కంపెనీలకు రాయితీలు.. ఉపాధి హామీకి కోతలా? • పెద్దోళ్ల లాభాలు తప్ప పేదల కష్టాలు పట్టని బీజేపీ

కాంగ్రెస్ పాలనలో ఫ్రీ జర్నీ తప్ప ఒరిగిందేమీ లేదు
పోరాటాలతోనే పాలకులకు బుద్ధి చెప్పాలి : చుక్క రాములు
తూప్రాన్‌లో సీపీఐ(ఎం) మెదక్ జిల్లా మహాసభ ప్రారంభం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కష్టజీవులు, కార్మికులు, కర్షకుల వంటి పేదల గొంతుకగా పోరాడేది.. నినదించేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సీపీఐ(ఎం) మెదక్ జిల్లా 15వ మహాసభ తూప్రాన్ పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్‌లో శనివారం ప్రారంభ మైంది. ఈ సందర్భంగా భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు సర్దార్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం అధ్యక్షతన నిర్వహిం చిన బహిరంగ సభలో చుక్క రాములు ప్రసంగించారు. అదానీ కంపెనీలకు వేల కోట్ల రాయితీలిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు ఉపాధి కల్పించే ఈజీఎస్ పథకానికి మాత్రం నిధుల్లో కోత పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వేళ పేదల జపం చేసిన బీజేపీ.. అధికారంలోకి వచ్చాక మాత్రం పెద్దోళ్ల లాభాల కోసమే పాటుపడుతోందని విమర్శించారు. అన్నం పెట్టే రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నా పట్టించు కోవడం లేదన్నారు. కార్మికవర్గానికి కనీస వేతనాలు పెంచడం లేదన్నారు. కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే కార్మిక హక్కు ల్ని కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిం దన్నారు. కార్పొరేట్ వ్యవసాయం కోసం నల్ల చట్టాలు తెచ్చి రైతుల్ని వీధిన పడేయాలని చూసింద న్నారు. కార్మికులు, రైతులు సుదీర్ఘ పోరాటాలు సాగించిన ఫలితంగానే నల్ల చట్టాలు, లేబర్ కోడ్‌లు ఆగిపోయాయని చెప్పారు. ఉపాధి హామీ చట్టానికి నిధులి వ్వకుండా గ్రామీణ పేదల పొట్టగొడు తోందన్నారు. నైపుణ్యం పేరిట అప్రెంటీస్ విధానం తెచ్చి కంపెనీలకు దోచిపెట్టాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రజా ప్రయోజనాలు నెరవేర్చే ప్రజల ఆర్థిక విధానాల కోసం పోరాడాలని, ఆ పోరా టాలకు సీపీఐ(ఎం) అండగా నిలుస్తుందని చెప్పారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీజర్నీ తప్ప ప్రజలకు చేసిందేమీలేదన్నారు. రైతు, కూలీలకు ఇస్తామన్న భరోసా జాడ లేదన్నారు. అరకొర రుణమాఫీ వల్ల సగం మంది రైతులు రుణగ్రస్తులుగానే మిగిలి పోయా రని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టా లన్నా.. పాలకులకు బుద్ధి చెప్పాలన్నా ప్రజా పోరా టాలే మార్గమని వివరించారు. ఎర్రజెండా పాలనలోనే అన్ని వర్గాల ప్రజల సమస్య లకు శాస్త్రీయమైన పరిష్కారం లభిస్తుందన్నారు.

మహిళలకు రక్షణ లేదు : జయలక్ష్మి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు రక్షణ లేకుండా పోయిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి అన్నారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు వచ్చినా చిత్తశుద్ధితో అమలు చేయకపోవడం వల్ల హింస, దాడులు, లైంగికదాడుల పరంపర కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఈ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి, గొల్లపల్లి జయరాజు, ఎం.అడివయ్య, నాయకులు జె.మల్లికార్జున్, బొప్పని పద్మ, ఎ.మల్లేశం, నర్సమ్మ, కె.మల్లేశం, మహేందర్‌రెడ్డి, బసవరాజు, గోపాలస్వామి, ఎం.నర్సింహులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను పట్టుకుని దాడులపై ప్రశ్నించండి

- కేంద్రానికి ఫరూక్ అబ్దుల్లా సూచన
- ఈ వ్యాఖ్యలపై కేంద్రం స్పందించాలి : శరద్‌పవార్

శ్రీనగర్ : ఉగ్రదాడులు పెరగడం వెనుక సూత్రధారులను గుర్తించడం కోసం ఉగ్రవాదులను హతమార్చడం కంటే వారిని పట్టుకోవాలని జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షులు ఫరూక్ అబ్దుల్లా సూచించారు. పట్టుకున్న ఉగ్రవాదులను విచారించడం ద్వారా ఈ దాడులు నిర్వహించే విస్తృత నెట్‌వర్క్‌లు, మాస్టర్‌మైండ్స్ గురించి తెలుస్తుందని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుద్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. జమ్ముకాశ్మీర్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వం ఏర్పడగానే ఇలా ఎందుకు జరుగుతోంది? ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించిన వ్యక్తులే ఇలా చేశారా? అనే సందేహం ఉంది. ఉగ్రవాదులను పట్టుకుంటే ఇలా ఎవరు చేస్తున్నారో తెలుస్తుంది. అందుకే వారిని చంపకూడదు. వారిని పట్టుకోవాలి. వారి వెనుక ఎవరున్నారో అడగాలి. ఒమర్ అబ్దుల్లాను అస్థిరపరిచేందుకు ప్రయత్నించే ఏజెన్సీ ఉందో లేదో చెక్ చేయాలి' అని అన్నారు. ఉగ్రదాడుల వెనుక పాకిస్తాన్ ప్రమేయం ఉందా లేదా అన్నది కూడా దర్యాప్తులో తెలుస్తుందని పేర్కొన్నారు.

ఫరూక్ వ్యాఖ్యలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలి : శరద్ పవార్

ఫరూక్ అబ్దుల్లా ప్రకటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని మహారాష్ట్రకు చెందిన ఎన్‌సిపి-ఎస్‌పి చీఫ్ శరద్ పవార్ డిమాండ్ చేశారు. 'నివారం బారామతిలో జరిగిన మీడియా సమావేశంలో శరద్ పవార్ మాట్లాడారు. 'జమ్ముకాశ్మీర్‌లో అత్యున్నత వ్యక్తి ఫరూక్ అబ్దుల్లా. జీవితమంతా అక్కడి ప్రజలకు సేవ చేశారు. ఆయన చిత్తశుద్ధి, నిజాయతీపై నాకు ఎలాంటి సందేహం లేదు. అలాంటి నాయకుడు ఏదైనా ప్రకటన చేస్తే, కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా హోంమంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణించాలి. ఆ పరిస్థితిని ఎలా పరిష్కరించవచ్చన్న దానిపై కసరత్తు చేయాలి' అని అన్నారు.

అమెరికాలో హాలోవీన్ సందర్భంగా కాల్పులు

- ఇద్దరు మృతి, ఆరుగురికి గాయాలు



ఓర్లాండో : అమెరికాలో శుక్రవారం తెల్లవారుజామున డౌన్‌టౌన్ ఓర్లాండోలో హాలోవీన్ వేడుకల సందర్భంగా వచ్చిన సమూహంపై ఒక యువకుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురు గాయపడ్డారు. ఓర్లాండో పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం హాలోవీన్ ఉత్సవాల కోసం వందలాది మంది గుమిగూడిన 7 వేర్వేరు క్లబ్‌లతో కూడిన నైట్‌లైఫ్ ప్రాంతం అయిన ది బ్లాక్ వెలుపల కాల్పులు జరిగాయి. గాయపడిన ఆరుగురు వ్యక్తులను "తదుపరి చికిత్స" కోసం ఏరియా ఆసుపత్రులకు తరలించినట్లు అధికారులు తెలిపారు. బాధితుల వయస్సు 19 నుండి 31 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. సంఘటన జరిగిన కొద్దిసేపటికే పోలీసులు నిందితుడిని 17 ఏండ్ల జైలెన్ డ్వేన్ ఎడ్గార్‌గా గుర్తించారు. రెండోసారి జనంపై కాల్పులు జరపడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

నిందితుడు 2023లో గ్రాండ్ చోరీ కేసులో అరెస్టయ్యాడని తెలిపారు.

బొగ్గు బకాయిలు చెల్లించండి

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్

రాంచీ : జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల ప్రచారంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి మోడీ పాల్గొననున్నారు. దీంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జార్ఖండ్ రాష్ట్రానికి రావాల్సిన రూ.1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిలు చెల్లించాలని మోడీని, అమిత్‌షాను కోరారు. ఈమేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నేడు కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా, రేపు ప్రధానమంత్రి మోడీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు జార్ఖండ్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జార్ఖండ్‌కు చెల్లించాల్సిన బకాయిలను తిరిగి చెల్లించాలని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నాను" అని సోరెన్ ఎక్స్‌పోస్టులో పేర్కొన్నారు. ఈ పోస్టుకు జతగా ఆయన బొగ్గు బకాయిల చెల్లింపులపై ప్రధాని నరేంద్రమోడీకి రాసిన లేఖనూ పోస్టు చేశారు. అలాగే ఆయన ఆ రాష్ట్రంలోని బీజేపీ నేతలను, ఎంపీలను కూడా బకాయిల చెల్లింపులో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఉద్యాన విద్యార్థులకు వందశాతం ఉపాధి

తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దండా రాజిరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యాన విద్యార్థులకు వంద శాతం ఉపాధి కలిగించేలా నైపుణ్యాన్ని పెంపొందించడమే ధ్యేయంగా ఉద్యాన విద్యలో మార్పులు తీసుకొస్తామని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో విద్యార్థులు, శాస్త్రవేత్తలతో ఆయన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ, నైపుణ్యం విద్యార్థులు సహజ కవచాలుగా ఏర్పరచుకోవాలని సూచించారు. ఇతర పరిశ్రమలుతో కలిసి విద్యార్థులకు మేలైన అవకాశాలు పెంపొందించేందుకు ప్రణాళికలు చేపడుతుందని తెలిపారు.

పర్యావరణ మార్పుల నేపథ్యంలో ఉద్యాన పంటలపై జరిగే నష్టాన్ని తగ్గించేందుకు ఉద్యాన శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రైతులు, శాస్త్రవేత్తలతో ఉద్యాన పంటల వారీగా సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కేవలం సెన్సేషన్ కోసం పరిశోధనలు చేపట్టవద్దని నిపుణులను, శాస్త్రవేత్తలను కోరారు. ఆ ఫలితాలు రైతులకు ఉపయోగడేలా ఉండాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రాష్ట్రంలో కూరగాయల కొరతను అధిగమించేందుకు ప్రత్యేకమైన మెథో మథనం నిర్వహించాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు.



ధ్వంస రచన నశించాలి

పిల్లలంటే రేపటి లోకం. చిరునవ్వులకు, శాంతి సామరస్యాలకు సంకేతం. స్నేహశీలతకు, ప్రేమా స్వచ్ఛతలకు ప్రతిరూపాలుగా చెప్పుకుంటాము. పాలబుగ్గల నవ్వులతో అలరారే వారి మోమును చూడగానే ఎవరికైనా మనస్సు ఆనందమయ మవుతుంది. హాసము చిగురిస్తుంది. ఓ చల్లని దీవెనో.. చెంపలపై తీయని ముద్దో పెట్టక మానరు ఎవరైనా... 'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం, సౌఖ్యశ్లేషార్థాలూ ఏమీ ఎరుగని' పువ్వుల్లాంటి వాళ్లను చూస్తూ చూస్తూ ఎలా చిదిమేయబుద్ధి అవుతోంది వాళ్లకు? అన్నన్ని బాంబులను, మిస్సయిల్లను విచక్షణారహితంగా, ఆ ముక్కుపచ్చలారని పిల్లలపైన

> **మన కండ్లముందే దారుణాలు జరిగి పోతున్నాయి. చేతుల్లో కన్నబిడ్డల శవాలను ఎత్తుకుని విలపిస్తున్న తల్లిదండ్రుల దుఃఖపు కేకలు, ఈ ప్రపంచాన ఎవ్వరివైనా ఒకటే కదా! ఆ రోదనను ఓదార్చే తాహతు ఎవరికుంది! ఎవరు తీర్చగలరు వాళ్ల బాధని. విధ్వం సాలలో కూడా విరిగిపడిన శిథిలాల మధ్య విద్య నేర్చుకునేందుకు పరుగులు తీస్తున్న పిల్లల్ని చూస్తే నేర్చుకోవాలన్న కోరిక పిల్లలకు తప్ప మరెవరికి ఉంటుంది? ఈ విధ్వంసకారులు పాఠాలు ఎప్పుడు నేర్చు కుంటారు? యుద్ధ విధ్వంస వ్యూహరచన చేస్తున్న అమానవ దుష్టబుద్ధులకు ఎవరు బుద్ధిచెప్పాలి!**

విసిరి రక్తపుటేరులు పారించడం, విధ్వంస మొందించడం ఎంత దారుణమైన విషయం! యుద్ధానికీ ఓ నీతి ఉంటుంది. సాధారణ ప్రజలు జీవిస్తున్న ప్రాంతాలలో బాంబులు వేయడం, సామూహిక హత్యాకాండకు పూనుకోవడం కిరాతక కృత్యంకాక మరేమి!

అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న భీకరదాడికి రక్తనదులు పారుతున్నాయి. సంవత్సర కాలంగా చేస్తున్న ఈ దాడి పాలస్తీనాను దాటి లెబనాన్, బాలాహ్, నుస్రత్ శరణార్థ శిబిరం, ఆజ్ బవైదా ఏరియాల్లో ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించడంతో యాభైఐదు మంది మరణించగా అందులో మహిళలు, పిల్లలే అధికంగా ఉన్నారని తెలుస్తున్నది. మొదటి దాడి నుండి బతికి బయటపడి తప్పించుకుని వెళుతున్న వారిపై మళ్లీ దాడిచేసి మట్టుబెట్టడం, ఇజ్రాయిల్ దాష్టీకాన్ని తెలియజేస్తుంది. గత సంవత్సరకాలంగా ఎంతో మంది పిల్లలు రక్తపు మడుగుల్లో పడి, కూలిన శిథిలాలలో మౌనంగా, అచేతనంగా పడివున్న పసిపిల్లల మృత్యు దృశ్యాలను చూసి దుఃఖించని మానవ హృదయం ఉంటుందా! మన కండ్లముందే దారుణాలు జరిగి పోతున్నాయి. చేతుల్లో కన్నబిడ్డల శవాలను ఎత్తుకుని విలపిస్తున్న తల్లిదండ్రుల దుఃఖపు కేకలు, ఈ ప్రపంచాన ఎవ్వరివైనా ఒకటే కదా! ఆ రోదనను ఓదార్చే తాహతు ఎవరికుంది! ఎవరు తీర్చగలరు వాళ్ల బాధని. విధ్వం సాలలో కూడా విరిగిపడిన శిథిలాల మధ్య విద్య నేర్చుకునేందుకు పరుగులు తీస్తున్న పిల్లల్ని చూస్తే నేర్చుకోవాలన్న కోరిక పిల్లలకు తప్ప మరెవరికి ఉంటుంది? ఈ విధ్వంసకారులు పాఠాలు ఎప్పుడు నేర్చు కుంటారు? యుద్ధ విధ్వంస వ్యూహరచన చేస్తున్న అమానవ దుష్టబుద్ధులకు ఎవరు బుద్ధిచెప్పాలి! ప్రపంచమంతా ఆ కృత్యాలను తిలకిస్తూనే ఉంది. ఎందుకు మానవ హృదయాలు గొంతులెత్తి నినదించడంలేదు మారణకాండను ఆపేవరకు! రేపటి ప్రపంచాన్ని నిర్మూలించే ఈ కర్కశులకు తగిన బుద్ధి చెప్పకుండా, అన్యాయమని ఊరుకుంటే హననం కొనసాగుతూనే ఉంటుంది.

ఉక్రెయిన్ యుద్ధంలో కానీ, ఇజ్రాయిల్ యుద్ధంలోకానీ ప్రపంచంలో దేశాల మధ్య జరిగే యుద్ధాలలో, అంతర్యుద్ధాలలో, మత, జాతి విద్వేష దాడులలో ఎక్కువగా బలి అవుతున్నది పిల్లలు, మహిళలు. బాంబుల భయాలకు ఇల్లూ పొల్లూ వొదిలి, గాయాలతో, ఆకలితో, అనారోగ్యాలతో మరణశయ్యపై విలపిస్తున్న జనగోడు హృదయ విదారకమై వినిపిస్తున్నది. ఇంతటి నరమేధానికి సామ్రాజ్యవాద ఆధిపత్య అహంకారమే కారణము. శాంతి చర్యలకు దేశాలు ఒకవైపు పిలుపునిస్తున్నా, బాంబులు కురిపించే దురహంకారుల వెనుక సామ్రాజ్యవాద దోపిడీ శక్తులు ఉండి ఉసిగొలుపుతున్నాయి. "ఇజ్రాయిలో, ఆయిలో/అమెరికా కనుసన్నల్లో/ ఊపిరి పోసుకుంటున్న /మృత్యుగుళిక/ విచ్చుకత్తి విధ్వంసం" అని కవి వ్యాఖ్యానించింది యదార్థం. అయితే పిల్లలపై ఇంత యుద్ధహింస, మారణహోమం జరుగుతూంటే, ప్రధాన మీడియా, పత్రికలు కూడా పెద్దగా స్పందించడంలేదు. ప్రజలకూ చూసీ చూసీ, సాధారణమై పోయింది. ప్రతిస్పందనలూ పలుచపడిపోతున్నాయి. ఎవరి పనుల్లో వాళ్లు పడిపోతున్నారు. ఎంతో జీవితాన్ని ఇంకా గడపాల్సిన రేపటితరం, కల్మషాలెరుగని పిల్లలు కళ్లముందే రక్తపు ముద్దలవడం, యుద్ధాల మూలంగా దేశాలు విధ్వంసానికి గురవడం మానవజాతికే కళంకం.

యుద్ధ దుర్మార్గాలను, ప్రపంచపౌరులంగా వ్యతిరేకించాలి. ప్రపంచశాంతి, సామరస్యాలతో కొనసాగిన నాడే, మనమూ మన ప్రాంతమూ ప్రశాంతంగా ఉంటుంది. అభివృద్ధిని పొందుతుంది. మనకెందుకులే అను కుంటే, రేపు ఈ ద్వేషపూరిత విధ్వంసాలు మన ముందుకూ వస్తాయి. పిల్లలు వర్ధిల్లాలి! విధ్వంసం నశించాలి.

సంపాదకీయం

మోహన్ భగవత్ టు మోడీ.. అదే దాడి



తెలకపల్లి రవి

తనకు తానే తుమ్మి చిరంజీవ అనుకున్నారని సామెత. ప్రధాని నరేంద్ర మోడీ,ఆయన బీజేపీ కూటమి పరిస్థితి అలాగే వుంటుంది. తమ హయాంలో జరిగిన ప్రగతికి ప్రపంచం దిగ్భ్రాంతి చెందుతోందని, ప్రపంచం భారతదేశం వంక చూస్తున్నదని అహోరాత్రులు చెబుతూనే వుంటారు. ఇందుకు ఆధారాలు చూపుతారా అంటే అదీ వుండదు. అంతర్జాతీయ మీడియాలో విమర్శలు వస్తే వెంటనే కట్టకట్టుకుని దాడి చేస్తారు. సోషల్‌మీడియాలో మొదలై కేంద్ర మంత్రుల దాకా ఆ పవిత్ర ఖండనలో పాలు పంచుకుంటారు. ఈ ప్రహసనం పదేండ్లుగా సాగుతూనే వుంది. తాజాగా అక్టోబరు 31వ తేదీన ప్రధాని మోడీ సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవం తతంగంలో ఇదే చేశారు. సర్దార్ పటేల్ విగ్రహం దగ్గర ప్రసంగిస్తూ ఏకపక్ష వ్యాఖ్యానాలు గుప్పించారు. అసలు ఆ రోజును పటేల్‌తో ముడిపెట్టి ఈ ఉత్సవం జరపాలని నిర్ణయించడమే పెద్ద రాజకీయం. ఎందుకంటే దీర్ఘకాలం దేశాన్ని పాలించిన ప్రధాని ఇందిరగాగాంధీ అధికార నివాసంలోనే కుట్రపూరితంగా హత్యకు గురైన రోజు అది. రాజకీయ విభేదాలు, ఎవరి తప్పొప్పులు ఎలా వున్నా దేశ చరిత్ర మారదు. అందులోనూ అత్యున్నత పదవిలో వున్న ప్రధాని హత్యకు గురైన ఘటన ఉద్వేగంతో ముడిపడివుంది. అదే రోజున సిక్కులపై వూచకోత కూడా జరిగింది. బీజేపీ వ్యూహంలో ఈ రెండో అంశాన్నే చెబుతూ ప్రధాని ఇందిర హత్యను విస్మరించే విధానం మొదలు పెట్టారు. ఎక్కడో అమెరికాలో కెనడీ హత్య గురించి దశాబ్దాల తరబడి చెప్పే బడామీడియా కూడా నాటి చరిత్రను పూర్తిగా వదిలేసింది. ఎందుకంటే ఏ ప్రముఖ పత్రికలోనూ ఛానల్‌లోనూ ఆమె గురించిన రాతలు లేవు. ఒక పెద్దపత్రిక సిక్కులపై హత్యాకాండ గురించి మాత్రం రాసింది. మీడియా పాలకుల చెప్పుచేతల్లో ఎంతగా చిక్కుకుపోయింది దీన్నిబట్టే తెలుస్తోంది. సర్దార్ పటేల్ నామస్మరణతో నాటి అత్యున్నత నాయకుడు నెహ్రూను మరుగుపర్చడం మోడీ వ్యూహం. అయితే పార్టీలు ఏవైనా హత్యలకు గురైన కీలక నాయకులను కూడా విస్మరించడం మొదలుపెడితే చరిత్రకే అపచారం తప్పదు.

370 రద్దు రాజ్యాంగ రక్షణా?

వర్తమానానికి వస్తే మోడీ ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలలో తలకిందులు తర్కం,రాజకీయ వ్యూహం దిగ్భ్రాంతి కలిగిస్తాయి. మొదటే చెప్పినట్టు దేశం అమోఘంగా పురోగమించిందని తనకు తనే కితాబులిచ్చుకోవడం ఒకటి. అంతకుమించింది రాజ్యాంగ రక్షకుడుగా తనను తాను చెప్పుకున్న తీరు.దేశంలో రాజ్యాంగ మూల సూత్రాలపైన జరుగుతున్న దాడి గురించి దేశమంతా ఆందోళన చెందుతున్నది. మొన్నటి ఎన్నికల్లో ప్రజల తీర్పులోనూ ఆ విషయం ద్యోతకమైంది. 400 సీట్ల కోతల నుంచి సగానికి కొంచెం ఎక్కువగా మాత్రమే తెచ్చు కున్న మోడీ కూడా దీన్ని గుర్తించి రాజ్యాంగ పటానికి పూజలు ప్రారంభించారు కూడా. అంతకుముందు రెండు సార్లు గెలిచినప్పుడు ఈ షో లేదే మరి? రాజ్యాంగ రక్షణ గురించి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా పదే పదే ప్రస్తావించడం, విచారణలో వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇవేవీ గమనించకుండా మోడీ రాజ్యాంగ గ్రంథం పట్టుకున్నారనుకుంటే పొరబాటే. కానీ ఆయన మొన్నటి ప్రసంగంలో ఆయన తీసుకున్న వాదనే వింతగా వుంది. రాజ్యాంగం పేరుతో తమకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆయన ఆరోపణ! 'ఒకే దేశం-ఒకే పన్ను- ఒకే కార్డు' వంటివాటిని ఏకరువు పెట్టిన తర్వాత ఒకే దేశం, ఒకే రాజ్యాంగం వుండేలా తాము కీలక చర్యలు తీసుకున్నామని కొత్త పాట ఆలపించారు. కాశ్మీర్ 370వ అధికరణం రద్దుకు సమర్థన ఇది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక నిబంధనలు ఇవ్వడం వేరే రాజ్యాంగ మవుతుందా? ఇప్పటికీ అనేక రాష్ట్రాలకు కొన్ని విషయాల్లో ప్రత్యేక నిబంధనలున్నాయి. 370 రద్దు నిజానికి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిన చర్య. ఇటీవలి ఎన్నికల్లో కాశ్మీర్ ప్రజలు ఆ చర్యను తిరస్కరించారు కూడా,అయినా అదే తమ విజయమైనట్టు, ఒకే రాజ్యాంగం అమలులోకి తెచ్చినట్టు చెప్పుకోవడం మోడీ గడుసుతనం తప్ప ఇసుమంత నిజం లేదు. రాజ్యాంగ మూలసూత్రాలైన లౌకికతత్వం, సమాఖ్యతత్వం,ప్రజాస్వామ్య భావప్రకటనా స్వేచ్ఛ కీలకమైనవి. ఇందులో ప్రతిదానిపైన పనిగట్టుకుని దాడి చేసిన,చేస్తున్న మోడీ అదేదో రాజ్యాంగ రక్షణగా చెప్పుకోవడం వింతల్లో వింత.

కాశ్మీర్ పరిస్థితే అన్ని రాష్ట్రాలన్నిటికీనా?

మోడీకీ గడుసుతనం ఎక్కువే గానీ ప్రజల తెలివిని మరీ తక్కువ అంచనా వేస్తే చెల్లుతుందా? ఉన్న ఒక రాజ్యాంగ స్ఫూర్తిని భగ్నం చేసే మహత్కార్యంలో ఆయన 370 రద్దు తర్వాత దేశంలోని రాష్ట్రాలన్నిటికీ ఎసరు పెట్టడం యాదృచ్ఛికం కాదు. ఈ జాతీయ సమైక్యతా ప్రసంగంలోనే 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' మంత్రోచ్చారణలో మర్మం అదే.మిగిలిన రాష్ట్రాలకూ అదే గతి పట్టిస్తానని ఆయన సందేశం, సంకేతం కూడా. ఎందుకంటే రాజ్యాంగం రెండవ అధికరణం దేశాన్ని రాష్ట్రాల సమాఖ్య(యూనియన్ ఆఫ్ స్టేట్స్) అని నిర్వచిస్తున్నది. అమెరికాలోలాగా, ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో లాగా రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు లేకున్నా స్వయం ప్రతిపత్తి వుండాలని రాజ్యాంగం అభిలషించింది గనకే ఇలా స్పష్టంగా పేర్కొంది. కానీ 'ఒకే దేశం- ఒకే కార్డు-ఒకే పన్ను-ఒకే రేషన్-ఒకే మతం- ఒకే పార్టీ-ఒకే నేత' ఇలా ఒన్ మానియా పట్టిన మోడీజీ ఒకే ఎన్నిక వుంటేనే ఒకే దేశం అంటున్నారు. ఇది అక్షరాలా ఆరెస్సెస్ తరహా కేంద్రీకృత పెత్తనాన్ని,కార్పొరేట్ తరహా ఒకే మార్కెట్ వ్యూహాన్ని కలగలపిన ఆరెస్సెస్ మాజీ ప్రచారక ప్రావీణ్యమే.

'పంజాబసింధు, గుజరాత,మరాఠా, ద్రావిడ ఉత్కళ వంగ..'అంటూ రవీంద్రనాథ్ ఠాగూర్ పాడినప్పటికి దేశ స్వాతంత్ర్యం కనుచూపుమేరలో లేదు. రాష్ట్రాలూ ఈ విధంగా లేవు. దక్షిణాది రాష్ట్రాలూ భాషలన్నింటినీ కలిపి ద్రావిడ అన్నారు. సింధ్ ప్రాంతం ఇప్పుడు ఇండియాలోనే లేదు. అయినా ఈ దేశ చరిత్రను స్వభావాన్ని ఆయన గానం చేశాడు గనక దాన్నే జాతీయగీతంగా పాడుకుంటున్నాం. విభిన్న భాషా సంస్కృతుల సమ్మేళనమైన భారతదేశం వైవిధ్య వైభవానికి సంకేతంగా గౌరవించుకుంటున్నాం. అందులోంచి పుట్టిన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి దేశాన్ని ఒక్కతాటిపై నడిపింది. ఒకే దేశం,ఒకే కార్డు, ఒకే పరీక్ష,ఒకే పన్ను,ఒకే భాష,ఒకే మతం, ఒకే నాయకుడు వంటి నినాదాలూ, విధానాలూ ఇందుకు పూర్తి విరుద్ధమైనవి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బలవంతంగా ముందుకు తెస్తున్న 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తిని తోసిపుచ్చే కేంద్రీకృత పెత్తనానికి బాట వేస్తుంది. రాజ్యాంగంలో 83, 85 అధికరణాలు లోక్‌సభకు, 172,174 అధికరణాలు శాసనసభకు సంబంధించిన ఏర్పాటు ముగింపువంటి అంశాలలో దిశానిర్దేశం చేస్తున్నాయి. 356 శాసనసభల రద్దుకు ఉద్దేశించింది. రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితోను, ప్రజాస్వామిక చైతన్యంతోనూ ఈ నిర్దేశం చేశారు. అనుభవంలోనూ అనేక గుణపాఠాలున్నాయి. ప్రజల తీర్పుతో ప్రాతినిధ్యం పొందినవారే పాలించాలన్నది ప్రజా స్వామ్య రాజ్యాంగంలో మూలసిద్ధాంతం. రెండు సభా సమావేశాల మధ్య ఆరు నెలలకు మించి వ్యవధి వుండ కూడదనే కీలక సూత్రంతో ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి తప్ప అయిదేళ్లు వుండాలన్న షరతు కూడా లేదు.ఆ స్ఫూర్తికి భంగం కలిగించే వాదనలు పైకి ఎంత ఆకర్షణగా వినిపించినా దురుద్దేశపూరితమైనవే.

> **'పంజాబసింధు, గుజరాత,మరాఠా, ద్రావిడ ఉత్కళ వంగ..'అంటూ రవీంద్రనాథ్ ఠాగూర్ పాడినప్పటికి దేశ స్వాతంత్ర్యం కనుచూపుమేరలో లేదు. రాష్ట్రాలూ ఈ విధంగా లేవు. దక్షిణాది రాష్ట్రాలూ భాషలన్నింటినీ కలిపి ద్రావిడ అన్నారు. సింధ్ ప్రాంతం ఇప్పుడు ఇండియాలోనే లేదు. అయినా ఈ దేశ చరిత్రను స్వభావాన్ని ఆయన గానం చేశాడు గనక దాన్నే జాతీయగీతంగా పాడుకుంటున్నాం. విభిన్న భాషా సంస్కృతుల సమ్మేళనమైన భారతదేశం వైవిధ్య వైభవానికి సంకేతంగా గౌరవించుకుంటున్నాం. అందులోంచి పుట్టిన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి దేశాన్ని ఒక్కతాటిపై నడిపింది. ఒకే దేశం,ఒకే కార్డు, ఒకే పరీక్ష,ఒకే పన్ను,ఒకే భాష,ఒకే మతం, ఒకే నాయకుడు వంటి నినాదాలూ, విధానాలూ ఇందుకు పూర్తి విరుద్ధమైనవి.**



> **దసరా సందేశంలోనే ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ మార్క్సిస్టులు సాంస్కృతిక రంగంలోకి చొరబడుతున్నారని హెచ్చరించారు. మీడియా, విద్యా సంస్థలూ, మేధావులు వారి గుప్పిట్లోనే వున్నారని వాపోయారు. హిందూమతం వల్లనే దేశం ఐక్యంగా వుందని, ఆ ప్రాతిపదికనే ఏకీకృతం చేయాలని పిలుపునిస్తూ మార్క్సిస్టులు,వోకిజం(మేల్కొల్పు)వాదులు ఇందుకు అడ్డు తగులుతూ దేశానికి ముప్పు తెస్తున్నారని భగవత్ వ్యాఖ్యానించారు. ఇటీవలనే యూపీ ముఖ్యమంత్రి యోగి కూడా హిందువులు ఏకమవ్వాలని పిలుపునివ్వడం, ఇప్పుడు మోడీ మాటలు ఒకే వ్యూహంలో భాగమే. భగవత్ మార్క్సిస్టు పదం వాడితే, మోడీ అర్బన్ నగ్జల్స్ పదం తీసుకురావడంలోనూ చాలా రాజకీయం వుంది. వాస్తవానికి ఇవి రెండూ ఒకటి కాదని అందరికీ తెలుసు.**

ప్రజాతీర్పు లేని పెత్తనమా?

నిబంధనలు మార్చేసి ఒకే దేశం ఒకే ఎన్నికకు నిర్ణయాలు చేయడం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తి తీర్పు కూ విరుద్ధం. వేర్వేరు సభల సమస్యల వల్ల ఇతర సభల రద్దు లేదా పొడగింపు చేస్తే దానివల్ల ఎన్నికల ఖర్చు తగ్గక పోగా పెరుగుతుంది. ఈ విధానంతో సభలను ముందుగా రద్దు చేయడం లేదా పొడగించడం కేంద్రం ఇష్టప్రకారం పాలించడానికి దారి అవుతుంది. 1990లో చంద్రశేఖర్ ప్రభుత్వం పడిపోయాక అప్పటి రాష్ట్రపతి వెంకట్రామన్ జాతీయ ప్రభుత్వం అంటూ అనేక పార్టీలతో చర్చలు జరపడం తీవ్ర విమర్శకు గురైంది. ఇక రాష్ట్రాల ఎన్నికల మధ్య తేడా రావడానికి కారణమే కేంద్రం నిరంకుశంగా ఆప్రభుత్వాలను రద్దు చేయడం లేదా ఫిరాయింపులతో కూలదోసుకోవడం. ఇలాటి ప్రతి సందర్భంలోనూ కృత్రిమంగా పొడగించడమంటే ప్రజల ఎన్నికతోనే పాలన జరగాలన్న సూత్రాన్ని మంటగలపడమే. సమాఖ్య సూత్రాలు, భాషా సాంస్కృతిక వైవిధ్యం, ప్రతిపత్తి అస్సలే దెబ్బతినిపోతాయి. మరో ముక్కలో చెప్పాలంటే కాశ్మీర్‌కు 370 రద్దుతో జరిగిందే దేశంలోని 28 రాష్ట్రాలకూ జరుగుతుందన్నమాట. నిజానికి ఒకే ఎన్నికలకు సంబంధించి కేంద్ర క్యాబినెట్ ముందే ఒక నిర్ణయం చేయడం, దాని అమలు పర్చే విధానాన్ని నిర్ణయించడం కోసం ఒక మాజీ రాష్ట్రపతికి ఇలా ఒక కమిటీ బాధ్యత అప్పగించడం కూడా గతంలో జరగలేదు.అయినా దీనివల్ల ఒకే రాజ్యాంగం అమలు చేస్తామంటూ ప్రధాని చెప్పుకుంటున్నారంటే ఏమనుకోవాలి?

మోహన్ భగవత్ టు మోడీ

మోడీ ఆరోపించిన మూడో అంశం దేశానికి వ్యతిరేకంగా రకరకాల శక్తులు అర్బన్ నగ్జల్స్ రూపంలో పనిచేస్తున్నారట. దీపావళికి ముందు మోడీ ఈ మాటలు చెప్పారు గానీ దసరా సందేశంలోనే ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ మార్క్సిస్టులు సాంస్కృతిక రంగంలోకి చొరబడుతున్నారని హెచ్చరించారు. మీడియా, విద్యా సంస్థలూ, మేధావులు వారి గుప్పిట్లోనే వున్నారని వాపోయారు. హిందూమతం వల్లనే దేశం ఐక్యంగా వుందని, ఆ ప్రాతిపదికనే ఏకీకృతం చేయాలని పిలుపు నిస్తూ మార్క్సిస్టులు, వోకిజం (మేల్కొల్పు) వాదులు ఇందుకు అడ్డు తగులుతూ దేశానికి ముప్పు తెస్తున్నారని భగవత్ వ్యాఖ్యానిం చారు. ఇటీవలనే యూపీ ముఖ్యమంత్రి యోగి కూడా హిందువులు ఏకమవ్వాలని పిలుపునివ్వడం, ఇప్పుడు మోడీ మాటలు ఒకే వ్యూహంలో భాగమే. భగవత్ మార్క్సిస్టు పదం వాడితే, మోడీ అర్బన్ నగ్జల్స్ పదం తీసుకురావడంలోనూ చాలా రాజకీయం వుంది. వాస్తవానికి ఇవి రెండూ ఒకటి కాదని అందరికీ తెలుసు. అడవుల్లో నగ్జల్స్ అంతరించారు గనక పట్టణాల్లో చొరబడ్డారంటూ కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టులు, కళాకారులు, రచయితల వరకూ అదే ముద్రతో చిత్రించడం వ్యూహాత్మకమే. మావోయిస్టులను ఎన్‌కౌంటర్లతో తుడిచిపెట్టడం సాధ్యమా? అనేది ఒకటైతే సైద్ధాంతికంగా వారితో ఏ సంబంధం లేని వారందరినీ ఆ పేరుతో చూపడం అతి తెలివి మాత్రమే. అభిప్రాయాల తేడాలేవైనా ప్రగతిశీలవాదులు, ప్రజాస్వామిక శక్తులూ ఎప్పుడూ రాజ్యాంగ విలువల కోసం పోరాడుతూనే వుంటారు. విమర్శలూ, ఉద్యమాలు లేకుంటే ప్రజాస్వామ్యం అన్నదానికే అర్థం లేదు. రాజ్యాంగం ఇస్తున్న భావప్రకటనా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు కాలరాచేస్తూ విమర్శించే మీడియాను, జర్నలిస్టులను వేటాడుతున్న మోడీ 'ఒకే దేశం ఒకే రాజ్యాంగం' నినాదాన్ని వల్లించడం హాస్యాస్పదం. స్వాతంత్ర్య యోధుడైన సర్దార్ పటేల్ 150 జయంతిని ఈ విధంగా రాజ్యాంగ వ్యతిరేకమైన భాషణకు మోడీ వినియోగించడం రాబోయే పరిణామాలకు ఒక సంకేతం. ■

భరోసెమండ్

సబ్సే భరోసెమంద్ నామ్, ఒక టూత్ పేస్టు గురించో లేక ఒక మందు గురించో రేడియోలో చెప్పేవాళ్ళు నాం అంటే పేరని తెలుసుగాని ఈ భరోసెమంద్ ఏమిటో తెలీక మా నాన్ననడిగితే చెప్పాడు నమ్మకమైన అన్న అర్థమని. వ్యాపార ప్రకటనల్లో బాగా వాడే ఈ భరోసెమంద్ అన్న పదం రేడియోలు పోయాక అంతగా గుర్తు చేసుకోలేదు. కానీ, నేటి రాజకీయ వ్యాపార ప్రకటనల్లో అటునుండి, ఇటునుండి ఆ భరోస అన్న పదాన్ని వాడి అవతల పడేస్తున్నారు. అసలు ఈ భరోసా అన్న పదం ఉర్దూ పదం, అయినా మరాఠీ, హిందీ, తెలుగు మొదలైన భాషల్లో తానూ ఇమిడిపోయింది. అందుకే ఆ పదమంటే నాకు భరోసా. మార్కెట్లో పోటీ బాగా ఉన్నప్పుడు ఈ నమ్మకమనే పదాన్ని వాడి అంతే భరోసగా కొనుగోలుదార్ల జేబులకు చిల్లులు వేస్తున్నారు. ప్రకటనల ద్వారా టీవీల్లో, రేడియోలో, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో చెవులు చిల్లులు పడేలా, కండ్లకు కాట్లు వేస్తూ సాగుతాయి ఈ ప్రకటనలు. అంతా వ్యాపారమైన ఈరోజుల్లో ఎవరిని నమ్మాలి?అన్న ప్రశ్న అలాగే నిలిచిపోతోంది, సమాధానం లేకుండా.

ఆ.... అయినా నేటి జీవితాల్లో దేనికీ భరోసా లేదండి అనే వాళ్లను రోజూ చూస్తుంటాము. అంటే దేనికీ గ్యారెంటీ లేదండీ అన్నదే దాని అర్థం. ఈ గ్యారెంటీలు వారెంటీలు మనకు వ్యాపారంలో బాగా కనిపిస్తాయి. అవన్నీ భరోసాకు ఇంగ్లీషు పదాలేనని గుర్తుంచుకోవాలి. భాష ఏదైనా భావం ముఖ్యం కాబట్టి, జీవితంలో రకరకాల భాషలను చూస్తాం కాబట్టి మనమీద మనకు భరోసా ఒక్కోసారి పెరుగుతుంది కూడా. అలాగని అందరినీ అన్నింటినీ నమ్ముతామా అంటే మాత్రం సమాధానం వేరుగా ఉంటుంది. కొందరు మాటల్లో, కొందరు చేతల్లో ఈ భరోసాను చూపుతారన్న విషయం అందరికీ తెలుసు. అసలు మాటకు చేతకూ పొంతన ఉండదని అనడం ఎంత వీజీనో రెండూ ఒకేలా ఉండడం అరుదే కాదు, మనకు ఆశ్చర్యం తెప్పిస్తుంది కూడా. రైతులకు, కార్మికులకు, ఉద్యోగులకు మాది గ్యారెంటీ అని చెప్పి అధికారంలోకి వచ్చినోళ్లు పీఠమెక్కిన వెంటనే నిరంకుశ చక్రవర్తిలాగా ప్రవర్తించొచ్చు. సమ్మెలు చేయకూడదు, ధర్నాలు చేయకూడదు, మమ్మల్ని అడిగితే చేసేస్తాము అలాగని విపరీత మనస్తత్వంతో ఉండొద్దంటారు. అసలు విపరీతం నియంతవైన నువ్వా, ప్రజాస్వామికంగా పోరాడుతున్న మేమా అని కార్మికులు, ఉద్యోగులు నినదించిన రోజులను మరచిపోకూడదు. విద్యార్థులకు ఎండాకాలం సెలవులు ఇచ్చినట్టు ఈ నాయకులకు కూడా అప్పుడప్పుడూ సెలవులిస్తారు ప్రజలు. ఆ సెలవులను ఎలా ఉపయోగించుకోవాలి, ప్రజలు మమ్మల్ని నమ్మాలంటే ఏమి చేయాలి, వాళ్లకు భరోసా ఎలా కలిగించాలి అన్నది అసలు ప్రశ్న.



జంధ్యాల రఘుబాబు
9849753298

అవతలవారిని తిట్టడం, నిత్యం వాళ్లు ఇవి చేయలేదు, అవి చేయలేదు అని ప్రశ్నించడం, ప్రకటించడం తమపై మళ్లీ భరోసా తెచ్చే టెక్నిక్కే కానీ అది ఎప్పుడూ పనిచేయదు. ఎందుకంటే అంతకు ముందరి చరిత్రను అవతలి వాళ్లూ సమయానుకూలంగా తెలియజేస్తూనే ఉంటారు. ఎప్పుడొచ్చామన్నది ముఖ్యం కాదన్నా, బుల్లెట్ దిగిందా లేదా అన్నట్టు డైలాగులు వేస్తూ ఉంటారు, సమాధానాలు చెబుతూ ఉంటారు. నా వైపు ఒక వేలు చూపితే మిగతా వేళ్లు నిన్ను



సురుకు

చూపిస్తాయి చూసుకో అనొచ్చు కూడా. అలాగని ఇతరులను చూపడం మాత్రం ఆపరు, ఆపలేరు. లెక్కల్లోని ప్లస్సు మైనస్సు సూత్రాలను తెలిసో, తెలియకో రాజకీయులందరూ పాటిస్తుంటారు. తమ మైనస్సులను కప్పిపుచ్చుకోవడానికి అవతలివారి మైనస్సులను బాగా వాడుకుంటారు. అలా చేయడం వల్ల తమలో ఉన్న మైనస్సులు పెరుగుతూనే ఉంటున్నాయి కాని నిజమైన ప్లస్సులు పెరగడం లేదన్నది సత్యం.

ఇంకో రకం వాళ్లుంటారు, వాళ్లకెప్పుడూ ప్రజలపై భరోసా ఉండదు, వాళ్ల నమ్మకమంతా ఇ.వి.ఎంల పైనేనని ఇతర రాజకీయులు చెప్పగా వింటున్నాము. ప్రజలు కూడా ఇవన్నీ చూస్తున్నారు. ఈమధ్య మెగాస్టార్ ఒక మాటన్నారు అదేమంటే తాను మొదట రచ్చ గెలిచి తరువాతే ఇంట గెలిచానని సగర్వంగా చెప్పుకున్నారు. ఆయనలాగా శ్రమచేసే మనస్తత్వం ఉండాలే కాని ఎన్నో పనులు చేయొచ్చు. ఎన్నేళ్ల నుండో దాచుకున్న భావాలను అవసరమైనప్పుడు మాత్రమే మాట్లాడతాడు. అందుకేనేమో రాజకీయాలకంటే తన కళనే నమ్ముకున్నాడాయన. ఆయన భరోసా తన నటన, తన స్టెప్పులు, తన హాస్యం, తన స్టంట్లు. కట్ చేసి రాజకీయుల దగ్గరికొస్తే అదే చూస్తాము, వాళ్లు రాజకీయాలను మాత్రమే నమ్ముకున్నారు. అదే వారి భరోసా. ఇరవైనాలుగు గటలూ తాముకూడా తమ నటన, తమ మాటలనే అస్త్రాలపై మాత్రమే నమ్మకాన్ని పెట్టుకొని జీవితాలు సాగిస్తున్నారు.

అసలివన్నీ కాదు కాని పార్టీ పేరులోనే భరోసా అన్న పదం తగిలించి ప్రజా భరోసా, జన భరోసా అన్న పేర్లున్న పార్టీలు ముందు ముందు రావచ్చునేమో. ముందే ఎ.ఐ అంటే కృత్రిమ తెలివితో తమ మెదళ్లకు పనులు చెప్పడం ఆపేస్తున్న జనాలకు దానిపై మరీ భరోస ఎక్కువైందనిపిస్తుంది. అసలు మనుషుల మెదళ్లు చురుకుగా పనిచేయడం వల్లే ఇన్నిన్ని విజయాలు సాధిస్తున్నారన్న విషయం పక్కన పెట్టి ఈ కృత్రిమ మేధస్సును అవసరమైనంత వరకే వాడుకుంటే మంచిదని ప్రజలగురించి ఆలోచించే వాళ్లు చెబుతున్నారు. లేదంటే రోబో సినిమాలో మాదిరి ఈ కృత్రిమ తెలివి ముందు అసలైన తెలివి పనిచేయకపోవచ్చు. ముందు తమ తెలివిపై భరోసా పెట్టుకోవడం ఉత్తమం.

ప్రజలు అంటే ఇక్కడ అన్నిరకాల, తరగతుల ప్రజలు తమ భరోసాను మారుస్తూ ఉంటారు. మంచిదే కాని కొన్ని అపోహలకు, ఎప్పటికప్పుడు క్షణికమైన ఆవేశాలకు తెలియకుండానే గురౌతుంటారు, మోసపోతుంటారు. నింపాదిగా ఆలోచించి నిజంగా ప్రజలకు, దేశానికి భరోసానిచ్చే పక్షాలను పైకి తెచ్చే పని వాళ్లే చేయాలి. స్వాతంత్ర్య సంగ్రామంతో పాటు అన్నింటా పాల్గొనే వారిని నమ్మాలని చదువుకున్న వాళ్లు అందరికీ చెప్పాలి. ప్రజల మధ్య విభజన రేఖల్ని గీసి ఆ ముసుగులో తమ పనులు చేసుకుపోయేవారిని నమ్మడం, వారిపై భరోసా కలిగి ఉండడం ఎంత తప్పో గ్రహించాలి. ఊరకే పథకాలకు భరోసా, యోజన, స్రవంతి, విజన్ లాంటి మాటల్ని తగిలించి తమ మిత్రులకు మాత్రమే వాటిని అందించే వారిని ఓ కంట కనిపెట్టి నిజమైన ప్రజా నాయకులను ఎన్నుకోవడమే భవిష్యత్తుకు భరోసా. ■

పేలని 'బాంబులు'

బాంబులనగానే హైదరాబాద్ గోకుల్‌చాట్, మక్కామసీదులో పేలిన బాంబులే మనకు టక్కున గుర్తొస్తాయి. కానీ తాజాగా 'రాష్ట్ర రాజకీయాల్లో బాంబులు పేలుతాయ్' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సౌత్ కొరియా గడ్డపై చేసిన హాట్ కామెంట్లపై నెటిజన్లు, రాజకీయ నేతలు పలురకాలుగా స్పందిస్తున్నారు. దీంతో రాజకీయాల్లో ఏం జరుగనుందనే ఆసక్తి నెలకొంది. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం 'బాంబు' పేలడంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. దీపావళి పండుగైయిపోయింది కదా? ఇంకేం బాంబులు పేలుతాయానడంతో అక్కడున్నవాళ్లు గొల్లుమన్నారు. 'దీపావళి బాంబులు తుస్సుమన్నాయి' అని ఇంకొందరూ సోషల్‌మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని పొంగులేటి వద్ద ప్రస్తావించగా 'బాంబులు పేలడానికి కొంత సమయాన్ని ఫిక్స్ చేస్తారు. మనం అనగానే అవి పేలవు. అలాగే రాజకీయ బాంబులు పేలేందుకు కూడా కొంత సమయం పడుతుంది' అంటూ వివరణ ఇచ్చారు. అసలు పొంగులేటి మనసులో ఉన్న బాంబు ఏంది? అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తుంటే, దానికి కొంతమంది నెటిజన్లు మాత్రం వెరైటీగా స్పందిస్తూ...'ఏమీ లేదబ్బా శాసనసభలో ప్రతిపక్ష హోదా ఉన్న బీఆర్‌ఎస్ నుంచి ఓ పెద్ద ఎమ్మెల్యేల గుంపు 'కాంగ్రెస్ మంద'లో కలవబోతున్నది. దీంతో మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా దక్కకుండా పోతుంది. ఆయన కూడా గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు ఇలాంటి అవ మానాన్ని చేశారు కదా? ఇప్పుడు కేసీఆర్‌కు అలాంటి దుస్థితి రాబోతుంది.' ఇదే పొంగులేటి బాంబుల సూత్రం అని రాసుకొచ్చారు. 'ఓరి నాయనా అది కాదురా.. బాంబులు పేలుతాయంటే... సీఎం రేవంత్‌రెడ్డిని దించేసి ఆయన స్థానంలో మరొకర్ని కూర్చొబెట్టబోతున్నారట. ఇది అసలైన పెద్ద బాంబు' అని మరో నెటిజన్ చెప్పుకొచ్చారు. అయితే రాజకీయాల్లో ఎక్కడ ఏ బాంబు పేలుతుందో, అది ఎవరికి ప్రమాదమో, మరెవరికి ప్రయోజనమో..లెట్స్ వెయిట్ అండ్ సీ...

- గుడిగ రఘు

వాళ్లు సరే.. మరి మనం..?

కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన సంతోషమే లేకుండా పోతోంది మన ప్రధాని మోడీజీకి. ఎందుకంటే ఇంతకుముందులాగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవటానికి వీల్లేకుండా పోయిందాయే. అందుకే ఆయన తాజాగా తన అక్కసునంతా వెళ్లగక్కారు. వెనిజులాకు వెళ్లేందుకు సీపీఐ(ఎం) ప్రతినిధులకు అనుమతినివ్వ లేదు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష కాంగ్రెస్‌ను మోడీజీ దునుమాడారు. హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, తెలంగాణలో హస్తం పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ఒంటికాలి మీద శివాలెత్తారు. కర్నాటక కాంగ్రెస్ పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయింది, ఆ పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో ఉద్యోగులకు జీతాలను సకాలంలో చెల్లించటం లేదు, తెలంగాణలో రుణమాఫీని సరిగా అమలు చేయలేదంటూ ప్రధాని తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. ఓకే.. కరెక్టే..నిజమే... మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అన్నింటా విఫలమైంది, ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయలేక చేతులెత్తేస్తోంది.. ఇది నూటికి రెండొందల శాతం కరెక్టు. మోడీగారు చెప్పింది అక్షరాలా నిజం. కానీ పదేండ్ల క్రితం ఇదే నరేంద్రమోడీ చెప్పిన విషయాలు, చేసిన వాగ్దానాలు మననం చేసుకుంటే మన కండ్లు బైర్లు కమ్మి కింద పడటం ఖాయం. 'విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కు తెస్తాం, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తాం, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తాం, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులకు మద్దతు ధరలు కల్పిస్తాం...' అంటూ మస్తు జబర్దస్త్‌గా మాటలు చెప్పారు. పదేండ్లు గిర్రున తిరిగాయి. ఇప్పుడా మాటలన్నీ మరిచి, కాంగ్రెస్‌ను ఇరగదీస్తున్నారు మన పీఎమ్ సాబ్. ఇది చూసి...'ఎదుటోడికి నీతులు చెప్పే ముందు మనం కూడా వాటిని పాటిస్తే మంచిది కదా...?' అంటున్నారు జనాలు. నిజమే కదా మోడీ సాబ్... వాళ్లు సరే.. మరి మన హామీల సంగతేంది?

-బి.వి.యన్.పద్మరాజు

చౌరస్తా

నవతెలంగాణ
ఖమ్మం
ఆదివారం నవంబర్ 03, 2024 www.navatelangana.com

డీఎంఅండ్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన కళావతి భాయి

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ)గా డాక్టర్ బి.కళావతి భాయి శనివారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ వి. సుబ్బారావు దగ్గర నుండి ఛార్జ్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ బి.సైదులు, డాక్టర్ చందునాయక్, డాక్టర్ వెంకట రమణ, ఏవో డాక్టర్ మోత్యా, డెమో సాంబశివరెడ్డి, ఎస్వో నవీన్, డిపివో దుర్గ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే జాగ్రత్తగా నిర్వహించాలి : ఆర్డీఓ గరిడి నరసింహారావు

నవతెలంగాణ-ముదిగొండ



ఇంటింటి సర్వే జాగ్రత్తగా నిర్వహించాలని ఆర్డీవో గరిడీ నరసింహారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6 నుండి తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సిబ్బందితో ముదిగొండ రైతు వేదికలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇంటింటి సర్వే పక్కాగా చేయాలన్నారు. సర్వే చేసే విధివిధానాలపై సిబ్బందితోపాటు,అధికారులకు ఆయన అవగాహన కల్పించి, పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.సునీత ఎలిజిబెత్, ఎంపిడిఓ ఎస్.శ్రీధర్ స్వామి, ఎంపిఓ వాల్మీకి కిషోర్, ఎంఈఓ డి.రమణయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ పంచాయతీ సెక్రెటరీలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను పొట్టన పెట్టుకున్న రాక్షసుడు మోడీ

- పెట్టుబడిదారులకు రూ.14 లక్షల కోట్లు మాఫీ
- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి
- రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి రోడ్లు ఎక్కుతాం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

నవతెలంగాణ-బోనకల్



మాట్లాడుతున్న పోతినేని



తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న 761 మంది రైతులను బలిగొన్న నరరూప రాక్షసుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని, పెట్టుబడిదారులకు రూ.14 లక్షల కోట్ల మాఫీ చేసిన ఘనుడు మోడీ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. మండల పరిధిలోని మోటమర్రి గ్రామంలోని ఎర్రబోయిన నాగేశ్వరరావు నగర్‌లో 9వ సీపీఐ(ఎం) మండల మహాసభ కిలారు సురేష్, జొన్నలగడ్డ సునీత, గుగులోతు పంతు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి బసవయ్య, తాతా వెంకయ్య పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, మరికొందరు అమరవీరులకు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సభ్యులు బండి రమేష్, బొంతు రాంబాబు, చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సంతాప తీర్మానాన్ని బంధం శ్రీనివాసరావు ప్రవేశపెట్టగా కార్యదర్శి నివేదికను దొండపాటి నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. అనంతరం నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటిగా సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతను గుర్తించి ఆ ప్రాజెక్టుల సాధన కోసం పాదయాత్ర చేసింది సీపీఐ(ఎం) మాత్రమేనన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయలేకపోవటం చాలా బాధాకరమన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చేటప్పుడు రేషన్ కార్డు ఆధారంగా రుణాలు ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. కానీ రుణాలు మాఫీ చేసేటప్పుడు రేషన్ కార్డు దేనికి లింకు పెడుతున్నారని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం అని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారం కోసం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన నిలదీశారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీ ఏమైంది అంటూ ప్రశ్నించారు. రైతు భరోసా, రైతుబంధు ఏమైందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం వల్లే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, అదే పరిస్థితి మీకు కూడా పడుతుందని హెచ్చరించారు. హామీలను అమలు చేయకపోతే సీపీఐ(ఎం) ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి రోడ్లు ఎక్కుతామని హెచ్చరించారు. స్వామినాథలు కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పెట్టుబడిదారులకు 14 లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎందుకు మాఫీ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. నల్ల చట్టాల రద్దు కోసం రైతులు 369 రోజులు ఢిల్లీలో ఆందోళన చేశారని, ఈ ఆందోళన సమయంలో 761 మంది రైతులను తన పొట్టన పెట్టుకున్న రాక్షసుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని తన దైన శైలిలో విమర్శల వర్షం కురిపించారు. బిజెపి మతోన్మాదం కోసం ఎంతటికైనా తెగిస్తుందని ఇందుకు ఉదాహరణ మణిపూర్‌లో జరిగిన సంఘటనలేనన్నారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకి తీవ్రతరం అవుతుందని, ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. రాముడి గుడి కట్టించిన అయోధ్యలో బిజెపి ఓడిపోయిందని, అక్కడ ప్రజలు బిజెపి మతోన్మాద ప్రమాదాన్ని గుర్తించారని, దేశ ప్రజలందరూ త్వరలోనే గుర్తిస్తారన్నారు. అనంతరం నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, బొంతు రాంబాబు, చింతలచెరువు కోటేశ్వరరావు, ఐలు రాష్ట్ర నాయకులు ఏడునూతల శ్రీనివాసరావు, టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు పల్లా కొండలరావు తదితరులు మాట్లాడారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మడిపల్లి గోపాలరావు వైరా, మధిర రూరల్ మండలాల కార్యదర్శులు, తోట నాగేశ్వరరావు, మంద సైదులు, మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య, సిఐటియు జిల్లా నాయకులు శీలం నరసింహారావు, మాజీ ఎంపీపీ చిట్టిముదు నాగేశ్వరరావు, మోటమర్రి మాజీ సర్పంచ్ కేతినేని ఇందు, మోటమర్రి సొసైటీ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, సీపీఐ(ఎం) మోటమర్రి గ్రామ శాఖ కార్యదర్శి పిక్కెల సీతారాములు, వివిధ గ్రామాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

బోనకలలో సీపీఐ(ఎం)ను ప్రథమ స్థానంలోకి తీసుకురావాలి

పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం జిల్లాలో తిరిగి బోనకల్ మండలంలో సీపీఐ(ఎం)ను ప్రథమ స్థానంలోకి తీసుకురావడానికి నూతన కమిటీతోపాటు పార్టీ శ్రేణులు అందరూ పట్టుదలతో కృషి చేయాలని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గతంలో బోనకల్ మండలంలో ప్రథమ స్థానంలో ఉండే వాళ్లమని, ఆ స్థానాన్ని తిరిగి సాధించేందుకు ప్రతి ఒక్కరు పట్టుదలతో సైనికుల్లా పనిచేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి ఆ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాల నిర్వహించాలని, అప్పుడే మనం అనుకున్నది సాధించటం సాధ్యమవుతుందన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాడేది సీపీఐ(ఎం) మాత్రమేననే విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని, కానీ ఈ విషయాన్ని మనం క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లవలసిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించి వారిని పోరాటాలలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

మహాసభల ఏర్పాట్లు ఆధారహో...

మండల పరిధిలోని మోటమర్రిలో సీపీఐ(ఎం) 9వ మండలం మహాసభ శనివారం జరిగింది. ఈ మహాసభ ఏర్పాట్లు ఆధారహెూ అన్నట్లుగా ఉన్నాయి. మోటమర్రి గ్రామం మొత్తం సీపీఐ(ఎం) తోరణాలతో ఎరుపుమయం చేశారు. మహాసభ ప్రాంగణాన్ని ఎర్రజెండాలతో సుందరీకరణ చేశారు. సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు అనేకమంది అమరవీరుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఒకరోజు ముందు నుంచే ఏర్పాట్లను ప్రారంభించి పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్టు మోదు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కేతినేని ఇందు, సీపీఐ(ఎం) శాఖా కార్యదర్శి పిక్కేల సీతారాములు, మాజీ శాఖా కార్యదర్శి కేతినేని నాగేశ్వరరావు, నాయకులు మేడా రామారావు, ఉమ్మనేని భాస్కరరావు, బలవంతపు జానయ్య, చిట్టుమోదు వెంకటేశ్వర్లు, మేడ గోపీనాథ్, చింతల గోవిందరావు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా కిలారి సురేష్ ఏకగ్రీవం



సీపీఐ(ఎం) బోనకల్ మండల కార్యదర్శిగా చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన యువకుడు కిలారి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మరో 24 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన మండల కమిటీలో యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం విశేషం.

ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలు తెలపండి

- జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కే. సత్యనారాయణ

నవతెలంగాణ-ఖమ్మం

ఈనెల 5న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బిసి కమీషన్ ప్రతినిధుల బృందంచే నిర్వహించు ప్రజాభిప్రాయ సేకరణలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మైనార్టీ మత గురువులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎన్జీవో ప్రతినిధులు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కే.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థులను ధృవీకరణ అఫిడవిట్ రూపంలో ఆరు సెట్లను ఇవ్వాల్సి ఉంటుందని, ఇతర వివరాలకు జిల్లా కార్యాలయం(ఎస్ -30), జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి (ఎస్ -29) కార్యాలయాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.



తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణ- కూసుమంచి

తేమశాతంతో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేసి ప్రతి క్వింటా పత్తికి గిట్టుబాటు ధరను రైతులకు అందించాలని రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో జరిగిన సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఈ వర్షాకాలం అధిక వర్షాలు కురవడంతో పత్తి పంట ఎకరానికి 5 క్వింటాళ్ల కూడా దిగుబడి రాలేదని, గతంతో పోల్చుకుంటే చాలా దిగుబడి తగ్గిందని దీంతో రైతులకు పెట్టుబడులు కూడా సరిగ్గా రాక, అప్పుల పాలవుతున్నారని, అలానే కౌలు రైతుల పరిస్థితి మాత్రం ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పేరుతో రైతులు తీసుకువచ్చిన పత్తిని తిరిగి వెనక్కి పంపుతున్నారని, లేని పక్షంలో గత్యంతరం లేక రైతులను ఒక క్వింటాళ్లకు రూ.5వేల కంటే తక్కువ ధరకే కొనుగోలు చేసి రైతులను ఆర్థికంగా దివాళా తీపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తిని పంటను కొనుగోలు చేస్తున్నారని, మన జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఆ జిల్లాల మాదిరే సీసీఐ కొనుగోలు కేంద్రాలలో కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మూతపడిన గ్రంథాలయాలను తెరవాలి

- సీపీఐ(ఎం) 3 టౌన్ కమిటీ డిమాండ్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలో త్రీ టౌన్‌లో మూతపడిన గ్రంథాలయాలను వెంటనే తెరవాలని సీపీఐ(ఎం) 3 టౌన్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం 32వ డివిజన్ శాఖ మహాసభల సందర్భంగా నూతన శాఖ కార్యదర్శులుగా పుట్నాల బాబు, బండారు సునీతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. 32 డివిజన్లోని జహీర్ పుర పార్కు దగ్గర గ్రంథాలయం కరోనా సమయంలో బంద్ చేశారని, ఇప్పటివరకు ఈ గ్రంథాలయాలు తెరవలేదని అన్నారు. కావున మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పూనుకొల్లు నీరజ వెంటనే స్పందించి గ్రంథాలయాలను తెరిపించాలని, వాటిని నిరంతరం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే త్రీ టౌన్‌లో కిరాయి ఇళ్లల్లో పేద ప్రజలు ఉంటూ కిరాయిలు కట్టలేక సంవత్సరాల కొద్ది జీవితాలు వెళ్లదీస్తున్నారని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సంబంధిత అధికారులతో వీడియో సమావేశం ద్వారా ఇంటింటి సర్వే సన్నద్ధతపై, ధాన్యం, పత్తి కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు ప్రాథమిక పాఠశాల టీచర్లను ఎన్యుమరేటర్‌లుగా వినియోగించాలని, ప్రాథమిక పాఠశాలలు ఉదయం ఒక పూట మాత్రమే పని చేయాలని, మధ్యాహ్నం నుంచి టీచర్లు ఎన్యుమరేషన్‌లో పాల్గొనేలా చూడాలని అన్నారు. సెలవు రోజుల్లో పూర్తి స్థాయిలో ఎన్యుమరేషన్ జరిగేలా ఉండాలని అన్నారు. ఈనెల 5 నాటికి హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ నెల 6, 7 తేదీలలో రెండవ దఫా ఎన్యుమరేటర్ లకు, డేటా ఎంట్రీ బృందాలకు శిక్షణ నిర్వహించాలని అన్నారు. ఒక సూపర్ వైజర్ పరిధిలో కనీసం 3గురు డేటా ఎంట్రీ ఆపరేటర్ లు నియమించాలని, అవసరమైన పక్షంలో స్థానికంగా ఉన్నవారిని ఎంపిక చేసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న సరిహద్దు మండలాల పరిధిలో చెక్ పోస్టుల వద్ద అధికారులకు డ్యూటీలు కేటాయించాలని అన్నారు. జిల్లాలో 5 మండలాల పరిధిలో ఉన్న 9 పత్తి కొనుగోలు కేంద్రాలను సంబంధిత తహసిల్దార్ లు సందర్శించి రిపోర్ట్ అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ఓపెన్ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు, ఎన్యుమరేషన్ లో ప్రజలకు ఏదైనా ఇబ్బందులు ఉంటే 1077 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, దీనిపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మణాల్ శ్రేష్ఠ, సిపిఓ ఏ. శ్రీనివాస్, డిఈఓ సోమశేఖర శర్మ, డీఆర్‌ఓ రాజేశ్వరి, ఆర్డీఓలు, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, నియోజకవర్గ ఇన్చార్జి అధికారులు, మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపీఓలు, ఎంఎస్‌ఓలు, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లూరి వీరబాబు

నవతెలంగాణ-నేలకొండపల్లి



పెన్షనర్లు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లూరి వీరబాబు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని రావెళ్ల సత్యనారాయణ భవనంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ పాలేరు డివిజన్ కమిటీ సమావేశం అధ్యక్షుడు ఏటుకూరి రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఉద్యోగులు పెన్షనర్లకు రావలసిన పెండింగ్ డీఏలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుబేర్‌లో ఉన్న అన్ని రకాల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, పీఆర్సిని అమలు చేయాలని, ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులను పటిష్టం చేయాలన్నారు. ఈపీఎస్ పెన్షనర్లకు ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు అందించాలని, కేంద్ర ప్రభుత్వ పెన్షన్ మాదిరిగా 20 ఏళ్ల సర్వీస్‌కు పూర్తి పెన్షన్ అమలు చేయాలన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కాలంలో జరిగిన ఉద్యమాలు ఫలితాలపై కార్యదర్శి నివేదికను చీట్ల భాస్కర్ రెడ్డి ప్రవేశ పెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వల్లంచెట్ల భాస్కరరావు, కోశాధికారి స్వామినాథం, కార్యదర్శులు నరసింహారావు, కోదండ రామారావు, సీతారాంరెడ్డి, రామయ్య, ముత్తయ్య ఎస్ కే భాష తదితరులు పాల్గొన్నారు.



డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజా చౌదరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతులతో పాటు బోనస్ పొందాలని కోరారు. దళారీలకు అమ్మి నష్టపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో డి.చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి ఎం. రూప, ఏపీఎం వెంకట్రామారావు, రైతులు కాకర్ల రంగారావు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తాం

- టౌన్ ఎస్ఐ సంధ్య

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ సంధ్య మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చిన ఎంవీ యాక్ట్ కింద తల్లిదండ్రులపై, వెహికల్ ఓనర్‌పై కేసులను నమోదు చేశామన్నారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే జైలు శిక్ష, లేదా జరిమానా విధిస్తారని చెప్పారు. రాత్రి 11గం. తర్వాత రోడ్లపై అవసరం లేకుండా తిరిగితే కేసు నమోదు చేస్తామని మధిర పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు.





రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు బాల భారతి విద్యాలయం విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-తల్లాడ

కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీలలో బాల భారతి విద్యాలయం విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 బాలుర విభాగం నుండి దూళ్ల ధనుష్, పొట్టేటి వెంకట కృష్ణారెడ్డి, అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయి, పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నారిని ఆశీర్వాదించిన తుంబూరు దయాకర్ రెడ్డి, మేకల మల్లిబాబు యాదవ్

నవతెలంగాణ-కామేపల్లి

తాజా మాజీ ఎంపీపీ బానోతు సునీత - రాందాస్‌ల కూతురు భవిత పుష్పాలంకరణ వేడుక లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇన్ ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని చి. భవితను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శీలం పుల్లయ్య మేకపోతుల మహేష్, రాయల ఉపేందర్, అంబడిపూడి సత్యం బానోత్ సీతారాములు, మాజీ ఎంపీటీసీ బి. సునీతా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.



కార్తీక మాసంలో ప్రతిరోజు ఉచిత అన్న ప్రసాదం


- ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఖమ్మం కేఎస్ఆర్ గ్రానైట్ అధిపతి తుల్లూరి దంపతులు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురంశ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు గత కొన్ని సంవత్సరాల నుండి ఆలయ ప్రాంగణ సమీపంలో శ్రీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రతి శనివారం ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జమలాపురం గ్రామ నివాసి ఖమ్మం కెఎస్ఆర్ గ్రానైట్ అధిపతి తుళ్లూరు కోటేశ్వరరావు నిర్మలా కుమారి దంపతుల సారధ్యంలో కార్తీక మాసం తొలిరోజు శనివారం ప్రారంభించినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదం అందించాలనే ఉద్దేశంతో గత కొన్ని సంవత్సరాల నుండి నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్, సేవా సమితి సభ్యులు కొడాలి విజయలక్ష్మి, బొబ్బ కృష్ణప్రసాద్, ఇమిడి ఈశ్వరచంద్ర విద్యాసాగర్, ఎల్వి నారాయణరెడ్డి, చింత కిషోర్, వీరమాచినేని వెంకటకృష్ణ, కాకునూరు లీలాకృష్ణ, అల్లూరు విష్ణుమూర్తి, గ్రామ స్తులు సుకవాసి రమేష్ బాబు, గొల్లపూడి వెంకటేశ్వర రావు, నక్క నరసింహారావు, నన్నపనేని రామారావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యడవల్లిలో విద్యుత్ శాఖ పొలంబాట

నవతెలంగాణ-ముదిగొండ



ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎన్పీడీసీఎల్) ఎండి కె.వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు ముదిగొండ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలో యడవల్లి గ్రామంలో శనివారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడిఈ బి.రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటూ రైతులు మోటర్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కెపాసిటర్ల వల్ల కలిగే లాభాలను రైతులకు ఆయన వివరించారు. విద్యుత్ ట్రాన్స్ఫారం, మోటర్లు,లైన్లో దగ్గర మరమ్మతులు ఉంటే, సొంత ప్రయోగాలు చేయకుండా విద్యుత్ శాఖ సిబ్బందితో చేయించుకొని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్, ముదిగొండ విద్యుత్ సిబ్బంది జె. నరేందర్, బాబు, గ్రామ పెద్దలు దొంతగాని రామయ్య, గుంజులూరి వీరయ్య, ధర్మమూర్తి, కందిమల్ల రామయ్య, నాయిని వెంకటేశ్వర్లు పలువురు రైతులు పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మధిర

మండల పరిధిలోని సైదిల్లీపురం నెల్లూరి నరసింహ రావు మనవరాలు ద్రోణి ఓనీల ఫంక్షన్ శనివారం జరిగింది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మధిర ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ, బిసి సెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చి రామయ్య, అంబారుపేట డివిజన్ అధ్యక్షులు నాగనబోయిన రామారావు తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
ఆదివారం | నవంబర్03, 2024 | www.navatelangana.com

నేడు బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

నవతెలంగాణ-బోనకల్

సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్ల ఎంపిక ఆదివారం బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు వేజెళ్ళ సురేష్ కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అమరేసి లింగయ్య శనివారం తెలిపారు. ఈ నెల 3 వ తేదీన బాలికల జట్ల, నాలుగవ తేదీన బాలుర జట్ల ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లా జట్లకి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8, 9, 10 తేదీలలో హనుమకొండలో జేఎన్ఎస్ గ్రౌండ్‌లో జరిగే 70వ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనవలసి ఉంటుందని తెలిపారు. అనంతరం క్రీడా ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీలకు కూడా రాష్ట్ర జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే ఆసక్తి కల క్రీడాకారులు 3, 4 తేదీలలో ఉదయం 9 గంటలకల్లా రిపోర్టు చేయాలని కోరారు. వివరాల కొరకు 9989840622 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

ఉచిత పశు వైద్యశిబిరం విజయవంతం

నవతెలంగాణ-కల్లూరు



పశుసంవర్ధక శాఖ పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతమైంది. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో పసుపు వైద్యాధికారి కే. మమత ప్రారంభించారు. అనంతరం 32 పశువులుకు గర్భకోష వ్యాధి చికిత్స 26 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్ కే.మమత రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విఎల్‌వో శ్రీనివాసరావు, గోపాలమిత్ర సూపర్వైజర్ టి.వెంకటేశ్వర్లు, ఎన్.కోటేశ్వరరావు, కే.అప్పారావు, కృష్ణ ప్రసాద్ శివకృష్ణ, రమేషు, విజయ్ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

నేడు మర్లపాడులో మండల మహాసభ

నవతెలంగాణ-వేంసూరు

సిపిఐ(ఎం) తొమ్మిదవ మండల మహాసభ ఆదివారం మండల పరిధిలోని మర్లపాడులో నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి అరవపల్లి జగన్మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలకు రాష్ట్ర జిల్లా కమిటీ సభ్యులు హాజరుకానున్నారని పార్టీ సభ్యులు సానుభూతిపరులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి

- ఎస్టీవోకు సత్తుపల్లి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వినతి

నవతెలంగాణ-సత్తుపల్లి



కమ్యూటేటెడ్ వాల్యూ ఆఫ్ పెన్షన్ (సీవీపీ) అమలు విషయంలో హైకోర్టుకు వెళ్లి అనుకూల ఉత్తర్వులు అందుకున్న పెన్షనర్లకు ట్రెజరీ అధికారులు మినహాయింపు ఇవ్వాలని సత్తుపల్లి రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్టీవో ఎల్లయ్యను కలిసిన ఆ సంఘ నాయకులు కమ్యూటేటెడ్ పెన్షన్ అంశంపై రిటైర్డ్ ఉద్యోగులు కొందరు హైకోర్టును ఆశ్రయించిన తీరు, ఇందుకు స్పందించి హైకోర్టు వారికి సీవీపీ విషయంలో ఇచ్చిన మినహాయింపు ఉత్తర్వుల నేపథ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తరువాత కమ్యూటేషన్ మొత్తాన్ని ఇప్పటి వరకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రిటైర్డ్ అయిన తరువాత 15 యేండ్లు సమాన మొత్తాలతో ప్రభుత్వానికి తిరిగి చెల్లించేవారన్నారు. పెరిగిన వడ్డీ రేట్ల ప్రకారం పెన్షనర్లు తిరిగి అధిక మొత్తంలో చెల్లించాల్సి రావడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఇందుకు సానుకూలతను వ్యక్తం చేసిన హైకోర్టు 12 యేండ్ల, 4 నెలల వరకే కమ్యూటేటెడ్ వాల్యూ ఆఫ్ పెన్షన్‌ను మినహాయించాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. హైకోర్టును ఆశ్రయించి అనుకూల ఉత్తర్వులు పొందిన వారు ఖమ్మం జిల్లాలో 71 మంది ఉండగా వారిలో సత్తుపల్లి ప్రాంతం నుంచి 7గురు ఉన్నారని తెలిపారు. అనంతరం హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి సీవీపీలో అనుకూల ఉత్తర్వులు పొందిన వారికి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీవో ఎల్లయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు ఏఎస్ ప్రకాశరావు, సత్యనారాయణ, బోడేపుడి బాబు, జయరాజు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్


మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో ప్రతి నెల మొదటి ఆదివారం తమ్మినేని సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ బాధితులకు నెలకు సరిపడా మందులు కేవలం 100 రూపాయలకే అందజేస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్ బాధితులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకటన తెలిపిన వారిలో సీపీఎం నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, పొన్నెకంటి సంగయ్య, పొన్నం వెంకటరమణ, నందిగామ కృష్ణ, పి.మోహన్ రావు తదితరులు ఉన్నారు.



డైట్, కాస్మోటిక్ చార్జెస్ పెంపుపై విద్యార్థుల హర్షం

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ హాస్టల్స్‌కి డైట్, కాస్మోటిక్ చార్జెస్ పెంచటంపై నగరంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ (బి), విద్యార్థులు ప్లకార్డుల ప్రదర్శనతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పెంచిన చార్జెస్ వివరాలను విద్యార్థులకు వివరించారు. గతం కంటే 40 శాతం పెంపుదల పట్ల విద్యార్థులు వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి సిబ్బంది నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సభ్యురాలు పగిడికత్తుల లక్ష్మి మృతి

నవతెలంగాణ-నేలకొండపల్లి



నేలకొండపల్లి పట్టణానికి చెందిన సీపీఐ(ఎం) సభ్యురాలు పగిడికత్తుల లక్ష్మి(53) శనివారం మరణించారు. ఆమె గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పార్టీ సీనియర్ నాయకులు ఏటుకూరి రామారావు, రాఘవేంద్ర సుదర్శన్ రావు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పగిడికత్తుల లక్ష్మి పార్టీలో అత్యంత విశ్వాసం, అంకిత భావంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ఆమె ఆకస్మిక మరణం పార్టీ అభివృద్ధికి తీరని లోటన్నారు. ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించారన్నారు. ఆమె మృతదేహాన్ని సందర్శించిన వారిలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు పగిడికత్తుల నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి కె.వి చారి, దండా సూర్యనారాయణ, కోడూరి వెంకటాచారి, కొలిక్కపొంగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలు లేకుండా ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

- మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల కోసం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం డీపీఆర్‌సీ భవనంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, ఆర్‌ఓ ఆర్‌ఐలతో కలిసి ఆర్‌పీ, ఆశ వర్కర్స్‌కి ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సర్వే ఎలా నిర్వహించాలనే అంశం, ఎలాంటి ప్రణాళికలు నిర్వహించి ఏ ఒక్క గృహం సైతం తప్పిపోకుండా పక్కా ప్రణాళికలతో పరిశీలించి హౌస్ లిస్ట్ ఏర్పాటు చేసుకొని, ఎలాంటి గందరగోళం లేకుండా జాగ్రత్తలు తీసుకొని సర్వే పూర్తి చేయాలన్నారు. ఆర్‌ఓ, ఆర్‌ఐలు, మున్సిపల్ అధికారుల కోఆర్డినేట్ చేసుకొని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆర్‌ఓ, ఆర్‌ఐలు, ఆర్‌పీలు, మెప్మా అధికారులు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి

- పార్టీ శ్రేణులు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-వైరాటౌన్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ(ఎం) వైరా రూరల్ మండల కమిటీ సమావేశం బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతకాలం అయినా హామీలను సంపూర్ణంగా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పెన్షన్ల పెంపు, మహిళలకు నెలకు 2500 రూపాయలు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి పన్నెండు వేల రూపాయలు పథకాలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేయని పక్షంలో పార్టీ మహాసభల స్ఫూర్తితో ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం పార్టీ ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేసేంతవరకు ప్రజా పోరాటాలను రూపకల్పనకు ఇప్పుడు జరుగుతున్న పార్టీ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడం జరుగుతుందని, ఇట్టి సమస్యలపై పోరాటాలకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, వైరా రూరల్ మండల కార్యదర్శి తోట నాగేశ్వరావు, కార్యదర్శివర్గ సభ్యులు బాజోజు రమణ, తూము సుధాకర్, కిలారు శ్రీనివాసరావు, గాలి అరుణ, మాగంటి తిరుమలరావు, మండల కమిటీ సభ్యులు జక్రీపోతుల పుష్పరాజ్యం, షేక్ మజీద్, చిత్తారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర గిడ్డింగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ముదిగొండ



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర గిడ్డింగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. మండలపరిధిలోని వల్లభి, మల్లారం గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు మేలు కోరేదన్నారు. రైతులు మధ్య దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ రైతులకు ఇవ్వటం జరుగుతుందన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వాగ్దానాలను తమ ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. రైతుల ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని రాయల సూచించారు. రైతులు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో త్వరితగతిన నగదు జమ చేయాలని రాయల నాగేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ముదిగొండ సొసైటీ చైర్మెన్ తుపాకుల యలగొండస్వామి, ఐకెపి ఎపిఎం సిహెచ్. కల్పన, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, వల్లభి మాజీ ఎంపీటీసీ బిచ్చాల బిక్షం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుపులేటి దేవేంద్రం, ఇలవల పుల్లారెడ్డి పిల్లుట్ల రాఘవ, ఏలూరి భాస్కరరావు, కోయ చిన్నధనమూర్తి, ఐకెపి సీసీ సిహెచ్ వి.రామారావు, గ్రామ దీపికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

8 నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్స్

- పోస్టరును ఆవిష్కరించిన ఎమ్మెల్యే మట్టా దంపతులు

నవతెలంగాణ-సత్తుపల్లి



ఆశా స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో టీఎన్‌బీ (ది న్యూ బ్లడ్) క్రికెట్ టీం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి సత్తుపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి ఆశా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్స్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఆశా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్స్ నిర్వహణ ముఖ్య బాధ్యుడు (టీఎన్‌బీ) పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగే ఈ పోటీల్లో సుమారుగా 16 నుంచి 20 టీంలు పాల్గొంటాయన్నారు. 8 నుంచి 10 రోజుల టోర్నమెంట్స్ జరిగే అవకాశం ఉందన్నారు. ప్రవేశ రుసుం రూ. 5వేలు నిర్ణయించగా విన్నర్స్‌కు రూ. 50వేలు, రన్నర్స్‌కు రూ. 30వేలు నగదు బహుమతులు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ క్రికెట్ టోర్నమెంట్స్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ తోట సుజలరాణి, సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మెన్లు దోమ ఆనంద్‌కుమార్, బాగం నీరజాదేవి, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, మందపాటి పద్మజ్యోతి, కంటె నాగలక్ష్మి, నాగుల్‌మీరా, కాంగ్రెస్ నాయకులు కమల్‌పాషా, పింగుల సామేలు, గొర్లమూరి రామ్మోహన్‌రెడ్డి, కొప్పుల నరేందర్‌రెడ్డి, టోర్నమెంట్స్ నిర్వహణ సభ్యులు చీపు గంగాధర్, జొన్నలగడ్డ కృష్ణవంశీ, యనమాల అజయ్, రాజేశ్, శివ, జైనల్, యశ్వంత్, విజయ్, ఉదయ్, మోసిన్, బాబీ పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంలో వైద్యం సేవలను పెంచాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- మెడికల్ క్యాంపుకు విశేష స్పందన

నవతెలంగాణ-ఖమ్మం



విద్య, వైద్యం రంగాలను పూర్తిగా ప్రభుత్వ పరం చేయాలని, ప్రధానంగా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ప్రతి నెలా ఒక ప్రత్యేకమైన హెల్త్ డాక్టర్‌తో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మంచికంటి భవన్‌లో సీపీఐ(ఎం) ఖమ్మం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బివికె) ఆధ్వర్యంలో బిపి, షుగర్ మెడికల్ క్యాంపు విజయవంతం నిర్వహించారు. అనంతరం నున్నా నాగేశ్వరరావు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఉచితంగా ఖమ్మం జిల్లాలో నడుస్తున్న ఏకైక మెడికల్ క్యాంపు ఇదే అని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం అవసరం ఉందని, ఆరోగ్యకరమైన జీవితాలను ఇవ్వాలని, బాధ్యత ప్రభుత్వానిదే అని తెలిపారు. క్యాన్సర్, హార్ట్ తదితర రోగాలు ఈమధ్య కాలంలో బాగా పెరిగాయని, వీటికి చికిత్స కోసం ప్రయివేటు ఆసుపత్రికి వెళితే ఆస్తులు అమ్ముకునే స్థితికి వచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను రక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యూరో ఫిజీషియన్ డాక్టర్ జడల రణధీర్ రోగులను పరీక్షించి రెండు వందల మంది పేషెంట్లకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు, షుగర్, బిపి సేవలను ఉచితంగా నిర్వహించారు. బిపి, షుగర్‌లకు నెలకు సరిపడా మందులు అందించారు. ప్రముఖ డాక్టర్ రాజేష్ చెవి, ముక్కు, గొంతు వైద్య సేవలు అందించారు. ప్రముఖ డాక్టర్ సి.భారవి, డాక్టర్ రావిళ్ళ రంజిత్, డాక్టర్ కొల్లి అనుదీప్, డాక్టర్ పి.సుబ్బారావు, డాక్టర్ జెట్ల రంగారావు పేషెంట్లను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, బివికె ట్రస్ట్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, ఎం. సుబ్బారావు, పి.ఝాన్సీ, అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, పి. వాసు, మల్లికార్జున్‌రెడ్డి, గుమ్మడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులను ఎల్లవేళలా ఆదుకుంటాం

- డాక్టర్ కాపా మురళీకృష్ణ

నవతెలంగాణ-వైరా



వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీటెక్ స్టూడెంట్ గద్దె ఉషారాణికి, లాప్టాప్ బహుకరించారు. చావా హారిక, గద్దె నీరజల సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరంలో శనివారం ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ లాప్టాప్‌ను విద్యార్థినికి అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందని, ఆర్థిక చేయూతనిస్తుందని తెలిపారు. లయన్స్ క్లబ్ ద్వారా లాప్టాప్ అందించిన తన అత్తయ్య ప్రోత్సాహంతో మంచి పర్సంటేజ్ తో బీటెక్ పూర్తి చేస్తానని గద్దె ఉషారాణి తెలిపారు. అనంతరం ఆర్ఎల్ఎల్ఐ ద్వారా శిక్షణ పొంది సర్టిఫికెట్ అందుకున్న చింతోజు నాగేశ్వరరావును క్లబ్బు సభ్యులందరూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిఎస్టి కోఆర్డినేటర్ ఉండ్రు శ్యాంబాబు, జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ లగడపాటి ప్రభాకర్‌రావు, లయన్స్ క్లబ్ సెక్రటరీ అబ్బూరి రమేష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ ముళ్ళపాటి సీతారాములు, గద్దె నీరజ, మాదినేని దుర్గాప్రసాద్, కొల్లా రాంబాబు, కట్ల సురేష్, ఏపూరి రాజారావు, చెరుకూరు శ్రీనివాసరావు, పిచ్చిరెడ్డి సాయిబాబా, మందిర్ చైర్మెన్ పొడపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడే సీపీఐ(ఎం) మండల మహాసభ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో ఆదివారం ఖమ్మం రూరల్ మండల సీపీఐ(ఎం) 9 వ మహాసభ జరగనున్నట్లు మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు ఇన్‌చార్జి బండి రమేష్ హాజరవుతారని తెలిపారు. మహాసభ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, మండలంలోని సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు బహిరంగ సభకు హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

- ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

నవతెలంగాణ-సత్తుపల్లి



మహిళలపై అనునిత్యం జరుగుతున్న లైంగికదాడులు, హత్యలు, హింసను అరికట్టడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి విమర్శించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో తాళ్ళమడలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయన్నారు. ప్రతిరోజూ ఏదోఒక చోట మహిళలపై ఈ రకమైన దారుణాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు ఎలగం పార్వతి, సభ్యురాళ్లు బొప్పన లక్ష్మి, వెంకటమ్మ లక్ష్మి, అనురాధ, వెంకమ్మ, కుమారి పాల్గొన్నారు.



పెనుబల్లి : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం లంకపల్లి సుందరయ్య కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా పెనుబల్లి మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గొల్లమందల నరసమ్మ, దుగ్గిరాల నాగమణి, యామవరపు సక్కుబాయి, కృష్ణవేణి, పోతిని నాగమణి, నాగేంద్ర, అలివేలు, వెంకట నరసమ్మ పాల్గొన్నారు.

పొలం బాట పట్టిన విద్యుత్ శాఖ

నవతెలంగాణ-నేలకొండపల్లి

వ్యవసాయ క్షేత్రంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నేలకొండపల్లి విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో అధికారులు సిబ్బంది శనివారం పొలం బాట పట్టారు. మండలంలోని కొత్త కొత్తూరు గ్రామానికి చెందిన పొలాలలో రైతులను స్వయంగా కలిసి వారు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి విద్యుత్‌శాఖ ఏఈ కే.రామరావు మాట్లాడుతూ విద్యుత్తు అప్ అండ్ డౌన్ కాకుండా సేవ్ చేయడం పట్ల ప్రతి రైతు జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోకుండా కెపాసిటర్లు అమర్చడం వల్ల ఓల్టేజ్ పెరుగుతుందన్నారు. లూజు లైన్లు, మిడిల్ పోల్స్ ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ అబ్దుల్ కదిర్, లైన్ స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఆఫీస్ సిబ్బంది బి.రామకృష్ణ, కె.సతీష్, రైతులు, కొత్త కొత్తూరు మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, శెట్టిపల్లి రామారావు, రావెళ్ల రవి, రావెళ్ల జ్యోతిబాస్, జ్వాలా కృష్ణ, రాచకొండ లింగయ్య, నరేష్, రామకృష్ణ, నీలం నాగేశ్వరావు, శివ, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : విద్యుత్ శాఖ పెట్టండి నిబంధనలు పాటించి విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండి ప్రాణాలు కాపాడుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ పి. వెంకట్ రైతులను కోరారు. శనివారం విద్యుత్‌శాఖ పొలం బాట కార్యక్రమంలో భాగంగా మండంలంలోని పుల్లయ్య బంజర, తూర్పు లోకారం, పడమర లోకారం, గ్రామాలలోని వ్యవసాయ వినియోగదారులతో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ వెంకట్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్లు సత్యనారాయణ, రవి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోండి

నవతెలంగాణ-బోనకల్



మండలంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కడగండ్ల మధుబాబు, కలకోట సొసైటీ చైర్మెన్ కర్నాటి రామకోటేశ్వరరావు, ఐకెపి ఎపిఎం యద్దనపూడి పద్మలత రైతులను కోరారు. మండల పరిధిలోని రాయన్నపేట, లక్ష్మీపురం, బ్రాహ్మణపల్లి సహకార సంఘాల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎస్ఐ కడగండ్ల మధుబాబు, కలకోట సొసైటీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని తెలిపారు. రైతులందరూ ప్రైవేటు వ్యాపారును ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సీసీ లావూరి ఝాన్సీ భాయ్, కాంగ్రెస్ నాయకుడు మారుపాలి ప్రేమ్ కుమార్, వివో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | నవంబర్ 3, 2024 | www.navatelangana.com



మాది బాధ్యతాయుత పాలన

- గ్రామ పంచాయతీల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

నవతెలంగాణ-పినపాక

బాధ్యతాయుతమైన పాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనసాగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని పోట్లపల్లి, మల్లారం గ్రామపంచాయతీలో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల సమీక్షా సమావేశం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన, రోడ్లు అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. గడిచిన 10 ఏళ్ల కాలంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇవ్వాళ ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకొని మాట్లాడాలని బీఆర్ఎస్ నాయకులకు చురకలు అంటించారు. దళిత బంధు అని చెప్పి దళితుల్ని దగా చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు ప్రతి పేదవాడికి ఆర్థిక వెసులుబాటును కల్పించేవే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి (ఏడీ) బీ.తాతారావు, తహశీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాథం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉడుముల లక్ష్మీరెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆనంద్, కళ్యాణి, వెంకటేశ్వరరావు, లింగయ్య కృష్ణ, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి : ఎంఈఓ

నవతెలంగాణ-అశ్వారావుపేట



విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ పి.ప్రసాదరావు అన్నారు. శనివారం అశ్వారావుపేట కాంప్లెక్స్ పరిధిలోని అల్లూరి సీతారామరాజునగర్, బీసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రార్థన సమయానికే ఎ.ఎస్.ఆర్.నగర్ పాఠశాలకు చేరుకొని పాఠశాలలో ప్రార్థన జరిగే తీరును పరిశీలించారు. అనంతరం బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వర్క్ బుక్స్, మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్క్ బుక్స్ కరెక్షన్ వెంటనే చేయాలని, సిలబస్‌కు అనుగుణంగా వర్క్ బుక్స్‌ను పూర్తి చేయించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రతిరోజూ గ్రంథాలయ పిరియడ్‌ను గ్రంథాలయానికి కేటాయించిన గదుల్లోనే నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

నవతెలంగాణ-పాల్వంచ



జిల్లాలలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు శనివారం దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ చాలా ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న సమస్య రాకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని అన్నారు. సన్నరకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డు రకం, సన్న రకం ధాన్యాలను విడి విడిగా భద్రపరచాలని అన్నారు. తాలు పేరుతో కోతలు పెట్టొద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని అన్నారు. రైతుకు ఎటువంటి నష్టం రావడానికి వీలు లేదని అన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని దాని వల్ల కొనుగోలు ప్రక్రియ సులభం అవుతుందని కలెక్టర్ సూచించారు.

జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, జీఓపై చర్చించాలని అవగాహన, రైస్ మిల్లర్లచే బ్యాంక్ గ్యారంటీ సమర్పిస్తామని, అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చని అన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్ర పరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గోడౌన్లు సన్నద్ధం చేయాలని తెలిపారు. ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్‌తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా సరిహద్దు వద్ద పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.



హోంగార్డు ఆఫీసర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : ఎస్పీ

- తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా హోంగార్డ్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం

నిత్యం ప్రజలకు సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పాటుపడే పోలీసులకు సహాయకారులుగా పనిచేసే హోంగార్డు ఆఫీసర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని హోంగార్డ్స్ సమస్యలను అసోసియేషన్ తరపున వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెూంగార్డు ఆఫీసర్స్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో, విద్యా సంస్థల్లో ఫీజుల రాయితీ గురించి యాజమాన్యాలతో చర్చిస్తామని తెలియజేసారు. జిల్లాలో పనిచేసే హోంగార్డ్ ఆఫీసర్స్ అందరూ క్రమశిక్షణతో, సమయపాలన పాటిస్తూ తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఉద్యోగ పరంగా, వ్యక్తిగత పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పీ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, హోంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు, ఎంటీఓ సుధాకర్, హోంగార్డ్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

- వ్యవసాయ విద్యార్థులతో ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-దమ్మపేట



గ్రామస్తులతో మమేకమై గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. మల్లారం గ్రామంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు వారం రోజుల పాటు చేపట్టిన జాతీయ సేవా పథకం శిబిరంను జారే ఎన్ఎస్ఎస్ జెండా ఎగుర వేసి ప్రారంభించారు. ఈ క్రమంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో వివిధ మోడల్స్‌ను వీక్షించి వ్యవసాయ సాంకేతికతను చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగ పడే అంశాలను తెలుసుకొని వాటిని గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు గ్రామస్తులతో మమేకం కావాలని, గ్రామంలో స్థితి గతులను తెలుసుకొని గ్రామాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ ఈ వారం రోజుల పాటు జరిగే ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామస్తుల ముఖ్యమైన అవసరాలను తెలుసుకొని వాటికి అనుగుణంగా విద్యార్థులు ప్రజలు, రైతులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏడీఏ పి.రవికుమార్, సొసైటీ చైర్మెన్ రాఘవరావు, కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం డాక్టర్ ఎం.రామ్‌ప్రసాద్, రెడ్డిప్రియ, శ్రావణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ దీప్తి, అధ్యాపకులు కె.శిరీష, రమేష్, కోటేశ్వ రావు, కృష్ణతేజ, పావని, కళాశాల నాల్గొవ సంవత్సర విద్యార్థులు, వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ అనూష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో అరకొర హాజరు

- బడికి ఎగనామం పెడుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-అశ్వారావుపేట





పాఠశాల విద్యపై పడిన లాక్ డౌన్ ప్రభావం నాలుగేళ్ళు అయినా ఆ శాఖను వెంటాడుతూనే ఉంది. ఈ కారణంతో ప్రాథమిక స్థాయి విద్యలో అన్య ధోరణిలు పొడ చూపుతున్నాయి. కారణంగా విద్యార్థుల శాతం రోజు రోజుకు తీసి కట్టుగా తయారు అయింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన విద్యను అందించి భవిష్యత్ పౌర సమాజాన్ని నైపుణ్య వంతంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నాలు బూడిదలో పోసిన పన్నీరు చెందగా తయారు అవుతుంది. వరుసగా సెలవులు వచ్చిన తర్వాత బడులు తెరిస్తే పిల్లలు మోహం చాటేస్తున్నారు. ఉపాధ్యాయుల్లోనూ అదే ధోరణి వ్యక్తం కావడంతో ప్రాథమిక విద్య ప్రమాదంలో పడిందనే చెప్పాలి. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలలను నవతెలంగాణ సందర్శించింది. ఈ సందర్భంగా పిల్లలు ఉన్న చోటు ఉపాధ్యాయులు లేరు. ఉపాధ్యాయులు ఉన్న చోట పిల్లలు లేరు. వారిది వీరిది సగం సగం హాజరు కనిపించింది.

1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఉండే ఎంపీపీ ఎస్ నందమూరి నగర్‌లో మొత్తం 27 మంది విద్యార్థినీ, విద్యార్థులకు గాను 17 మంది, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో 15 మందికి 9 మంది, బీసీ కాలనీలో 51 మందికి 32 మంది, పేరాయిగూడెంలో 26 మందికి 13 మంది, నెహ్రూ నగర్‌లో 51 మందికి 34 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. నందమూరి నగర్, నెహ్రూ నగర్‌లలో ఇద్దరికి ఇద్దరు, పేరాయిగూడెం, బీసీ కాలనీలో ఇద్దరికి ఒక్కరు ఉపాధ్యాయులు, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో సింగిల్ టీచర్ హాజరు అయ్యారు. ఇకపోతే ఈ 6 నుండి 18 వరకు ప్రాథమిక పాఠశాలలకు ఒంటిపూట బడులు పెట్టి, మిగతా పూట ఉపాధ్యాయులే ఎన్యూమరేట్‌లుగా సామగ్రి కుటుంబ సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సెలవులు ప్రభావం ఏ మాత్రం ఉంటుందో మరి. ఈ విషయం అయి ఎంఈవో ప్రసాదరావును వివరణ కోరగా వరుస సెలవులు కారణంగా బడి తెరిచిన రోజు పిల్లలు బడికి రావడం లేదని, తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు.

గ్రామాల ప్రగతి కోసమే రివ్యూ సమావేశాలు

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ప్రణాళిక బద్ధంగా గ్రామాల ప్రగతి కోసమే గ్రామపంచాయతీల వారిగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తెలిపారు. శనివారం బండారు గూడెం గ్రామంలో తూరుబాక, బి కొత్తగూడెం గ్రామపంచాయతీల రివ్యూ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్యలు సంయుక్తంగా నిర్వహించిన రివ్యూ సమావేశంలో తాగునీరు, సాగునీరు, విద్యుత్, గ్రామాలలో పారిశుధ్య పనులు, రహదారులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారం, పోడు భూములకు పట్టాలు తదితర సమస్యలపై శాఖల వారీగా సమీక్షించారు.

ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ... డివిజన్ వ్యాప్తంగా ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను రివ్యూ సమావేశంలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి ఏజెన్సీ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతానన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఈదయ్య, ఎంపీఓ రామకృష్ణ, ఈజీఎస్ ఏపీవో సుకన్య, ఆర్ఐ జీ.రసింహారావుతో పాటు మాజీ జెడ్పీటీసీ అన్నె సత్యనారాయణమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమాచినేని వినీల్, నాయకులు మట్ట వెంకటేశ్వరరావు, దర్శి సాంబశివరావు, లంక శ్రీనివాసరావు, గద్దం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-చంద్రుగొండ

భూ వివాదంలో ప్రత్యర్థుల దాడిలో ఇరువురికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రావికంపాడు పంచాయతీ, దుబ్బతండ గ్రామానికి చెందిన బానోత్ బాలు, భార్య లక్ష్మిలు, కొంత మంది కూలీలతో కలిసి శనివారం పత్తి చేసులో పత్తి తీసేందుకు వెళ్లి పనిలో నిమగ్నమైనారు. ఇదే గ్రామానికి భూక్య సురేష్, బీముడు, జ్యోతి, శాంతి అనే నలుగురు వ్యక్తులు బాలు-లక్ష్మిలపై దాడి చేశారు. ఈ దాడిలో భార్యభర్తలైనా బాలు, లక్ష్మిలకు తలకు బలమైనా గాయాలైనాయి. క్షతగాత్రులను చంద్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ నుండి మెరుగైనా వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల వారు స్థానిక పోలీస్టేషన్లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.



ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మారుతి నర్సింగ్ కాలేజ్ లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ యూఎస్ఏ వారి సహకారంతో ఉచిత నేత్ర శాస్త్ర చికిత్స శిబిరం కార్యక్రమ వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెల్లం మాట్లాడుతూ కంటి చూపు తక్కువ ఉన్న వారిని పరీక్షించి అవసరమైన వారికి ప్రఖ్యాతి గాంచిన పుష్పగిరి కంటి ఆసుపత్రి, సికింద్రాబాద్ వారిచే ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ క్యాంప్ 06-11-24, ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు పట్టణంలోని మారుతి నర్సింగ్ కాలేజ్ కూనవరం రోడ్డు నందు నేత్ర శస్త్ర చికిత్సలు చేయబడునని తెలియజేశారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎండి నవాబ్, రెడ్ క్రాస్ సభ్యులు సభ్యులు భీమవరపు వెంకటరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ గౌరవాధ్యక్షులు ఎస్ఎల్ కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాల ప్రతిపాదన పట్ల హర్షం

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని జీఎం కార్యాలయాల ప్రాంగణాల్లో ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు పై ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ ప్రతిపాదన పట్ల మణుగూరు ఏరియా ఎస్సీ, ఎస్టీ బ్రాంచి (1630/1982) సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పీవీ కాలనీ ఏరియా అంబేద్కర్ పార్క్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్క వెంకటయ్య ఐదుగురు కమిటీ సభ్యులతో అక్టోబర్ 28న సింగరేణి భవన్ నందు ఎస్సీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, ఆర్ఆర్ రిజర్వేషన్ పదోన్నతుల పై సింగరేణి సీఎండీ బలరాం సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ (1630/1982) కమిటీ రాష్ట్ర ప్రధాన సభ్యులు పాల్గొని సింగరేణి వ్యాప్తంగా ఎస్సీ ఉద్యోగులు, కార్మికులపై జరుగుతున్న దాడులు అన్యాయాలను కమిషన్ దృష్టికి తీసుక వెళ్లి పరిష్కార మార్గం కోరడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం గతంలో కమిటీ తరుపున చేసిన పలు ప్రతిపాదనల పై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ వెంకటయ్య సానుకూలంగా స్పందించి చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంకు పలు ప్రతిపాదనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రసిడెంట్ రాజలింగు, వైస్ ప్రసిడెంట్ మేకల ఈశ్వర్, బ్రాంచి సెక్రటరీలు పీక శంకర్, కాసర్ల అనిల్, ట్రెజరర్ మార్క్స్, గౌరవ సలహాదారులు వెంకట రత్నం, మునిగేల రమేష్, సందీప్, నిట్ట జీవ రత్నం పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని అభినందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ- దమ్మపేట



ఓఈఆర్ 19.40శాతం పెరుగుదలకు కృషి చేసిన పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పామాయిల్ గెలల ధర రూ.19 వేలు దాటిన నేపథ్యంలో టన్ను ధర పెరుగుదలకు విశేషంగా కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అలాగే ఆయిల్ ఫెడ్ రైతు సంఘం నాయకులకు జారే కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మలేషియా టెక్నాలజీతో నిర్మించినటువంటి అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో 19.40శాతం ఆయిల్ రికవరీ శాతం వచ్చినందున ఆయిల్ రికవరీలో మలేషియాతో పోటీపడి ఆ దేశంలో 19.50శాతం రికవరీకి దరిదాపుగా చేరడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ పెరుగుదల రైతులకు పామాయిల్ గెలల ధర గరిష్టంగా పెరగటానికి కారణమైందని ఓఈఆర్ పెరుగుదలకు విశేషంగా కృషి చేసి పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం అత్యధిక ఓఈఆర్ సాధించినందుకు నియోజకవర్గ రైతుల పక్షాన యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయిల్‌ఫెడ్ సూచనలు పాటించి పూర్తిగా పక్వానికి వచ్చిన నాణ్యమైన గెలలు ఫ్యాక్టరీకి తరలించి ఆయిల్ రికవరీ శాతం మరింత పెంచే విధంగా రైతులు కృషి చేయాలన్నారు. తద్వారా రానున్న రోజుల్లో పామాయిల్ గెలల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ అధికారులు, ఆయిల్ ఫెడ్ రైతు సంఘం నాయకులు, ఫామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం, పామాయిల్ రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై అర్ధరాత్రి హత్యాయత్నం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఇల్లందు పట్టణ పరిసర ప్రాంతాల్లోని సుమారు పది మంది వ్యక్తులకు పైగా కలిసి వచ్చి పెద్దూరు గ్రామానికి చెందిన ఓ యువకుడి ఇంటిపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన చీమల శేఖర్(24), ఇదే మండలంలోని మరో గ్రామానికి చెందిన ఓ అమ్మాయి(22) గత 8 సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. దాంతో గత 6 సంవత్సరాలుగా ఆమె చదువు, ఇంటి వ్యవసాయ ఖర్చులు శేఖర్ పెట్టుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇరువురి ప్రేమ విషయం తెలిసిన ఇరు కుటుంబాల సభ్యులు శేఖర్, యువతిలకు పెళ్లి చేద్దామని నిశ్చయించుకున్నారు. కాగా, గత రెండేళ్లుగా ఉన్నత చదువుల (బీపీడీ) నిమిత్తం హన్మకొండ ఓ కళాశాలలో యువతి చేరింది. ఈ నేపథ్యంలో అదే కళాశాలలో తనతో పాటు బీపీడీ చదువుతున్న మరో యువకుడు (24)ని ఇష్టపడి, అతన్నే వివాహం చేసుకుంటానని యువతి తన కుటుంబ సభ్యులకు చెబుతోంది. తన ప్రమికురాలు మరొకరితో ప్రేమలో ఉన్న విషయం తెలిసిన శేఖర్ తనని మోసం చేసిన యువతిని తాను 6 సంవత్సరాల్లో ఆమె చదువులకు, ఇంటి వ్యవసాయ పనులకు ఖర్చు పెట్టిన సుమారు రూ.4 లక్షల డబ్బు తిరిగి ఇవ్వాలని శేఖర్ పలుమార్లు యువతిని అడిగాడు. ఇదే విషయాన్ని ఆమె వివాహం చేసుకుంటానన్న (క్లాస్ మెంట్)కు సైతం చెప్పాడు.

ఆ విషయాన్ని కాస్త అతడి తమ్ముడికి చెప్పాడు. అది విన్న అతడి తమ్ముడు ఇల్లందు చుట్టు పక్కల గ్రామానికి చెందిన సుమారు పది మందికి పైగా అబ్బాయితో మండలంలోని పెద్దూరు గ్రామానికి శుక్రవారం అర్ధరాత్రి వచ్చి బెదిరించి, కొట్టినట్టు శేఖర్ చెప్పాడు. కాగా, శనివారం ఉదయం శేఖర్ తన మిత్రులతో వచ్చి ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన విషయంపై ఫిర్యాదు ఇచ్చాడు. ఎస్సై ఈ.రతీష్ నిందితులను పిలిపించి, దర్యాప్తు చేపట్టి, కేసు నమోదు చేస్తానని చెప్పినట్టు శేఖర్ తెలిపాడు.



వృద్ధాశ్రమం నడపడం అభినందనీయం

- నల్లా రాధాకృష్ణ

నవతెలంగాణ-అశ్వాపురం

ఎన్నో వ్యాయప్రాయాలకు ఓర్చుకొని వృద్ధుల ఆశ్రమం నడపడం అభినందనీయమని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ప్రశంసించారు. సింగరేణిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగిని ఆమె తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి యేటా వృద్ధాశ్రమానికి వితరణ అందజేసి తమ ఔదార్యం చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం క్వింటా బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీనికి ఆయన పాల్గొని మాట్లాడారు. కనీ పెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వారు సంతోషంగా జీవించేలా చూసుకోవలసిన బాధ్యత తమ సంతానపై ఉంటుందని ఆర్థిక ఇబ్బందులతో కొంతమంది, అన్నీ ఉన్న బాధ్యత రాహిత్యంతో కొంతమంది ఇతర కారణాలతో మరి కొంతమంది తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారని అలాంటివారిని చేరదీసి వ్యయ ప్రయాసల కోర్చి ఆశ్రయం కల్పించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు షహనాజ్ బేగం, మెహరాజ్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యులు యస్‌డి నాసర్ పాషా, జగన్మోహన్ రెడ్డి, అంగోత్ మంగీలాల్, ఎస్‌డీ హుమాయూన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఓటు నమోదుకు గడువు తేదీ (నవంబర్ 6) సమీపిస్తున్నందున, ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అర్హత వివరాలు ఉపాధ్యాయుల్లో ఎవరైతే 2018 నవంబర్ ఒకటో తేదీ నుండి 2024 అక్టోబర్ 31వ తేదీ వరకు మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఫామ్-19 ద్వారా దరఖాస్తు నింపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్లైన్లో కూడా ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును https://ceotserms2.telangana. gov.in/mlc/form19.aspx వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదుకు జీవో నెంబర్ 49 ద్వారా కింద తెలిపిన పాఠశాల ఉపాధ్యాయులు అర్హులు అని తెలిపారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన దేవాలయంగా కీర్తించ బడుతున్న పాల్వంచ అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం ప్రారంభించారు. శనివారం దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మెన్, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, కమిటీ సభ్యులు కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమం 2025 సంవత్సరం జనవరి 1వ తేదీ వరకు జరుపుతారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంపలి సత్యనారాయణ, బండెల శ్రీనివాస్, మిరియాల కమలాకర్, కనగాల రాంబాబు, మేడిద సంతోష్ గౌడ్, కాల్వ భాస్కర్ రావు, బండి లక్ష్మణ్, శంకర్ మని, వేమారెడ్డి, చారి, ఎన్.చారి తదితరులు పాల్గొన్నారు.



క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంలో సేవాలాల్ జిల్లా అధ్యక్షుడు శివ నాయక్

నవతెలంగాణ-అశ్వాపురం

క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని సేవాలాల్ జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పీచుకల తండాలోని గల బంజారా గణేష్ యూత్, సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంఘాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలను ప్రశాంత కరమైన వాతావరణంలో నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. గెలిచినవారు ఆనందపడి, ఓడిన వారు నిరాశ పడాల్సిన అవసరం లేదని, ఓటమి ఎప్పుడు గెలుపుకు నాందిగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధరావతు కృష్ణ నాయక్, జిల్లా అధ్యక్షుడు భరత నాయక్, యోగి నాయక్, పరమేష్ నాయక్, ధర్మజాగరణ సాధుకాంతమ్మ, తేజావత్ సోమ్లా నాయక్, కోఠి నాయక్, భూక్యా నర్సింహా నాయక్, లకావత్ బాబు, ధారావత్ సక్రు, నిర్మల పాల్గొన్నారు.

రీజినల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన జీఎం



నవతెలంగాణ-ఇల్లందు

వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఇల్లందు ఏరియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రీజినల్ స్థాయి (మణుగూరు, ఇల్లందు ఏరియా) చెస్ అండ్ క్యారమ్స్ క్రీడా పోటీలను ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజులలో చదరంగం ప్రపంచ ఆటలలో ప్రఖ్యాతి వహిస్తుందన్నారు. చదరంగం, క్యారమ్స్ ఆటలో మేధా శక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళానైపుణ్యం కలిసి ఉంటాయని, ఈ క్రీడా పోటీలను ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా నిర్వహిస్తుందన్నారు. తదుపరివారు చెస్ అండ్ క్యారమ్స్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్ రావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ జాన్ వెస్లీ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రతినిధ్య సంఘం ఉపా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, క్రీడల సమన్వయకర్త రమేష్ సింగ్, జనరల్ కెప్టెన్ అన్వర్, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ మృతికి సీపీఐ(ఎం) సంతాపం



నవతెలంగాణ-మణుగూరు

అంగన్వాడి టీచర్ దేశ బోయిన మల్లీశ్వరి మృతికి సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యమంలో డి.మల్లేశ్వరి పాత్ర మరువలేనిదని అన్నారు. ఆమె ఎన్నో పోరాటాలకు అండగా ఉన్నదని, టీచర్ల జీతాలు పెంపుకి స్థానిక సమస్యల పోరాటాలలో ఆమె పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సత్రపల్లి సాంబశివరావు, సీఐటీయూ నాయకులు హేమలత, అరుణ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్‌లలో భోజన సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-మణుగూరు

ఓసీ 4, మణుగూరు ఓపెన్ కాస్ట్ క్యాంటీన్‌లలో భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతూ ఏరియా యస్ఓటూ జీఎం శ్యామ్ సుందర్‌కు ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఏరియా నందు ఓసీ 2 క్యాంటీన్ నందు యాజమాన్యం భోజన సౌకర్యం ఏర్పాటు చేసిన తర్వాత నిర్దేశించిన లక్ష్యాల్లో అద్భుతమైన ఫలితాలు రావడమే కాకుండా కార్మిక ఆరోగ్యానికి మేలైన ప్రయోజనాలు చేకూరడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, ముకేశ్, శ్రీనివాస్, మస్తాన్, సర్వే నరేష్, బత్తుల శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు

రామనరసమ్మ మృతికి ఎమ్మెల్యే నివాళి



నవతెలంగాణ-ఇల్లందు

సత్యనారాయణపురంకు చెందిన కందుల రామనరసమ్మ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు కోరం కనకయ్య ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందించారు. వారి వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డ డానియల్ మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మడుగు సాంబమూర్తి, బోల్లా సూర్యం, చిల్లా శ్రీనివాస్, యర్రసంగి వెంకన్న, వారా రవి, సైదామియా, వెంకన్న, నాగయ్య యలమందరవు తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల వేలం పాటలు ఖరారు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద నిర్వహించే వివిధ రకాల దుకాణాలకు భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం వద్ద శనివారం వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్ణశాల రామాలయం వద్ద కొబ్బరికాయలు విక్రయించే వేలంపాట ఈ నెల 16 నుంచి సంవత్సరానికి గాను నాగుల గురుమూర్తి అనే వ్యక్తి రూ.8.75 లక్షలకు హెచ్చు పాట పాడి పాటను దక్కించుకున్నాడు.

దీంతోపాటు ఆలయ పరిసరాలలో శీతల పానీయాల విక్రయం కోసం డిసెంబర్ ఒకటి నుంచి సంవత్సర కాలం పాటు డి.రాజేష్ అనే పాట దారుడు రూ.2.90 లక్షలకు వేలం దక్కించుకోగా ఆలయం వద్ద దీపారాధన వత్తుల విక్రయం కోసం జనవరి ఒకటి నుంచి సంవత్సర కాలం పాటు ఎం.గోవిందరావు అనే వ్యక్తి రూ.1.56 లక్షలకు హెచ్చు పాట పాడి దక్కించుకున్నాడు. న్యూ డార్మెటరీ హాల్ నిర్వహణ కోసం డిసెంబర్ 1 నుంచి సంవత్సర కాలం పాటు సిహెచ్ నాగమణి అనే మహిళ రూ.1.95 లక్షలకు వేలం దక్కించుకున్నారు. ఆలయం వద్ద పూలు విక్రయించేందుకు డిసెంబర్ 1 నుంచి సంవత్సర కాలం పాటు కే.పవన్ కుమార్ అనే హెచ్ పాటదారుడు రూ.53 వేలకు పాటను దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఈవో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్‌లో సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభలు

ఆరు హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి బొగ్గు గనుల పుట్టినిల్లు, పోరాటాల పురిటి గడ్డ బొగ్గుట్టలో భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభలను నిర్వహించాలన్నట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏ.జే.రమేష్‌లు తెలిపారు. స్థానిక ఏలూరి భవన్‌లో శనివారం అబ్దుల్ నబి అధ్యక్షతన జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 2024 డిసెంబర్ 20, 21న జరగనున్న మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఏర్పాటు జరిగాక నీళ్లు, నిధులు, నియామకాల్లు మనవే అని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించి గత ఎన్నికల్లో ప్రజలు చిత్కరించారని అన్నారు. 6 గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రజా పాలన కొనసాగిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. గ్యారెంటీలు అమలు చేయడంలో తాత్సారం చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, మతాల మధ్య చిచ్చు పెట్టి మైనారిటీ వర్గాల ప్రజలను అభద్రతా భావాన్ని కలిగిస్తున్నదని, కార్మికులకు నష్టం కలిగించే 4లేబర్ కోడ్లు, రైతు నల్ల చట్టాలు తెచ్చి కార్పొరేట్ అనుకూల వైఖరి ప్రదర్శిస్తూ ఉన్నదనన్నారు. అధిక ధరలను నియంత్రించక సమస్త ప్రజలకు అన్యాయం చేస్తున్నదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో అత్యంత పెద్ద గిరిజన నియోజక వర్గం, చారిత్రాత్మక పట్టణం సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందులో నాటి నుండి నేటి వరకు పాలకుల వివక్షకు కునారిల్లుతున్నదని అన్నారు.

2016లో నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు శంకుస్థాపన చేశారు. ఆ పాత డిజైన్ కాక ఇప్పుడున్న పాలకులు ఇల్లందు, కొత్తగూడెం, గార్ల, బయ్యారం, సింగరేణి, కామేపల్లి మండలాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తనికి తాగునీరు, సాగునీరు, గృహ అవసరాలకు మిషన్ భగీరథ నీళ్ళు అందించాలని వారు కోరారు. ఈ ప్రెస్ మీట్‌లో ఆలేటి కిరణ్ కుమార్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, సుడిగాలి వెంకట నరసయ్య, ఎం.లక్ష్మీ, సర్వన్ కుమార్, మాదారపు వెంకటేశ్వర్లు, వాసం రాము, ఎం.డి జైబున్నిసా, సంధ్య, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా..?

- గిరిజన మహిళా డిగ్రీ కళాశాల సందర్శనలో కలెక్టర్

నవతెలంగాణ-కొత్తగూడెం

మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా..?, నిబంధనల ప్రకారం విద్యార్థులకు అందించాల్సిన ఆహారం అందించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను హెచ్చరించారు. శనివారం గిరిజన మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం, పాతకొత్తగూడెం, నెహ్రూ నగర్‌లో గల గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గురుకుల వసతి గృహంలో సౌకర్యాలు సమస్యలను విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా...? లేదా అని ఆరా తీశారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు దించాల్సిన ఆహారం, విద్యా సామగ్రి ఇతర సౌకర్యాల గురించి అక్కడ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కళాశాల ప్రిన్సిపల్ అనురాధను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీలకు కావలసిన మెరుగైన వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే న్యాక్ అక్రిడేషన్ కోసం, విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు ప్రణాళికలు ఏ విధంగా నిర్మించుకోవాలని విద్యార్థులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. విద్యార్థినులు ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితమే మెస్ ఛార్జీల పెంపు

- జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం



నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్రంలో గత మెస్ ఛార్జీలకు అదనంగా 40 శాతం మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంపును భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) స్వాగతిస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం తెలిపారు. కానీ, ఈ పెంపు పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా లేదని, ప్రస్తుత చార్జీలకు 3 రెట్లు అదనంగా పెంచితేనే ప్రస్తుత ధరల రీత్యా నాణ్యమైన భోజనం అందించగలమని, 23 మే 2017 అనంతరం 31 అక్టోబర్ 2024న ప్రభుత్వం మెస్ ఛార్జీలు 40 పెంచుతున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం జీ.ఓ నెం-9 విడుదల చేసిందని, 3 నుండి 7వ తరగతి విద్యార్థులకు గతంలో రూ.950 మెస్ ఛార్జీలు చెల్లిస్తుండగా, ఇప్పుడు రూ.1330కి పెంచారని, 8వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు గతంలో రూ.1100 చెల్లిస్తుండగా, ఇప్పుడు రూ.1540కి పెంచారని, ఇంటర్ నుండి పీజీ విద్యార్థులకు గతంలో రూ.1500 చెల్లిస్తుండగా, ప్రస్తుతం రూ.2100 పెంచాలన్నారు. కాస్మోటిక్ ఛార్జీలు సుమారు 3.12 రెట్లు పెంపు హర్షణీయమన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా వసతి గృహాలు జిల్లాలో ఉన్నాయని, ప్రభుత్వ మెస్ ఛార్జీల పెంపుతో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కెజిబివిలు, జనరల్ పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ వసతి గృహాల విద్యార్థులకు లబ్ధిచేకూరతుందన్నారు. జిల్లాలో సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించాలని, వసతి గృహాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భద్రాద్రి కొత్తగూడెం కమిటీ పిలుపు నందుకొని జిల్లాలోని ప్రతీ మండలంలో సంక్షేమ వసతి గృహాల అధికారాల కార్యాలయాల ఎదుట, ఐటీడీఏల ఎదుట, కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, రాస్తారోకోలు, ముట్టడీలు నిర్వహించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వేలాదిమందితో ప్రగతి భవన్ ముట్టడించామని, కలెక్టరేట్స్, రాజధానిలో ప్రగతి భవన్ ముట్టడి సందర్భంగా అనేక మంది ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై లాఠీచార్జి చేసారని, పోలీసులు కర్కశంగా విద్యార్థుల గొంతు నులిమారని, ఈడ్చుకుంటూ వెళ్లి అక్రమ అరెస్టులు చేసారని, వందలాది మంది కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఇప్పటికీ ప్రభుత్వ తప్పుడు అభియోగాలతో మోపిన కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారున్నారు. గత 5 సంవత్సరాలలో నాసిరకం భోజనం తిని మండలాల్లో అనేక చోట్ల ఫుడ్ పాయిజన్‌లు సంభవించాయని, విద్యార్థులు కడుపు నొప్పి, నీళ్ల విరేచనాలు, తలనొప్పి, జ్వరం, రక్త హీనత, డయేరియా వంటి రోగాలతో బాధపడ్డారన్నారు. విద్యార్థులు ఐక్యంగా ప్రభుత్వంపై ఉద్యమించడం ద్వారానే మెస్ ఛార్జీల పెంపు సాధ్యమైందన్నారు.

వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రలతో అనేక సమస్యల అధ్యయనం

జిల్లాలో వేల కిలోమీటర్లు సైకిల్ యాత్రలు నిర్వహించి వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని, ఆయా సమస్యలతో కూడిన బుక్‌లెట్ వేసి జిల్లా అధికారులకు, మంత్రులకు అందజేశామనీ, ఎడతెరిపి లేకుండా వర్షాలు, తీవ్రమైన ఎండలూ, ఎముకలు కొరికేచలి సైకిళ్ళు తొక్కే కార్యకర్తల పట్టుదల ముందు నిలువలేక పోయాయన్నారు. ఫలానా తరగతి గదిలో ఫ్యాన్ లేదనీ, ఫలానా వసతి బాత్‌రూమ్ సరిగా లేదనీ, ఖచ్చితమైన లెక్కలతో కూడిన బుక్‌లెట్‌లోని సమస్యలను చూసి అధికారులు, మంత్రులు నివ్వెపోయేవారన్నారు. బుక్‌లెట్‌లో ఫలానా సమస్య ఫలానా వసతిగృహంలో ఉందని ఒక స్పష్టమైన అవగాహనతో సమస్యలు పొందుపర్చేదన్నారు. కొందరు అధికారులు మా బుక్‌లెట్‌లను హ్యాండ్ బుక్‌గా ఉపయోగించుకొని సమస్యలు పరిష్కారం చేసారన్నారు. ముమ్మాటికీ ఇది విద్యార్థుల సాధించిన విజయం అన్నారు.

పెంచిన చార్జీలు తక్షణం అమలు చేయాలి
పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

పెంచిన మెస్, కాస్మోటిక్స్ చార్జీలు రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని వీరభద్రం కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలన్నారు. లేదంటే రాష్ట్ర మంత్రుల ఇండ్ల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

4న హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా

- సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (ఎస్‌సీకేఎస్) పిలుపు



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా బెల్ట్ క్లీనింగ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.బ్రహ్మాచారి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా రుద్రంపూర్ ఆర్‌సీహెచ్‌పీలో కాంట్రాక్టు కార్మికులను ఉద్దేశించి బ్రహ్మాచారి మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులుగా బెల్ట్ క్లీనింగ్ మీద పనిచేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయకుండా సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కోల్ ఇండియాలో నిర్ణయించిన వేతనాలు అమలు చేయకుండా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్షతను పాటిస్తూ వేతనాలు పెంచకుండా స్కిల్ వేతనాలు ఇవ్వకుండా అన్ స్కిల్ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. సింగరేణి లాభాల బాటలో నడుస్తున్న నేటి సమయంలో సింగరేణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కూడా ఉన్నారనే విషయాన్ని సింగరేణి యాజమాన్యం, కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచినాక కాంట్రాక్టు కార్మికులకు వేతనం ఎందుకు పెంచలేదో సమాధానం చెప్పాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగాలంటే పోరాటాలు అనివార్యమని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించి సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఒక తాటిపై నిలిచి కనీస వేతనాలు అమలు కోసం పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం బ్రాంచ్ సహాయ కార్యదర్శి భూక్య రమేష్, నాయకులు భాస్కర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం యువకుల ప్రతిభ

- సాయి శ్రీవాత్సవ్‌కి మూడు, నాగచైతన్యకు రెండు పతకాలు



నవతెలంగాణ-కొత్తగూడెం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం యువకులు ప్రతిభ చాటారు. శనివారం హైదరాబాదులోని జియాన్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం యువకులు 5 పతకాలు సాధించారు. నవభారత్ పబ్లిక్ స్కూల్లో విద్యానభ్యసిస్తున్న కొట్టే సాయి శ్రీ వాత్సావ్ మూడు కాంస్య పథకాలు, బండారి నాగ చైతన్య రెండు కాంస్య పతకాలు సాధించారు. సాయిశ్రీ వాత్సవ్ 50 మీటర్స్ ఫ్రీ స్టయిల్, 50 మీటర్ బ్రెస్ట్ స్ట్రోక్, 200 మీటర్ బ్రెస్ట్ స్ట్రోక్‌లో పతకాలు సాధించగా, నాగచైతన్య 400 మీటర్స్ ఐఎం, 200 మీటర్స్ ఫ్రీ స్టైల్‌లో పతకాలు సాధించారు. నవభారత్ పబ్లిక్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వి రెడ్డి, స్విమ్మింగ్ కోచ్‌లు హనుమంత రాజు, సామ్యూల్, సంధ్య, సామంత్‌లు విద్యార్థులను అభినందించారు.

టీఏ, డీఏ వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-మణుగూరు

అంగన్వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు, మున్సిపాలిటీ సిబ్బంది ఎన్నికల విధుల్లో పనిచేసిన రెండు సంవత్సరాల టీఏ, డీఏలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. నెలలు గడుస్తున్నా వాళ్లకి రావలసిన బెనిఫిట్స్ నేటికీ అందలేదని అన్నారు. పలు సమస్యలపై స్థానిక తహసీల్దార్ రాఘవరెడ్డికి అంగన్వాడీ, వీఓఏ మున్సిపాలిటీ సిబ్బంది వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకురాలు శ్యామల, హేమలత, సుశీల, రమణ, యశోద, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని జర్నలిస్ట్ జంగిలి నవీన్ తెలంగాణ జనసమితి అధినేత ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను వారి నివాసంలో శనివారం కలిసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భద్రాచలం పట్టణంలో అంతర్భాగంగా ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపే అంశంపై వినతిపత్రం రూట్ మ్యాప్ అందించినట్టు తెలిపారు. అలాగే భద్రాచల పట్టణం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఎమ్మెల్సీ కోదండరాం స్పందిస్తూ ఇటీవల తాను భద్రాచలం పర్యటనకు వచ్చినప్పుడు ఐదు గ్రామ పంచాయతీల సమస్యతో పాటు దక్షిణ అయోధ్యగా ఉన్న భద్రాచలం సీతారాముల వారి ఆలయం అభివృద్ధి విషయం, అదే విధంగా పర్ణశాల వెళ్లాలంటే ఆంధ్రాలో కలిసిన తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో ఉన్న యటపాక, కన్నాయిగూడెం పంచాయతీలను దాటి పర్ణశాలకు వెళ్లాలంటే భక్తులు పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోయానని అన్నారు. తెలంగాణ జన సమితి తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.



సీఎం సహాయనిధి కొండంత అండ

- చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కోరం

నవతెలంగాణ-ఇల్లందు

అనారోగ్యంతో ప్రయివేట్ ఆసుపత్రిలో చేరి వేల ఖర్చు చేసుకొని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి కొండంత అండనిస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. క్యాంపు కార్యాలయంలో 44 మందికి రూ.13 లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, గ్యాస్ సిలిండర్ పథకం అందిస్తున్నాయని, అతి త్వరలో ఇందిరమ్మ ఇల్లులు కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ డివి, వైస్ చైర్మెన్ జానీ భాష, పట్టణ మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, సెక్రెటరీ జాఫర్, ఆర్.ఎం.కిరణ్, వైస్ ఎంపీపీ మండల రాము, ఎదలపల్లి అనసూయ మేడం, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమగ్రంగా కుటుంబ సర్వే నిర్వహించాలి

- తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్

నవతెలంగాణ-అశ్వారావుపేట

సర్వే ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ(ఇంటింటి) సర్వే నిర్వహించాలని తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌లు ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని మొత్తం 30 గ్రామ పంచాయితీల్లో కేటాయించిన విధులను సక్రమంగా పూర్తి చేయాలని చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఎన్యూమరేటర్‌లుగా ఎంపికైన ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. 4న స్థానిక రైతు వేదికలో ఈ సర్వేపై ఎన్యూమరేటర్‌లు శిక్షణ ఇవ్వటం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు కృష్ణ, పద్మావతి ఉన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | నవంబర్ 03, 2024 | www.navatelangana.com



చదువు జీవితాన్ని మార్చేస్తుంది : కిరణ్మయి

నవతెలంగాణ-కొణిజర్ల

కష్టపడి చదివితేనే విద్యార్థులు తమ జీవితాన్ని అవలీలగా మార్చుకోవచ్చునని పెద్దగోపతి పాఠశాల పూర్వ విద్యార్థి కేసా కిరణ్మయి అన్నారు. మండల పరిధిలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కేసా కిరణ్మయి ఆమె పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 201 మంది విద్యార్థులకు టీ షర్ట్స్, షార్ట్స్ స్పోర్ట్స్ యూనిఫాం ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు. వీటి విలువ సుమారు 65 వేల రూపాయలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదివి తాము అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని, నిరంతరం చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు కె మార్క్ మాట్లాడుతూ కిరణ్మయి పుట్టినరోజు సందర్భంగా మంచి ఆలోచన గతాన్ని మారిచిపోకుండా సుమారు 60వేల రూపాయలు విలువ చేసే స్పోర్ట్స్ యూనిఫామ్ అందించినందుకు పాఠశాల తరుపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కిరణ్మయి తండ్రి కేసా సుభాష్ చంద్రబోస్ పాఠశాలకు అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు కేసా కుటుంబ సభ్యులు ఎల్లవేళలా మంచి సామాజిక స్పృహతో అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని మరువలేనిదని వ్యాయమ ఉపాధ్యాయులు షేక్ రంజాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వడ్డే నారాయణ అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు శైలజ, గ్రామపెద్దలు సైదయ్య ఉపాధ్యాయులు ఎండి ఇస్మాయిల్, కేవిఎల్ నరసింహారావు, కటారు శ్రీనివాసరావు, సూరంపల్లి అంజనాదేవి, కే.రమేష్, కే. భాగ్యలక్ష్మి, ఎన్.శ్రీనివాసరావు, బొజ్జ మాధవి, చావ రాజేశ్వరి, వనమా శైలజ, లక్కినేని శ్రీలత, చింతల రాంబాబు, కే.లలిత, షేక్ మైబు పాల్గొన్నారు.

వికలాంగులకు 'వనమా సూరి' దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-మధిర

పట్టణంలో ఆజాద్ రోడ్‌లో ప్రముఖ సామజిక సేవకులు (మధిర ఆశ మిత్ర) లంకా కొండయ్య ఇంటి దగ్గర అంగవైకల్యం ఉన్న శారీరక వికలాంగులకు జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు వనమా సూరి దాతృత్వంతో నూతన దుప్పట్లు వికలాంగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకులు ఆదూరి మణి ఆనందం

నవతెలంగాణ-కొణిజర్ల

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బహుజన అభ్యుదయ సేవా సమితి అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదూరి మణి అధ్యక్షతన శనివారం విద్యార్థులకు టీచర్లకు మానవ హక్కులు- చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ పనులు మేము చేసుకుంటూ కొంత సమయాన్ని మానవ హక్కులను ప్రచారం చేయడానికి స్వచ్ఛందంగా పనిచేస్తూ, ఆశా కార్యకర్తలకు డ్వాక్రా మహిళలకు, విద్యార్థులకు, అంగన్వాడీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ సదస్సులో హ్యూమన్ రైట్స్ సొసైటీ, బహుజన అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం మాట్లాడుతూ వినియోగదారుల హక్కు చట్టం పోక్సో చట్టం, పోలీస్ చట్టం బాల్య వివాహాలు, మైనర్ డ్రైవింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యాహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాడ్ టచ్, గుడ్ టచ్ మొదలగు వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం హ్యూమన్ రైట్స్ సొసైటీ, రాష్ట్ర కన్వీనర్ కువ్వారపు విజయరావు, మండల అధ్యక్షులు కొమ్ము భద్రయ్య మండల కార్యదర్శి గొల్లమందల నాగేశ్వరావు, ఖమ్మం టౌన్ అధ్యక్షురాలు బొల్లెపోగు ప్రేమకుమారిలు పలు చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు యం. శాంత కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేపర్ బాయ్స్‌కి వెహికల్స్, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- సీనియర్ ఏజెంట్ చారి డిమాండ్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



నగరంలో వివిధ పత్రికలు సప్లై చేస్తున్న ఏజెంట్స్ అండ్ బాయ్స్ కష్టాలు ఆలోచించి జిల్లా మంత్రులు అధికారులు పేపర్ బాయ్స్ పేపర్ ఏజెంట్లు సమస్యలపై దృష్టి పెట్టాలని మా ఇబ్బందులు తీర్చాలని సీనియర్ ఏజెంట్ చారి డిమాండ్ చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటలకి లేస్తూ వర్షం, చలిని లెక్కచేయకుండా పత్రికలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. పేపర్ బాయ్స్ కుటుంబాలను మంత్రులు ఆదుకోవాలన్నారు. వారికి ఈ బైక్స్, పింఛన్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేపర్ బాయ్స్, పేపర్ ఏజెంట్లు, ఎస్కే ఇమామ్, నగేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోడ్లను సీసీ రోడ్డుతో జాయింట్ చేయండి

నవతెలంగాణ-కల్లూరు



పుణ్యపురం మేజర్ కెనాల్‌పైన సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. దానిలో భాగంగా శాంతినగర్ నుంచి కెనాల్‌కి ఉన్న సిసి రోడ్డుకు మూడు రోడ్ల జాయింట్లను కలపమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయిని శాంతినగర్ వాసులు కోరారు. దీంతో ఆమె వెంటనే పిఆర్ డిఈ రాంబాబుకు ఆదేశించారు. శనివారం డిఈ పరిశీలించి పెండింగ్ వర్క్ లేకుండా మూడు రోడ్ల జాయింట్లు కొత్త సీసీ రోడ్డుకి కలిపి వేయమని కాంట్రాక్టర్‌కు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈతో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, ఈఓ ఎన్.నాగేశ్వరరావు, శాంతి నగర్ కాలనీ నాయకులు కనకపూడి జయరాజు, ఖమ్మంపాటి వీరస్వామి, కిన్నెర నాగరాజు, పాల్గొన్నారు.

భద్రాచలం సమస్యలపై ప్రణాళికబద్ధంగా ముందుకు

- జనసమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకర్రావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం నియోజకవర్గంలో ఉన్న సమస్యల పరిష్కారానికి జన సమితి కృషి చేస్తుందని పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జి గోపగాని శంకర్రావు అన్నారు. శనివారం ఆయన తెలంగాణ తొలి, మలితరం ఉద్యమ నాయకుడు, విశ్రాంత ప్రిన్సిపల్ తిప్పనసిద్దులు గృహంలో జన సమితి క్రియాశీలక సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల టీజేఎస్ అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం భద్రాచలంలో పర్యటించి ప్రజల నుండి వినతులను స్వీకరించారని, వాటి పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి త్వరలోనేపరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, రవూఫ్, భద్రాచలం మండలం అధ్యక్షులు రేపాక రామారావు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే మట్టా రాగమయి

నవతెలంగాణ-తల్లాడ



మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రంపై రైతులకు, అవగాహన కల్పించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు చేపట్టామన్నారు. సన్న రకం వరి ధాన్యం క్వింటాకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు చైర్మెన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనంద్, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ తాజుద్దీన్, ఏఈఓలు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాఫీ కోసం నిరీక్షణ

- రైతు రుణ మాఫీ చేసింది.. జానెడు.. చేయాల్సింది.. బారెడు
- ఆధార్ కార్డు లింకు తప్పుల తడక..
- రేషన్ కార్డు లేదని.. ఆధార్ అడ్రస్ తప్పని..
- 1832 మంది రైతులకు గాను 591 మంది రైతులకే మాఫీ

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానమైనది రెండు లక్షల లోపు అప్పు వున్న రైతులందరికీ రుణ మాఫీ చేస్తానంది. ఈ ఎన్నికల హామీనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించిందని చెప్పుకోవచ్చు. రెండు లక్షల రూపాయల లోపు రుణం వున్న ప్రతి రైతుకు మొదట డిసెంబర్ 9వ తేదీనే మాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగస్టు 15లోగా రాష్ట్రంలోని రైతులందరికీ 2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని పలు సందర్భాల్లో దేవుళ్లపై ప్రమాణాలు చేసి సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికీ రాష్ట్రంలో చాలామంది అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదు. ఎంతోమంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా వారికి సరైన జవాబు చెప్పే వారెవరు లేరని రైతులు వాపోతున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు పదే పదే రుణమాఫీ దాదాపుగా పూర్తికావచ్చిందని చెబుతున్న రైతులు మాత్రం నాయకుల మాటలు బారెడు.. చేతలు జానెడు... అన్న చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీ తక్కువ శాతం రైతులకు మాత్రమే చేశారని చెప్పుకోవాలంటే ఒక్కసారి పాల్వంచ మండలంలోని కో-



ఆపరేటివ్ సొసైటీలో రుణమాఫీ జరిగిన తీరు చూస్తే అర్థమవుతుందని రైతులు చెబుతున్నారు. పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీలో మొత్తం 1832 మంది రైతులను రెండు లక్షల లోపు రుణమాఫీకి అర్హులను గుర్తించి సొసైటీ పాలకవర్గం, అధికారులు జాబితా తయారుచేసి ప్రభుత్వానికి పంపించగా, మొదటి విడతలో లక్ష రూపాయల లోపు ఉన్న రైతులకు 436 మందికి రుణమాఫీ జరిగిందని, రెండో విడతలో లక్షన్నర రూపాయల లోపు ఉన్న రైతులకు 94 మందికి రుణమాఫీ జరిగిందని, 3వ విడతలో రెండు లక్షల రూపాయల లోపు ఉన్న రైతులకు 61 మందికి రుణమాఫీ జరిగిందని, మొత్తం మూడు విడతల్లో కలిపి 1832 మంది రైతులకు గాను 591 మంది రైతులకు మాత్రమే ఇప్పటివరకు రుణమాఫీ జరిగింది. ఇంకా 1241 మంది రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారని చెప్పిన మాటలకు రుణమాఫీ చేసిన దానికి పొంతనే లేదని, కేవలం 32 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, 68 శాతం మంది రైతులకు నిరాశే మిగిలిందని సొసైటీ పాలకవర్గంలోని కొంతమంది కాంగ్రెస్ ప్రభుత్వంపై బాహటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మిగిలిన 1241 మంది రైతులకు ఎందుకు రుణమాఫీ కాలేదో, తర్వాత అవుతుందో లేదో అనే కనీస సమాచారం కూడా సొసైటీ కార్యాలయంలోని అధికారులు ఇవ్వటం లేదు.

తెల్ల చొక్కాలు వేసుకున్న వారికే గుర్తింపు

బయట మాటలు చెప్పడానికి మాత్రం రైతే రాజు అని గొప్పలు చెబుతున్న నాయకులు రైతులకు కనీసం సొసైటీ కార్యాలయంలో కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవని, తెల్ల చొక్కాలు వేసుకొని వచ్చే వారిని మాత్రం గంటలు గంటలు కూర్చోబెట్టి మాట్లాడుకుంటూ, పొలాల్లో వ్యవసాయం చేసుకుంటూ సాదాసీదాగా వచ్చే రైతులను ఏ బ్యాంకు లోనైనా, ఏ ఆఫీసులోనైనా కనీస జవాబు చెప్పకుండా విసుకుంటున్నారని రైతులు బాధను వెళ్లగకుతున్నారు. అసలు 1241 మంది రైతులకు ఎందుకు రుణమాఫీ కాలేదని నవతెలంగాణ పరిశీలన చేయగా రేషన్ కార్డులు లేవని కొంతమందికి, ఆధార్ కార్డులు అడ్రస్సులు తప్పుగా పడ్డాయని, సొసైటీ నుండి పంపిన జాబితాలోనే తప్పులు దొర్లాయని, దీనివల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని కొంతమంది రైతులు అన్నారు. ఒక్కో ఆధార్ కార్డుకు రెండు మూడు లోన్ నంబర్లు లింకు చేయడం వల్ల కొంతమంది రైతులకు 50 వేల రూపాయలు అప్పు ఉన్నా కూడా అధికారులు చేసిన తప్పుకు రుణమాఫీ కాలేదని మొరపెట్టుకున్నారు. మండల పరిధిలోని కో-ఆపరేటివ్ సొసైటీలో ఒక్కదానిలోనే 1241 మందికి రుణమాఫీ కాలేదంటే ఇంకా పాల్వంచ పరిధిలోని అనేక బ్యాంకుల్లో రుణాలు ఉన్న రైతులు ఎంతోమంది మాఫీ కాకుండా బాధపడుతున్నారు. ఇది ఇలా ఉంటే రుణమాఫీ అయిన రైతులకు వెంటనే రుణాలు అందించాలని మంత్రులు పదేపదే చెబుతున్న, ఇప్పటివరకు కొత్తగా రుణాలు కొద్ది మంది రైతులకు మాత్రమే ఇచ్చారు. రుణాలు ఇవ్వడానికి రైతులను బ్యాంకులు తమ చుట్టూ తిప్పించుకుంటున్నారు. పట్టా పాస్ పుస్తకాలు లేని రైతులకు రుణమాఫీ చేయడం లేదని, దీనివల్ల వందల మంది రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సొసైటీ పాలకవర్గం,ప్రజాప్రతినిధులు, స్పందించి రైతులకు న్యాయం చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీ చేసే వరకూ పోరాటాలు నిర్వహిస్తాం :

కాంపల్లి కనకేష్ పటేల్, పాల్వంచ కో-ఆపరేటివ్ ఉపాధ్యక్షులు



2 లక్షల రూపాయల లోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులందరికీ ఇంతవరకు పూర్తిగా మాఫీ చేయలేదు. ఒక్క పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీలోనే 1832 మంది రైతులు ఉంటే 591 మందికి మాత్రమే రుణమాఫీ చేశారు. 1241 మంది రైతులకు ఇంతవరకు మాఫీ కాలేదు. కనీసం వారందరికీ మాఫీ అవుతుందో లేదో కూడా చెప్పకుండా రైతులను తీవ్ర ఇబ్బందుల పాలుజేస్తున్నారు. రైతులందరికీ రుణమాఫీ చేసే వరకు పోరాటాలు నిర్వహిస్తాం.

నిత్యం ప్రజా ఉద్యమాలలో ఉంటూ...

- పదేళ్లపాటు సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా.... ఉద్యమాలకు నాయకత్వం వహించిన 'దొండపాటి'
- తొలిసారి మండల కార్యదర్శిగా 2014లో ఎన్నిక..

నవతెలంగాణ - బోనకల్



సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా 10 ఏళ్ల పాటు తన సేవలను అందించాడు. ఈ పదివేల కాలంలో అనేక ప్రజా ఉద్యమాలకు ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసుకున్నాడు. ఎస్ఎఫ్ఐ నుంచి తన ఉద్యమ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ తర్వాత అంచలంచెలుగా ఎదుగుతూ సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా మూడు దఫాలుగా ఎన్నికవుతూ 10 ఏళ్ల పాటు మండల కార్యదర్శిగా పనిచేసిన రావినూతల గ్రామానికి చెందిన దొండపాటి నాగేశ్వరరావు అనేక ఉద్యమాలకు రూపకల్పనలో ప్రజా సంస్థల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు. మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన దొండపాటి నాగేశ్వరరావు విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐలో కీలకపాత్ర నిర్వహించాడు. ఆ తర్వాత డీవైఎఫ్ఐ డివిజన్, జిల్లా స్థాయిలో వివిధ హొదాలలో పనిచేశాడు. అనంతరం 28 అక్టోబర్ 2014లో బోనకల్ శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ నందు జరిగిన 6వ సిపిఎం మండల మహాసభలో తొలిసారిగా దొండపాటి నాగేశ్వరరావు మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 17 అక్టోబర్ 2017 న చొప్పకట్లపాలెంలో జరిగిన 7వ మండల మహాసభలో తిరిగి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 20 అక్టోబర్ 2021 లో నారాయణపురంలో జరిగిన 8వ మండల మహాసభలో తిరిగి మూడోసారి ఏకగ్రీవంగా దొండపాటి నాగేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పదేళ్లపాటు మండల కార్యదర్శిగా పనిచేశారు. ఈ పదేళ్ల కాలంలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి, ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో విశేషమైన కృషి చేశాడు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించి పరిష్కారంలో, ప్రజా ఉద్యమాలు నిర్వహించడంలో విశేషమైన పాత్ర నిర్వహించారు. జిల్లాలోని బోనకల్ మండలం కమ్యూనిస్టులకు కంచుకోట. సిపిఎంకు ఒక బలమైన మండలంగా ఉంది. మండలంలో జరిగిన ప్రతి ఎన్నికలలో దొండపాటి నాగేశ్వరరావు విజయవంతమైన పాత్ర నిర్వహించారు. ప్రజాసేవకు అంకితమైన దొండపాటి 10 సంవత్సరాలు పాటు మండల కార్యదర్శిగా, పూర్తి కాలం కార్యకర్తగా పనిచేశాడు. ఈ పదేళ్లపాటు అలవెన్స్ తీసుకోకుండానే పూర్తి కాలం కార్యకర్తగా పనిచేశాడు. ఈ కాలంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొందాడు. పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో కృషి చేశాడు. రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యపై సాగిన అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సిపిఎం ఆల్ ఇండియా మహాసభల నిబంధన మేరకు మూడుసార్లు మాత్రమే కార్యదర్శిగా ఎన్నికకు అవకాశం ఉంది. ఆ నిబంధనల ప్రకారం మూడుసార్లు ఎన్నికవుతూ వచ్చాడు. 9వ మండల మహాసభ మోటమర్రి గ్రామంలో శనివారం జరిగింది. ఈ మహాసభలో నాగేశ్వరరావు స్థానంలో నూతన కార్యదర్శి గా చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన కిలారి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. తనకు పార్టీ అప్పగించిన బాధ్యతలను పదేళ్లపాటు సక్రమంగానే నిర్వహించాననే సంతృప్తి తనకు ఉందని దొండపాటి తెలిపారు. భవిష్యత్తులో పార్టీ అప్పగించే బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించేందుకు తన ప్రయత్నం చేస్తానని తెలిపారు. మండల కార్యదర్శిగా ఈ పదేళ్ల పాటు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

నేడు మార్కెట్ యార్డ్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

- రానున్న మంత్రులు

పొంగులేటి, తుమ్మల, ఎంపీలు

నవతెలంగాణ-ఇల్లందు

ఆదివారం సాయంత్రం 4, గంటలకు ఇల్లందు మార్కెట్ యార్డ్ పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక మార్కెట్ యార్డ్ నందు జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మరియు స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్య, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ తదితరులు హాజరవుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు గోల్‌మాల్ !!

- ఒకటే నెంబర్‌తో రెండు చెక్కులు సాధ్యమేనా.!!!

నవతెలంగాణ- దమ్మపేట

లబ్ధిదారుడికి ఇచ్చిన సిఎంఆర్ఎఫ్ చెక్కును బాధితుడు తన బ్యాంకు ఖాతాలో వేయకముందే ఇంకొకరి ఖాతాలో ఆ చెక్కు క్రెడిట్ అయిన ఘటన విస్మయానికి గురిచేస్తుంది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. దమ్మపేటకు చెందిన ఓ వ్యక్తికి (పందేటి సత్యనారాయణమూర్తి)కి ఇటీవల సర్జరీ కాగా అందు నిమిత్తం ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. తత్ఫలితంగా అతడికి రూ.42 వేల రూపాయల చెక్కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సెప్టెంబర్ నెల 20వ తేదీన మంజూరు కాగా ఆ చెక్కును స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అనుచరులు లబ్దిదారుడికి ఈనెల 25న అందజేశారు. ఈ చెక్కును దమ్మపేట ఎస్‌బిఐ బ్యాంకు నందు తన ఖాతాలో జమ చేయగా, మూడు రోజుల తర్వాత ఆ చెక్కు రిజెక్ట్ కాబడినట్టు అతడికి మెసేజ్ వచ్చింది. ఈ విషయంపై బ్యాంకు సిబ్బందిని సంప్రదించగా



735985 నెంబర్ గల ఎస్‌బిఐ బ్రాంచ్ హైదరాబాద్ చెక్కు, విచిత్రంగా అక్టోబర్ 4వ తేదీన వేరొకరి ఖాతాలో క్రెడిట్ అయిన కారణంగా ఈ చెక్కును రిజెక్ట్ చేస్తున్నట్టు తెలిపారు. కానీ ఆ చెక్కు ఎవరి ఖాతాలో క్రెడిట్ అయిందని వివరాలు తమకు తెలియదని చెప్పారు. ఒకే నెంబర్ గల చెక్కు ఇద్దరు వ్యక్తులకు ఎలా వచ్చిందనేది చాలా ప్రశ్నార్ధకంగా మారింది. ఈ విషయంపై బ్యాంకు సిబ్బంది తమకు ఏమీ తెలియదని, చెక్ ఇచ్చిన ఎమ్మెల్యేని సంప్రదించాలని తెలియజేశారు.

వర్షంతో రైతన్న ఆందోళన

- ఆరబోసిన ధాన్యం తడకుండా చేసేందుకు కష్టాలు

నవతెలంగాణ-కల్లూరు

ఆరుగాలం కష్టపడి పంట కోసి ఆరబోసిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లూరు మండలంలో శనివారం రాత్రి 7 గంటల నుండి 8:00 వరకు వర్షం పడింది. కల్లూరు, చంద్రుపట్ల, లింగాల, ఎర్రబోయినపల్లి, యజ్ఞ నారాయణపురం, వాత్యా నాయక్ తండా, పుల్లయ్య బంజర, లోకారం, బత్తులపల్లి, కప్పల బంధం, ఈ గ్రామాల్లో ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా ధాన్యం ఆరబోసి ఉన్నాయి, ప్రైవేట్ మార్కెట్లో వాతావరణం చూసి దళారీలు రోజురోజుకీ ధర తగ్గిస్తూ అందిన కాడికి దండుకోవాలని చూస్తున్నారు. పచ్చిధాన్యం ప్రారంభంలో 1800 ఉండగా ప్రస్తుతం సాంబ మసూరి 1400 లకు 77 కేజీల బస్తా



తీసుకుంటున్నారు. దీంతో రైతులు చాలా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. కొనుగోలు కేంద్రాలు తెరిచారు కానీ ఇంకా కాటాలు మొదలు కాలేదు. కొంతమంది రైతులు పచ్చ ధాన్యం అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రంలో కింటా 2360 రూపాయలు మద్దతు ధర పలుకుతోంది. అయినా వాతావరణ మార్పుతో పచ్చి ధాన్యం అమ్ముకోడానికే రైతులు మొగ్గు చూపుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-వేంసూరు

అప్పుల బాధతో కౌలు రైతు పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చౌడవరంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లి బోయిన గురునాథం (30) వ్యవసాయ పెట్టుబడులకు అప్పులు చేసి ఆర్థిక బాధలతో గురువారం పురుగుల మందు సేవించాడు కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూనే శనివారం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు వేంసూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వమే పంటలను కొనుగోలు చేయాలి

ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కేలోత్ లక్ష్మణ్, గుగులోత్ తేజ నాయక్

నవతెలంగాణ-కామేపల్లి

రైతు పండించిన పంటలన్నింటిని స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం సీసీఐ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేలోత్ లక్ష్మణ్, ఖమ్మం డివిజన్ అధ్యక్షులు గుగులోతు తేజ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కమిటీలో భాగంగా రైతు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వడ్డే వెంకటేశ్వర్లు, బిక్కసాని భాస్కర్, మాస్‌లైన్ సంయుక్త మండలాల కార్యదర్శులు గుమ్మడి సందీప్, ఎన్‌వి రాకేష్, ప్రగతిశీల రైతు సంఘం మండల అధ్యక్షుడు అజ్మీర కిషన్ నాయకులు ధరావత్ సక్రు అజ్మీర సక్రాం పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాల కోసం విప్లవకారులు ఐక్యంగా ముందుకు సాగాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

అమరవీరుల ఆశయాల కోసం విప్లవకార్లు ఐక్యంగా ముందుకు సాగి ప్రజల సమస్యలు పరిష్కారం చేయాలని పోరాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కే ఉమర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గుర్రాయి గూడెం, బెండలపాడు, ఎర్రబోడు, బాల్య తండా, వెంకటయ్య తండా, వంకా నెంబర్, కరిసల బోడు, పులిగుండం తదితర గ్రామాలలో న్యూ డెమోక్రసీ అమరవీరులసభలు నిర్వహించారు. ఈ సభలలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కే ఉమర్ మాట్లాడుతూ జాతీయ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సభలు నిర్వహిస్తున్నామని భూమి కోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం ఎందరో విప్లవకారులు గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమంలో అసువులుబాసారు. వారిలో చంద్ర పుల్లారెడ్డి, పొట్ల రామ నరసయ్య ,నీలం రామచంద్రయ్య, చార్ మతోందర్ ,కొల్లా ఎంకయ్య, ప్రతిఘటన ఉద్యమ నాయకులు ఎల్లన్న పూనమ్, లింగన్న కాచినపల్లి,అమరవీరులు ఎందరో ప్రతిఘటన ఉద్యమ నాయకులు వారి ప్రాణాలను ప్రజల పక్షాన పోరాడి బలిదానాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరికూటి వెంకట్రావు, సత్యనారాయణ, ధారావత్ బాలు, రాంబాబు, వస్త్రం, టి బీముడు, రవ్వ వెంకట్రావు, రమేష్, భద్రమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా జమలాపురం దేవాలయం

అర్బన్ పార్క్ నిర్మాణానికి స్థలం పరిశీలన : డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమసింగ్

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు గ్రామంలో టూరిజం డెవలప్మెంట్, అర్బన్ పార్క్‌కు అటవి భూములను డీఎఫ్ఓ సిద్ధార్ద్ విక్రమ్ సింగ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రెవెన్యూ భూములు అటవీ భూములలో కలిసి ఉన్నాయని వాటిని సర్వే నిర్వహించి విడగొట్టి అటవీ భూములకు సరిహద్దులు నిర్ణయిస్తామన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు మేరకు అటవీశాఖ ఆధ్వర్యంలో సుమారు 5 కోట్ల రూపాయలతో జమలాపురం గ్రామంలో పర్యాటక ప్రాంతం అభివృద్ధికి రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటక అభివృద్ధితో ఈ ప్రాంతం రూపురేఖలు మారతాయని, ఉద్యోగ, వ్యాపార ఉపాధి పెరుగుతుందని తెలిపారు. జమలాపురం గ్రామ సరిహద్దులు, ప్రజల నాగరికత, పర్యాటక అభివృద్ధి ఆవశ్యకత, ఆలయ చరిత్ర తదితర అంశాలను ఎర్రుపాలెం సొసైటీ చైర్మెన్ మూల్పూరి శ్రీనివాసరావు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డివో మంజుల, ఎఫ్ఆర్వో శ్రీనివాసరెడ్డి, భీమవరం సెక్షన్ సురేష్, బుచ్చి రెడ్డిపాలెం బీట్ నాగేశ్వరరావు, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెల్డింగ్ చేస్తూ వ్యక్తి మృతి

నవ తెలంగాణ-ఖమ్మం రూరల్

వెల్డింగ్ పనిచేస్తూ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం సోములగూడెం గ్రామానికి చెందిన కామిశెట్టి జగదీశ్ (30) నాలుగేళ్లుగా పెద్దతండా పంచాయతీ సాయి ప్రభాత్ నగర్ లోని ఓ వెల్డింగ్ షాపులో వెల్డింగ్ పనిచేస్తున్నాడు. శుక్రవారం పెద్దతండాలోని ఓ నూతన భవనంలో షట్టర్ వెల్డింగ్ పనికి వెళ్లాడు. సాయంత్రం వెల్డింగ్ షాపు యజమాని జగదీశ్ భార్య జ్యోతికి ఫోన్ చేసి జగదీష్ కు గుండెపోటు వచ్చిందని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వివరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.తన కుమారుడు మృతిపై,వెల్డింగ్ షాపు యజమానిపై తమకు అనుమానాలు ఉన్నాయని మృతుని తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.



మూసీ ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన నీరందిస్తాం

- తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

మూసీ నదిని ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందిస్తామని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని చెప్పారు. 15వేల కుటుంబాలు మూసీ నది పక్కన జీవిస్తున్నాయని, వారికి ఎటువంటి ఇబ్బందీ కలగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ కేటాయించినట్లు తెలిపారు. 1950లో మూసీనదిని మంచి నీటిగా వాడేవారని, తర్వాత క్రమేపీ కాలుష్య కాసారంగా మారిందని అన్నారు. ఇండస్ట్రియల్ వ్యర్థాలు మూసీలో కలవడం వల్ల నది నీరు ఉపయోగించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రతిపక్ష నాయకులు హరీశ్‌రావు, కేటీఆర్ ఎన్ని కుట్రలు చేసినా మూసీని ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రబ్బర్ చెప్పులు వేసుకొని తిరిగిన బీఆర్ఎస్ నాయకులు కొందరు కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ అని పెట్టి కొన్ని వందల కోట్ల ప్రజాధనాన్ని వథా చేసిందన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతూ ముందుకెళుతుందని చెప్పారు. దీనిని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు షఫీ ఉల్లా, వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్, గట్టు శ్రీనివాస్, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, ఫారుక్, పిల్లల రమేష్ నాయుడు, వల్దాస్ దేవేందర్, యాట ఉపేందర్, ధర్మ నాయక్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్, ముజీబ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ప్రతి సమస్యనూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు, ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఏఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. టీఎన్జీవో పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని 38 మందితో శనివారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎస్ అశోక్, పరిశీలకులుగా కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గం తప్పకుండా ఉద్యోగుల ఆకాంక్షల మేరకు పనిచేయాలని కోరారు. భవిష్యత్‌లో ప్రభుత్వంతో చర్చలు జరిపి అన్ని సమస్యలకూ పరిష్కారం చూపిస్తామనీ, ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. గ్రామ స్థాయిలో ఎదుర్కొంటున్న అన్ని సమస్యలూ తమకు తెలుసనీ, పంచాయతీ కార్యదర్శులు వృత్తి బాధ్యతలో తలమునకలు అవుతున్నారని వివరించారు. వారు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామనీ, పంచాయతీలను జనాభా ప్రాతిపదికన ఒకటి, రెండు, మూడు, నాలుగు గ్రేడ్‌లుగా విభజించి పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలనీ, పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. టీఎన్జీవో పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర నూతన అధ్యక్షులు ఎస్ బలరాం, కార్యదర్శి పి వెంకట రమణతోపాటు టీఎన్జీవో నగర శాఖ అధ్యక్షులు శ్రీకాంత్, నాగర్‌కర్నూల్ అధ్యక్షులు భవాండ్ల వెంకటేశ్, మహబూబ్‌నగర్ అధ్యక్షులు రాజీవ్, ములుగు అధ్యక్షులు పోలు రాజు, నాయకులు కొండల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజ్‌కుమార్, కురది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యంతో ప్రమాదం

- బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్
- ఒకే కుటుంబంలో నలుగురు మృతి

నవతెలంగాణ-మనోహరాబాద్



కల్లాలు లేక.. పొలాల్లో వసతులు లేకపోవడంతో రోడ్లపై రైతులు ఆరబోస్తున్న ధాన్యం ప్రమాదాలకు కారణమవుతోంది. ఒకవైపు మొత్తం ధాన్యం ఆరబోస్తుండగా.. ఇంకోవైపు నుంచే వాహనాల రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ కారణంగా ఇరుకు రోడ్లపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందువల్లే తాజాగా శనివారం మెదక్ జిల్లాలో బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణం కోల్పోయారు. రోడ్డుపై ఒక వైపు ధాన్యం ఆరబోయడంతో.. ఇంకోవైపు ఇరుకుగా ఉన్న రోడ్డుపై చీకట్లో వేగంగా వచ్చిన ట్రాక్టర్ నలుగురు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన మన్నె అంజనేయులు(45)తోపాటు నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. తమ్ముడు మన్నె కుమార్‌కు సిద్దిపేట జిల్లా మజీద్‌పల్లికి చెందిన లావణ్య(28)తో వివాహమైంది. వారికి ముగ్గురు కుమార్తెలు. లావణ్య పోతారం గ్రామ శివారులో ఉన్న సీడ్ కంపెనీలో ఉద్యోగం చేసేది. శనివారం తన తల్లిగారింట్లో పూజా కార్యక్రమానికి వెళ్లడానికి కంపెనీలో అనుమతి తీసుకుని ఇంటికి వచ్చింది. సాయంత్రం లావణ్య, ఇద్దరు పిల్లలు శాన్విక(7), సహస్ర(6)ను శబాష్‌పల్లి వద్ద వదిలేందుకు మన్నె అంజనేయులు బైక్‌పై తీసుకెళ్లాడు. గ్రామ శివారులో రోడ్డుపై రైతులు వరి ధాన్యం ఆరోబోశారు. ఒకే వైపు నుంచి వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. దాంతో బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో లావణ్య, అంజనేయులు, ఇద్దరు పిల్లలు అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనా స్థలం మొత్తం రక్తసిక్తమైంది. అప్పటి వరకు గ్రామంలో ఉన్న వారు కొద్దిసేపట్లోనే విగతజీవులుగా మారడంతో స్థానికంగా తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలంలో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. తూప్రాన్ సీఐ రంగాకృష్ణ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపై వరిధాన్యం ఆరబెట్టడమే కారణం

రైతులు పండించిన పంటలను ఆరబెట్టుకోవడానికి అనేక తంటాలు పడుతుంటారు. కల్లాలు లేకపోవడం వల్ల రోడ్లపై పోస్తున్నారు. అదే వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్పించుకుని రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించి వారికి సరైన స్థలాలను చూపించాలని పలువురు కోరుతున్నారు.

విషం చిమ్ముతోంది...!

- ప్రాణాంతకంగా 'చిత్తనూరు ఇథనాల్ కంపెనీ' • కాలుష్యంతోనే ప్రజల జీవనం • తలుపులు మూసుకున్నా గుప్పుమంటున్న వాసన
- మమ్మల్ని ఆదుకోండంటున్న చుట్టుపక్కల ప్రజానీకం • ఫ్యాక్టరీ లోపలికి వెళ్లనీయకుండా గట్టి నిఘా
- చూడటానికి వచ్చిన నిర్మల్ ప్రజలను తరిమిన పోలీసులు • యాజమాన్యానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఉన్నతాధికారుల మద్దతు
- ఎన్నికలకు ముందు రైతులకు కాంగ్రెస్ మద్దతు.. ఇప్పుడు షరా మామూలే.. • రాష్ట్రంలో మిగతాచోట్ల ఆందోళనలకు సన్నద్ధం



నవతెలంగాణ - మహబూబ్‌నగర్
ప్రాంతీయప్రతినిధి/విలేకరులు

పండ్ల తోటలు, పామాయిల్‌తో పాటు ఆధునిక వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు వచ్చేలా సాగు చేస్తామంటూ ఇథనాల్ కంపెనీ యాజమాన్యం నమ్మబలికింది. మిల్లులు పెట్టి పంటలను కొనుగోలు చేస్తామని కంపెనీ నిర్వాహకులు హామీ ఇచ్చారు. బడుగు జీవుల నుంచి భూములను కారుచౌకగా తీసుకున్నారు.. కొన్ని రోజులు నీలగిరి తోటలు పెంచారు.. రైతులతో మమేకం అయ్యారు. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా కాలుష్యం, విషపు వాయువు వెదజల్లే ఇథనాల్ కంపెనీని చిత్తనూర్ వద్ద పెట్టారు.. ఇప్పుడు ఆ ప్రాంతం కాలుష్యం, దుర్వాసనతో ప్రాణాంతకంగా మారింది. పరిసర ప్రాంతాలే కాకుండా.. చిత్తనూరు నుంచి వచ్చే మన్నెవాగులో కంపెనీ వ్యర్థాలు కలుస్తున్నాయి. అక్కడి నుంచి రామన్‌పాడు ద్వారా కృష్ణానదిలోకి చేరడం వల్ల ఆ నీరంతా కలుషితం అవుతోంది. దుర్గంధం, కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దగ్గు, దమ్ము, చర్మ వ్యాధులతో ఆస్పత్రిలో చేరుతున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. కంపెనీకి వ్యతిరేకంగా గతంలో చేపట్టినట్టే మళ్లీ ఐక్యంగా ఉద్యమం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే, ఫ్యాక్టరీ దరిదాపులకు ఎవరినీ రానీయకుండా యాజమాన్యం భారీగా సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుంది. నిఘా నేత్రంలో కంపెనీ దగ్గర చీమ చిటుక్కుమన్నా పోలీసులు వస్తున్నారు. వారం రోజుల కిందట కంపెనీని చూడటానికి వచ్చిన నిర్మల్ జిల్లా ప్రజలను అడ్డుకున్నారు.

నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని చిత్తనూర్ పరిధిలో జూరాల ఆర్గానిక్ ఇథనాల్ కంపెనీని 2020లో ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పలుచోట్ల ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోనూ ఏర్పాటు చేయనున్నారు.

దీనికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. చిత్తనూర్‌లో 460 ఎకరాల సాగు భూములను తక్కువ ధరకు కొనుగోలు చేశారు. ఇక్కడ పండ్ల తోటలు, పామాయిల్‌తో పాటు ఆధునిక వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు వచ్చేలా పంటలను సాగు చేస్తామని నమ్మబలికారు. కొన్ని రోజులు నీలగిరి తోటలు పెంచిన తరువాత జూరాల ఆర్గానిక్ పేరుతో కంపెనీ ప్రారంభమైంది. ఇక్కడ 2.50 కేజీల బియ్యం.. 4 లీటర్ల నీటితో ఒక లీటరు ఇథనాల్ లిక్విడ్ తయారు చేస్తారు. 20 శాతం ఇథనాల్‌ను ఒక లీటరు పెట్రోల్ తయారీకి ఉపయోగిస్తారు. రోజుకు 60 లక్షల లీటర్ల నీరు ఉపయోగిస్తారు. 13 వేల టన్నుల వ్యర్థాలు బయటకు వస్తాయి. కంపెనీకి రామన్‌పాడు రిజర్వాయరు నుంచి టీఎంసీ నీటిని తరలిస్తున్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగావకాశాలు, పండిన పంటకు గిట్టుబాటు ధర, ఇతర అనేక ఉపయోగాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

ఎలాంటి హానీ ఉండదని, కాలుష్యం ఉండదని చెబుతున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని, భూములకు మంచి రేటు ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని యాజమాన్యం అంటోంది. 2025 ఏప్రిల్ నుంచి ఇథనాల్‌ను పెట్రోల్‌కు ఉపయోగించడం వల్ల వాము కాలుష్యం ఉండదని చెబుతోంది.

వాస్తవ పరిస్థితులు వేరు..

అయితే, యాజమాన్యం చెప్పినట్టు అలాంటి పరిస్థితులు లేవు. కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాలు చిత్తనూరు గ్రామం గుండాపోయే మన్నెవాగులో కలుస్తున్నాయి. ఈ వాగులో స్నానం చేసిన చిన్నారులకు శరీరం మొత్తం బొబ్బలు వచ్చాయి. కాళ్లు, చేతులు తిమ్మిర్లు వచ్చి ఆస్పత్రులపాలయ్యారు. వ్యర్థాలను ధ్వంసం చేయకుండా వాగులోకి, పంట పొలాల్లోకి వదులుతున్నారు.

కంపెనీ నుంచి వచ్చే కాలుష్యం వల్ల నర్వ, సీసీకుంట, మరికల్, ఆత్మకూరు, అమరచింత, ధన్వాడ వంటి మండలాల పరిధిలో 110 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చివరికి కంపెనీకి వ్యతిరేకంగా ఏడాదిపాటు ఉద్యమించినా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు కనికరించలేదని గ్రామస్తులు 'నవతెలంగాణ'తో ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాన్ని 'నవతెలంగాణ' సందర్శించినప్పుడు గతంలో ఉన్న పరిస్థితులే ఇప్పటికీ ఉన్నాయి. ఉద్యమాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందారు. ఇక్కడ ఫ్యాక్టరీ.. ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉందని, తమ సమస్యను ఏ ఒక్కరూ వినడం లేదంటున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చినా, ఇప్పుడు తమవైపే చూడటం లేదని వాపోయారు.

ఉద్యమంలోకి ఇతర ప్రాంతాల ప్రజలు

నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో ఇలాంటి కంపెనీని ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి స్థానికులు అభ్యంతరం చెబుతున్నారు. దాంతో అక్కడి నుంచి రెండు బస్సుల్లో చిత్తనూరు జూరాల ఆగ్రో కంపెనీని చూడటానికి వచ్చారు. కంపెనీ ఏర్పాటయితే కలిగే అనర్థాలను చూడటానికి వస్తే పోలీసులు అడ్డుకొని బస్సుల నుంచి దిగకుండా తిరిగి హైదరాబాద్ తరలించారు. ఇదే సమయంలో చిత్తనూరు ఇథనాల్ కంపెనీని నిలిపేయాలని స్థానిక ప్రజలు ఉద్యమానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతున్నారు. గద్వాల్ జిల్లా రాజోలి మండలం పెద్ద దన్వాడలో నిర్మించతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీని నాలుగైదు గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఫ్యాక్టరీ పనులను అడ్డుకున్నారు. తహసీల్దార్, ఎస్ఐలను కలుసుకుని వినతిపత్రం ఇచ్చారు.

తలుపులు మూసుకున్నా దూసుకొస్తోంది

రాత్రి పూట విషపు గాలులతో ఇంట్లో ఉండలేక పోతున్నాం. తలుపులు మూసుకున్నా వాసన దూసుకొస్తోంది. అన్నం, నీళ్లు సైతం విషం అవుతున్నాయి. కంపెనీని తొలగించండి.. మమ్ములను ఇక్కడి నుంచి ఖాళీ అన్నా చేయండి.

ఆశప్ప, ఎక్లాపూర్, మరికల్ గ్రామం

పోలీసులు యజమానుల్లా వ్యవహరిస్తున్నారు

ప్రజల ప్రాణాలను హరించే ఇథనాల్ కంపెనీకి యజమానులుగా పోలీసులు వ్యవహరి స్తున్నారు. మేము అధికారులను సైతం కలువలేకపోతున్నాం. గాలి ఎక్కడికి వీస్తే.. వాసన అక్కడికి వెళ్తోంది. ఆ వాసనకు ఉండలేకపోతున్నాం.

ఉస్మాన్, ఎక్లాస్‌పూర్ గ్రామం మరికల్

మా దృష్టికి రాలేదు

నేను తహసీల్దార్‌గా వచ్చి రెండు నెలలైంది. నా దగ్గరకు కంపెనీ కాలుష్యంపై ఎటువంటి ఫిర్యాదూ రాలేదు. ఫిర్యాదులు వస్తే పరిశీలిస్తాను. ప్రజలకు ఎటువంటి హాని జరిగినా చర్యలు తీసుకోవడానికి అభ్యంతరం లేదు.

మరికల్ తహసీల్దార్ జమీల్

బాలల్లో మార్పుకోసం ఉద్యమం

- పిల్లల్లో నైతికత పెంచాలి
- టీవీ, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయే దుస్థితి పెరిగింది
- తల్లిదండ్రుల బిజీ జీవితమే ఇందుకు కారణం : విశ్రాంత ఐఏఎస్ కెవీ రమణా చారి, గీత రచయిత సుద్దాల
- బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ బాలోత్సవాలను ఈ నెల22,23 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలంగాణ బాలోత్సవ ప్రధాన కార్యదర్శి ఎన్ సోమయ్య తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, జాతీయ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, భారత్ విద్యాసంస్థల చైర్మెన్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఆహ్వాన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు, ఆహ్వాన సంఘం కోశాధికారి జి బుచ్చిరెడ్డి, ఎస్వీకే కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్, తెలంగాణ బాలోత్సవ ఉపాధ్యక్షురాలు కె సుజావతి, కవి, రచయిత రూపారుక్మిణి, నృత్యగురువు ఇందిరాపరాశరం, నాటకగురువు కె శాంతారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ " సమాజం అత్యంత వేగంగా ముందుకు పోతున్నది. ఈ సమయంలో బాలల మస్తిష్కంలో నాటుకుపోతున్న భావాలేంటి?. అవి సమాజ అభివృద్ధికి దోహదపడ్తాయా? లేదా? చివరికి వారి జీవితాలైనా ఆనందమయంగా ఉంటాయా? లేదా?" అనే విషయాన్ని ఆలోచిస్తే..ఆందోళనగా ఉందన్నారు. తమ జీవన విధానంలో భాగంగా తల్లిదండ్రులు బిజీగా ఉంటున్నారని చెప్పారు. దీంతో పిల్లలను తగిన విధంగా పట్టించుకోవటం లేదనీ, వారి ఆలనా పాలన అనేది ఆయాలు, క్రచ్‌లు తదితర పిల్లల సంరక్షణా కేంద్రాలకు వదిలేస్తున్నారని చెప్పారు. ఇది ఒక కొత్త ట్రెండ్‌గా మారుతుందన్నారు. ఇలాంటి సమయంలో బాలోత్సవం నిర్వాహకులు చేసే కృషి చాలా పవిత్రమైందని అభినందిం చారు. మేము బాగుంటే సరిపోదు..అందరూ బాగుండా లనే లక్ష్యంతో ఈ ఉత్సవాలను నిర్వహించటం ప్రస్తుత తరుణంలో ఎంతో అవసరమన్నారు. టీవీ, సెల్‌ఫోన్లకు అతుక్కు పోయి, వయస్సుతో నిమిత్తం లేకుండా నిరంతరాయంగా ఇంటర్‌నెట్‌ను వినియోగిస్తున్న బాలల భవిష్యత్తును తలుచుకుంటేనే ఆందోళన గా ఉందన్నారు. భావి భారత పౌరులుగా తయారు కావాల్సిన విద్యార్థులు చెడు మార్గాల వైపు ఎక్కువగా ఆకర్షితులవు తున్నారని చెప్పారు. వారిని చిన్న వయస్సులోనే సరైన మార్గం వైపు తీసుకుపోవాలన్నారు. ఇది బాధ్యతతో కూడిన వ్యవహారమని సూచించారు. ఇది ఒక్క రోజుతో జరిగే పని కూడా కాదనీ, నిరంతరాయంగా జరగాల్సిన ప్రక్రియ అని సూచించారు. వీలైనంత మేరకు వారిలో నైతిక విలువలను పెంపొందించా లన్నారు. సమాజం పట్ల బాధ్యతగా ఆలోచిం చటం, క్రమశిక్షణతో మెలగటం అల వాటు చేయాలన్నారు. శారీరక మానసిక వికాసానికి ఈ ఉత్సవాలు తోడ్పడాలని సూచిం చారు. బాలల్లో మార్పు కోసం ఒక ఉద్యమం సాగాలని ఆకాంక్షిం చారు. అందు కోసం జరిగే బాలోత్సవ కార్యక్రమాల్లో 'నేను సైతం మీ అడుగులో అడుగు వేస్తానని' హామీ ఇచ్చారు. అశోక్ తేజ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బాల బాలిక ల్లో తిరోగమన భావాలు విస్తరించే అవకాశం ఎక్కువగా ఉందని చెప్పారు. దానికి ప్రత్యామ్నా యంగా వారిలో సమాజం పట్ల గౌరవం, మర్యాద, బాధ్యత పెంచే విధంగా తీర్చి దిద్దాల్సిన అవసరముందని చెప్పారు. ఏమిటి? అనే ప్రశ్నను రేకిత్తించే లక్ష్యంతో బాలోత్సవం పనిచేస్తున్నందుకు అభినందనలు తెలిపారు.



ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలి

- తెలంగాణ శాంతి భద్రతల డీజీపీ మహేశ్‌భగవత్
- ఎన్ఎమ్‌డీసీలో ఘనంగా విజిలెన్స్ వారోత్సవాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎమ్‌డీసీ)లో విజిలెన్స్ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ శాంతి భద్రతల డీజీపీ మహేశ్‌భగవత్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. సంస్కృతి, జాతియత సమగ్రత కాపాడేందుకు అందరూ పాటు పడాలని కోరారు. ఉద్యోగులు తమ విధి నిర్వహణలో నిబద్ధతత, జవాబుదారి తనంతో ప్రజలకు సేవతందించాలని కోరారు. సిగ్మంగ్ ఫ్రాయిడ్ థియిరీని ఆదర్శంగా తీసుకుని తమ వృత్తిలో రాణించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన విజిలెన్స్ మ్యాగజెన్ సుభోదిని ఆవిష్కరించారు. సంస్థ సీఎమ్‌డీ అమిత్ ముఖర్జీ మాట్లాడుతూ విజిలెన్స్ వారోత్సవాల్లో హైదరాబాద్ వ్యాప్తంగా 28 పాఠశాలకు చెందిన దాదాపు 1,000 మంది విద్యార్థులను భాగస్వామ్యం చేసినట్టు తెలిపారు. విజిలెన్స్ అవేర్‌నెస్‌లో బాగంగా క్విజ్ పోటీలు, స్లోగన్, ఎస్సే రైటింగ్ బెస్ట్ హౌస్‌కీపింగ్ మొదలగు కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ వినయకుమార్, చీఫ్ విజిలెన్స్ అధికారి బి.విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు

- సీడ్స్ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత శీతాకాలం సాగులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనగ పంట పండించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. కొత్త కొత్త ఆకర్షణీయ ప్యాకెట్లలో విత్తనాలు, వ్యాపారుల మోసపూరిత మాటలతో రైతులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యమైన విత్తనాలు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. గతంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. దీంతోపాటు సీడ్స్ కార్పొరేషన్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. రానున్న రోజుల్లోనూ రైతులకు ఎలాంటి నష్టమూ మంచి దిగుబడి ఇచ్చే అన్ని రకాల విత్తనాలను కార్పొరేషన్ ద్వారానే అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంస్థను మళ్లీ యథా స్థానంలోకి తీసుకొచ్చేందుకు సహకార సొసైటీల ద్వారా సీఓలు, డీఈఓలతో సమావేశం నిర్వహించామన్నారు. గడిచిన పదేండ్లలో తెలంగాణ ప్రభుత్వ రంగ విత్తనాభివృద్ధి సంస్థ గుర్తింపును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి సంస్థకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. శనగ పంట సాగులో రైతులు నష్టపోకుండా నాణ్యమైన విత్తనాలను అందించి ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గత ప్రభుత్వంలో వ్యాపారుల మాయలో పడి నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులకు నేటికీ నష్టపరిహారం రాని పరిస్థితిని గుర్తించామన్నారు. ఆ పరిస్థితి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత సహకార సంఘాల చైర్మెన్‌లు, అధికారులు చూసుకుంటారన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, డీసీఓ బి.మోహన్, ఏడీసీసీబీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, ఏడీఓ శ్రీధర్‌స్వామి, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్

సీతారామపై మంత్రుల సమీక్ష



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల పురోగతిపై శనివారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఇంజినీర్లు, అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వచ్చే ఆరు నెలలు చాలా కీలకమని చెప్పారు. సత్తుపల్లి ట్రంకు, ట్రంక్ కెనాల్, యాతలకుంట వరకు పనులు పూర్తి చేసి వచ్చే పంటకాలానికి సాగునీరందించే అవకాశమున్నదన్నారు. దానికి సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ వెంటనే చేపట్టాల్సిందిగా సాగునీటిశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆగస్టు 15న ప్రారంభోత్సవం చేసుకున్న ఈ పథకానికి మన శాఖ అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు.

ఈ ప్రాజెక్ట్‌కు అవసరమైన నిధులు, పరిపాలన అనుమతులు ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. అధికారులు త్వరితగతిన పనులకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిని ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించి, తనకు ఎప్పటికప్పుడు వివరాలు అందచేయాల్సిందిగా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ ను ఆదేశించారు.

తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులొచ్చాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ప్రజాస్వామిక "తెలంగాణలో మరోసారి ఎనుకటి కాలంలా బూటుకాళ్ల శబ్దాలతో తెల్లవారే రోజులొచ్చాయి. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. హక్కులను అడిగితే బెదిరింపులకు పాల్పడుతారు. ఇది నియంత త్వ రాజ్యం" అని ఆరోపించారు. పోరాటం తెలంగాణకు కొత్తకాదనీ, ఈ మట్టి పొత్తిళ్లలోనే పోరాటం ఉన్నదని తెలిపారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడుతామని చెప్పారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

హామీల అమలు విషయంలో రాష్ట్ర ప్రజలతో పాటు, దేశ ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదేండ్లలో 1,61,000 పోస్టులను భర్తీ చేసింది. నియామకాలపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నది. స్వంతగా 50వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు డబ్బా కొడుతున్నారు. 50 వేల ఉద్యోగాలు గత ప్రభుత్వంలోనే నోటిఫై చేసి, పరీక్షలు నిర్వహించి, సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేసినవే కాదా? ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్‌లో ఉన్న నియామక పత్రాలు ఇచ్చి, అవన్నీ తామే చేసినట్టు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు" అని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ, ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, 18 ఏండ్లు పైబడిన మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 ఫించన్, ప్రతి విద్యార్థికి రూ. 5 లక్షలతో విద్యా భరోసా కార్డు, ప్రతి పంటకు బోనస్, కల్యాణలక్ష్మి, లబ్ధిదారులకు తులం బంగారం, మహిళా విద్యార్థులకు ఎలక్ట్రిక్ వాహనాల హామీలకు అతీగతీ లేదని విమర్శించారు.

లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లైంగిక వేదింపులకు పాల్పడుతున్న ఆకతాయిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏనంటూ అధికారులను టార్గెట్ చేసుకుని సీడీపీఓ కార్యాలయానికే కాకుండా..మెదక్, హుజూర్‌నగర్ ఐసీడీఎస్ పరిధిలోని మరికొంత మందిని వేధిస్తున్నాడని తెలిపారు. సూపర్‌వైజర్ల నెంబర్లు, బయోడేటాను సేకరించి ఈ చర్యలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. ఇలాంటి ఆకతాయి చర్య వల్ల బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే అతన్ని అరెస్టు చేసి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాధ్యతగా ఉండాలి తల్లీ

ప్రియమైన నేణు గీతికకు అమ్మ రాయునది:

ఎలా ఉన్నావు? నేను ఇంతకు ముందు రాసిన ఉత్తరం చదివి ఉంటావని ఆశిస్తున్నాను. నాన్న, ఈ ఉత్తరం ద్వారా నీకు నేను చెప్పే విషయం ఏమిటంటే... కుటుంబం పట్ల నువ్వు ఎంత బాధ్యతగా ఉంటున్నావో, ముందు ముందు ఇంకా బాధ్యతగా ఉండాలి. చిన్నప్పటి నుండి చెప్పిన మాట వింటూ, అవసరమైనప్పుడల్లా అమ్మకు సాయంగా ఉన్నావు. నాకు ఒంట్లో నలతగా వుంటే నీ బుజ్జి బుజ్జి చేతులతో 'అమ్మా! బబ్బు' అంటూ తెచ్చేదానివి. కొంచం పెద్దయ్యాక టీ పెట్టి ఒక ప్లేట్‌లో బిస్కెట్స్

అమ్మ లేఖ



పెట్టి 'అమ్మా, టీ తాగు' అని ఇచ్చేదానివి. నువ్వు స్కూల్ నుంచి వచ్చేటప్పటికి నేను పడుకుని ఉంటే నన్ను లేపకుండా నువ్వే నూడుల్స్ చేసుకుని తినేదానివి. నేను దుప్పటి కప్పుకోకుండా పడుకుంటే దుప్పటి తెచ్చి కప్పేదానివి. ఇవన్నీ నా చిట్టి తల్లి చేస్తుంటే ఓ వైపు బాధ, మరోవైపు నా పట్ల నువ్వు చూపిస్తున్న శ్రద్ధకు ఎంతో సంతోషం వేసేది.

నాన్న... కుటుంబం అన్న తర్వాత ఇంటి విషయాల్లో బాధ్యత అవసరం. ముఖ్యంగా అమ్మా, నాన్న పట్ల బాధ్యతగా ఉండాలి. అమ్మకు, నాన్నకు ఒంట్లో బాగాలేకపోతే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లడం, మందులు ఇవ్వడం, సమయానికి తింటున్నారా లేదా వంటివి దగ్గరుండి చూసుకోవాలి. ఉద్యోగరీత్యా దూరంగా ఉండాల్సి వస్తే మేము డాక్టర్ దగ్గరకు వెళ్తే వాళ్ళు ఏమి చెప్పారు, మందులు తెచ్చుకున్నారా, సమయానికి తింటున్నారా, టెస్టులు చేయిస్తే ఏమి చేయించారో ఆ రిపోర్ట్స్ పంపించమని అడగటం చేయాలి. మా పెద్ద వాళ్లకు కావాల్సింది కాస్త కేరింగ్ నాన్న. అది ఉంటే మానసికంగా ఎంతో ధైర్యవంతుల మవుతాం. ఈ వయసులో మా హెల్త్ విషయంలో కేర్ తీసుకోవాలి. చిన్నప్పుడు మేము నీ విషయంలో ఎలా కేర్ తీసుకున్నామో అలాగే నువ్వూ మా విషయంలో బాధ్యతగా ఉండాలి తల్లీ. వయసు వచ్చి మాకు చేసుకునే శక్తి లేనప్పుడు, బిడ్డగా మా అవసరాలు తీర్చాల్సింది నువ్వే కదా! ఉద్యోగాన్ని, కుటుంబాన్ని సమన్వయం చేసుకునేందుకు పరిష్కారాలు వెదకాలి. ఒక్కొక్క సారి మా ఆరోగ్య సమస్యలు తీవ్రంగా ఉండ వచ్చు. అనారోగ్యం వల్ల చికాకు, కోపం ఎక్కువ కావచ్చు. మతిమరుపు రావచ్చు, చూపు ఆనక పోవచ్చు ఇలా ఎన్నో వుంటాయి. అటువంటప్పుడు విసుక్కోకుండా, చిరాకు పడకుండా ఓర్పుతో మమ్మల్ని చూసుకోవాలి చిట్టిపండు.

అయితే కేవలం మేము మాత్రమే కాదు బంధువులు, స్నేహితులు, సమాజం, నీ తోటి ఉద్యోగులు ఇలా నీ చుట్టూ ఎందరో ఉన్నారు. వారితో ఎలా మెలగాలో ఒక్కొక్కటి నీకు వివరంగా చెప్తాను. ఉంటాను మరి..

ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి



వారి ఇండ్లే ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోశాయి. కార్యకర్తలను కన్నబిడ్డల్లా చూసుకున్నాయి. పోరు జెండాను తర్వాతి తరాలకు వారసత్వంగా అందించారు. అలాంటి కుటుంబం నుండి వచ్చిన మహిళా మణిహారమే ఏలూరి జయమ్మ. పుట్టింటి నుంచి పోరాట పటిమను వెంటేసుకుని మెట్టినింట కాలుపెట్టారు. భర్త క్షణం తీరిక లేకుండా ప్రజా పోరాటాల్లో ఉంటే.. ఇల్లు, వ్యవసాయం, పిల్లలను చూసుకుంటూ అన్నీ తానే కుటుంబాన్ని నడిపారు. అంతేనా ప్రజాతంత్ర ఉద్యమాల్లో సైతం ముందుకు సాగారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభలకు హాజరై, 83 ఏండ్ల వయసులోనూ నేటి తరంలో స్ఫూర్తినింపిన ఆమెతో మానవి సంభాషణ...



ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా ఉద్యమ నిర్మాత
ఏలూరి జయమ్మ

మా స్వగ్రామం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి దగ్గర గోకినేపల్లి. అమ్మ వరమ్మ, నాన్న వాసిరెడ్డి వెంకయ్య. వీరికి మేము ఏడుగురు సంతానం. మా అన్న లింగయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. దాంతో మా ఇంటిపై నిఘా ఉండేది. రజాకార్ల దాడులు, గొడవలు నిత్యం జరిగేవి. అందుకే అమ్మ మమ్మల్ని తీసుకుని కృష్ణా జిల్లా ఇందుపల్లికి వెళ్లింది. అక్కడ చిన్న ఇంట్లో ఉండేవాళ్లం. అదే సమయంలో అన్నయ్యను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. తర్వాత మా అక్కలు, చెల్లి, నేను గోకినేపల్లికి వచ్చాం. అప్పట్లో నేను 7వ తరగతి వరకు చదువుకున్నాను.

రావిళ్ల సత్యం మీటింగ్ విని

అన్నయ్య, నాన్న పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. మా ఇల్లు ఎప్పుడూ కార్యకర్తలతో సందడిగా ఉండేది. నేను రావిళ్ల సత్యం మీటింగ్ విని స్ఫూర్తి పొందాను. క్రమంగా నాలోనూ కమ్యూనిస్టు భావాలు పెంపొందాయి. అన్నయ్య (కజిన్)జైల్లో ఉన్నప్పుడు మా మామ అనంతరామయ్య పరిచయం అయ్యారు. 'మా అబ్బాయికి పెండ్లి చేయాలను కుంటున్నాం.. మంచి అమ్మాయి ఉంటే చెప్పండి' అని అడిగారంట. 'మా చిన్నమ్మ కూతురే ఉంది.. ఒకసారి అడిగి చెప్తా' అన్నారంట. అమ్మానాన్నతో మాట్లాడి సంబంధం కుదుర్చుకున్నారు. అలా ఏలూరి లక్ష్మీనారాయణతో 1952లో నా పెండ్లి జరిగింది. అప్పుడు నాకు 14 ఏండ్లు ఉంటాయి. మెట్టినిల్లు ఇల్లందు తాలూకా కారేపల్లి మండలం కామేపల్లి. అప్పటికే మావారు కమ్యూనిస్టు ఉద్యమాల్లో క్షణం తీరిక లేకుండా ఉండేవారు. మాకు ఇద్దరు అమ్మాయిలు, ఓ కొడుకు. బాబు పుట్టినప్పుడు ఆయన ఏడాది జైల్లోనే ఉన్నారు. పెద్దమ్మాయి అరుణ సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యింది. చిన్నమ్మాయి వరలక్ష్మీ, కొడుకు రఘు. వీళ్లంతా విద్యార్థి సంఘంలో పని చేశారు. రఘు పూర్తికాలం కార్యకర్తగానూ పని చేశాడు.

మా ఇల్లే పార్టీ ఆఫీసు

పెండ్లి తర్వాత మేము గాంధీనగర్‌లో ఉండేవాళ్లం. ఆయన పార్టీ కార్యక్రమాలతో తెల్లవారుజామున వెళ్లి ఎప్పుడో రాత్రికి ఇంటికి చేరుకునేవారు. ఇల్లు, పిల్లలు, వ్యవసాయం అంతా నేనే చూసుకునేదాన్ని. ఆయన్ని చంపడానికి చూస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని పార్టీ చెప్పింది. దాంతో రాత్రిళ్లు కల్లాల దగ్గర కూడా నేనే ఉండేదాన్ని. ఇవన్నీ చూసుకుంటూనే ఇంటికి వచ్చిన కార్యకర్తలకు వంట చేసి పెట్టేదాన్ని. ఒక విధంగా చెప్పాలంటే మా ఇల్లే పార్టీ ఆఫీస్‌గా, కార్యకర్తలకు భోజనశాలగా ఉండేది.

తొలి రాష్ట్ర మహాసభ

వ్యవసాయం చేస్తూనే వ్యవసాయ కార్మిక సంఘం, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. సభ్యత్వాలు చేయించేవాళ్లం. కూలి రేట్లు పెంచాలని పోరాటం చేశాం. ముందు మా పొలంలో పని చేసే వాళ్లకే కూలి పెంచి మిగిలిన వాళ్లను కూడా పెంచేలా చేసేవాళ్లం. తర్వాత నన్ను వ్య.కా.స డివిజన్ కమిటీలోకి తీసుకున్నారు. మోటూరు ఉదయం, మల్లు స్వరాజ్యం ఖమ్మం వచ్చి మహిళా సంఘం కమిటీ వేయడానికి యాక్టివ్‌గా ఉండేవారి పేర్లు అడిగితే నాపేరు, దుర్గాదేవి పేరు చెప్పారంట. అప్పుడు మహిళలతో సమావేశం పెడితే 50 మంది వరకు వచ్చారు. ఖమ్మంలోనే ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర తొలి మహాసభ పెట్టాలని నిర్ణయించారు. కరపత్రాలు వేసి ఊరూరా తిరిగి పంచాము. అలా 1974లో మహిళా సంఘం రాష్ట్ర తొలి మహాసభను ఖమ్మంలో విజయవంతంగా నిర్వహించాం. అప్పుడే ఖమ్మం జిల్లా తొలి కమిటీని కూడా ఎన్నుకున్నారు. నేను జిల్లా మొదటి కార్యదర్శిగా, దుర్గాదేవి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యాం. నాతోపాటు దుర్గాదేవి, సుభద్రమ్మ, స్వరాజేశ్వరమ్మ(భద్రాచలం)ను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. ఈ మహాసభకు అఖిలభారత నాయకత్వం కెప్టెన్ లక్ష్మీ, విమలా రణదివె వంటి సీనియర్లు వచ్చారు.

> ఖమ్మంలో మహిళా సంఘం రాష్ట్ర తొలి మహాసభ పెట్టాలని నిర్ణయించారు. కరపత్రాలు వేసి ఊరూరా తిరిగి పంచాము. అలా 1974లో మహిళా సంఘం రాష్ట్ర తొలి మహాసభ ఖమ్మంలో విజయవంతంగా నిర్వహించాం.

అలుపెరగని ఉద్యమాలు

1975లో 200 మందితో ఖమ్మం జిల్లా మహిళా క్లాసులు ఘనంగా నిర్వహించాం. మోటూరి ఉదయం, స్వరాజ్యం, ఏపీ విఠల్, పర్సా సత్యనారాయణ వంటి వారు వచ్చి క్లాసులు చెప్పారు. ఏ కార్య క్రమానికి పిలుపిచ్చినా మహిళలను పోగెయ్యడం నాపని. దుర్గాదేవి అనర్గళం ప్రసంగించే వారు. అప్పట్లో కూలి చాలా తక్కువగా ఉండేది. ఒక్క పూట తింటే మరో పూట పస్తులుండే పరిస్థితులు. మా పోరాటాల తర్వాత 3,5,10 రూపాయల వరకు కూలి పెరిగింది. తునికాకు పోరాటం కూడా చేసి, నాగులకు వ్యతిరేకంగా ఉద్యమం చేశాం. అలాగే మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మానికొండ సూర్యావతి, భిక్షావతి, దుర్గాదేవి, నేను ఢిల్లీ వెళ్లి గవర్నర్‌కి వినతిపత్రం ఇచ్చి వచ్చాము. బెంగాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం వచ్చిన తర్వాత జ్యోతిబసు ముఖ్యమంత్రిగా అక్కడ ఎన్నో సంక్షేమ పథకాలు మొదలు పెట్టారు. అప్పుడే ఇక్కడ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. బెంగాల్లో మహిళలకు పెన్షన్స్ ఇస్తున్నప్పుడు ఇక్కడెందుకు ఇవ్వరని పోరాడి సాధించాం. అలాగే ధరల పెరుగుదలపై ఆందోళనలు చేశాం. ఊరి బడి కోసం పోరాడి సాధించాం. మా రెండెక రాల పట్టా భూమిని పాఠశాల కోసం ఇచ్చాం. అప్పట్లో డా.రాధాకృష్ణ ఎంపీగా ఉండేవా రు. నిధులు అడిగి కొమ్ము గూడెంలో మూడు తండాల్లో, ముత్యాల గూడెంలో రెండు బోర్లు వేయించాం. దాంతో సంఘం పట్ల మహిళలకు నమ్మకం వచ్చింది. రాజీవ్‌గాంధీ చనిపోయినపుడు పార్టీ ఆఫీసులపై దాడులు చేసేవారు. పార్టీ గద్దె పడెయ్యాలని చూస్తే నేను వెళ్లి ధైర్యంగా గద్దెపై కూర్చున్నా. దాంతో రౌడీ మూక పారిపోయింది. అప్పట్లో వ్యక్తిగత అవసరాల కన్నా సంఘ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవాళ్లం. అలా మమ్మల్ని మా నాయకులు తీర్చిదిద్దారు. ధరలకు వ్యతిరేకంగా కలక్టరేట్‌ల వద్ద మానవహారం, కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా నిరాహార దీక్షలు చేశాం.

> వ్యక్తిగత అవసరాల కన్నా సంఘ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవాళ్లం. అలా మమ్మల్ని మా నాయకులు తీర్చిదిద్దారు.

ఆ రోజులు గుర్తుకొచ్చాయి

మా వారు వ్యవసాయ కార్మికసంఘం అఖిల భారత కమిటీలో ఉన్నారు. 1992లో ఆలిండియా కాన్ఫరెన్స్‌కు వెళ్లి అక్కడే గుండెపోటుతో చనిపోయారు. మా కుటుంబానికి అది కోలుకోలేని దెబ్బ. ఆ బాధ నుండి బయటపడేందుకు చాలా కాలం పట్టింది. కాస్త తేరుకున్నానో లేదో మా అబ్బాయి రఘు మావోయిస్టుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. అసలు బతకడేమో అనుకున్నాం. ఎలాగో బతికాడు. ఇలా దెబ్బమీద దెబ్బ తగలడంతో మానసికంగా కుంగిపోయి కొంత కాలం ఉద్యమాలకు దూరమయ్యాను. ఇప్పుడు వయసు పెరిగిపోయింది. అయినా నా మనసెప్పుడు మహిళల అభివృద్ధి గురించే ఆలోచిస్తుంది. అప్పట్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన మహిళా సంఘం తొలి సభల్లో నా పెద్ద కూతురు అరుణ, దుర్గాదేవి కూతురు సుధ వాలంటీర్లుగా పని చేశారు. ఇన్నాళ్లకు ఇదే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో (భద్రాచలం) ఐద్వా రాష్ట్ర మహాసభ జరగడం గర్వకారణంగా ఉంది. ఇక్కడికి వచ్చిన వాళ్లనుచూస్తుంటే అప్పటి రోజులు గుర్తొచ్చాయి.

- పి. విజయ



మెట్రో రెండో దశకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెట్రో రైలు రెండో దశ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండో దశలో 76.4 కిలో మీటర్ల మేర నిర్మాణ పనులను చేపట్టేందుకు అనుమతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో 196ను జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెండో దశ పనులు చేపట్టనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.24,269 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా (30శాతం) రూ.7,313 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటాగా (18శాతం) రూ.4,230 కోట్లు వెచ్చించనున్నాయి. పీపీపీ విధానంలో (4%) రూ.1,033 కోట్ల నిధులను సేకరించనున్నారు. మెట్రో రెండో దశకు జికా, ఏబీడీ, ఎన్డీబీ నుంచి (48%) రూ.11,693 కోట్లు అప్పుగా తీసుకోనున్నారు.

రెండో దశ పార్టు-ఏలో 5 కారిడార్ల నిర్మాణం

1.కారిడార్ 4లో నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు (36.8 కిలో మీటర్లు)
2.కారిడార్ 5లో రాయదుర్గం-కోకాపేట నియోపోలిస్ (11.6 కిలో మీటర్లు)
3.కారిడార్ 6లో ఎంజీబీఎస్-చంద్రాయణగుట్ట (7.5 కిలో మీటర్లు)
4.కారిడార్ 7లో మియాపూర్-పటాన్‌చెరు (13.4 కిలో మీటర్లు)
5.కారిడార్ 8లో ఎల్బీనగర్-హయత్‌నగర్ (7.1 కిలో మీటర్లు)
రెండో దశ పార్టు-బీ
6.కారిడార్ 9లో శంషాబాద్-ఫ్యూచర్‌సిటీ (40 కిలో మీటర్లు)

జనవరి 9న ఓటర్ల తుది జాబితా ఖరారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే ఏడాది జనవరి 9న రాష్ట్ర ఓటర్ల తుది జాబితా ఖరారు చేయనున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వీస్ ఎలక్టర్లతో సహా మొత్తం 3,34,26,323 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ముసాయిదా జాబితాను అక్టోబర్ 29న ప్రచురించినట్టు తెలిపారు. కాగా వీరిలో 1,66,16,446 మంది పురుషులు, 1,68,07,100 మంది మహిళలు 2,777 మంది థర్డ్ జెండర్‌కు చెందిన వారున్నారని తెలిపారు. అక్టోబర్ 20 వరకు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా 8,02,805 చేర్పులు, 4,14,165 తొలగింపులు 5,93,956 సవరణలు నమోదు చేశామని వెల్లడించారు. గతంలో పోల్చితే ఓటర్ల నమోదు 1.8 శాతం పెరిగిందని తెలిపారు. 2025 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్లుగా ధరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 9,10 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అర్హులైన వారు విధిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు నెల రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించనున్నట్టు తెలిపారు.

మీకంటే మేమే బెటర్

(మొదటిపేజీ తరువాయి)

మంది అర్హులైన యువతకు ఉద్యోగాలు ఇచ్చినట్టు వెల్లడించారు. బీజేపీ పాలిస్తున్న ఏ ఒక్క రాష్ట్రం కూడా ఈ రికార్డుతో పోల్చే పరిస్థితిలో లేదని ఎద్దేవా చేశారు. దశాబ్దకాలంగా పాఠశాల విద్యార్థుల పట్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, తాము వారి డైట్, కాస్మోటిక్ చార్జీలను 40 శాతం పెంచడంతో వేడుకలు చేసుకుంటున్నారని సీఎం తెలిపారు. మూసీ పునర్జీవన, ప్రక్షాళనను గతంలో నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఆక్రమణకు గురైన, ధ్వంసమైన చెరువులు, నాలాలు, నీటి వనరులను కాపాడేందుకు చర్యలు తీసుకుందనీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క ఇంచు కూడా ఆక్రమణ కాలేదని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీని సష్టిస్తున్నామనీ, దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ రూపొందించి నట్టు తెలిపారు. యువత కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీ అమలు పట్ల నిబద్ధతతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ మిగిల్చిన చీకటిని, నిరాశను తిప్పికొట్టినట్టు చెప్పారు. తెలంగాణ ప్రస్తుతం ఉదయిస్తున్న సూర్యున్ని తలపిస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

నాలుగేండ్లూ రేవంతే సీఎం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న వారికి రూ. 5 లక్షలు ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక యాప్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఆధార్‌తో సహా అన్ని వివరాలు యాప్‌లో పొందుపరుస్తామని తెలిపారు. ఈనెల 5, 6 తేదీల నుంచి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నట్టు చెప్పారు. గ్రామ కమిటీల ద్వారా ఎంపిక పూర్తి చేసి ఆ వెంటనే లబ్దిదారుల జాబితాలను ఖరారు చేస్తామన్నారు. వారికి కచ్చితంగా 400 చదరపు అడుగుల జాగా ఉంటే సరిపోతుందనీ, అయితే ఇంటి డిజైన్ లబ్దిదారుల ఇష్టమేనన్నారు. లబ్దిదారులను ఇందిరమ్మ కమిటీలే ఫైనల్ చేస్తాయని చెప్పారు. స్మార్ట్ కార్డుల ఆధారంగా ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. మహిళల పేరిట ఇల్లు కేటాయిస్తామనీ, వారు లేని పక్షంలో పురుషుల పేరిట కూడా ఇస్తామన్నారు. ఇండ్ల కేటాయింపుల్లో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదన్నారు. బహు నిరుపేదలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఇండ్ల స్థలాలు లేని వారికి రెండో దశలో స్థలంతోపాటు ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 75 నుంచి 80 గజాల స్థలాన్ని సమకూరుస్తామన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలనీ, ఇండ్ల విషయంలో కేంద్రం ఎంతిచ్చినా తీసుకుంటామనీ, ఏమీ ఇవ్వకపోయినా నిర్మాణాలను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ధనిక రాష్ట్రమని చెప్పి కేంద్రాన్ని ఇండ్ల నిధులు అడగలేదని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అటువంటి పొరపాటు చేయబోదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎటువంటి డిజైన్లు ఉండవనీ, లబ్దిదారుల ఇష్టం మేరకు నిర్మించుకోవచ్చుని స్పష్టం చేశారు. నాలుగు దశల్లో నిర్మాణం చేపట్టి, నిర్మాణ దశల వారీగా చెల్లింపులు చేస్తామన్నారు. పునాదికి రూ. లక్ష, గోడలకు రూ.1.25 లక్షలు, శ్లాబులకు రూ.1.50 లక్షలు, ఇల్లు పూర్తయ్యాక మరో రూ. లక్ష చొప్పున లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు మిగతా మొత్తాన్ని రాష్ట్రమే భరిస్తుందన్నారు. రాబోయే నాలుగేండ్లలో 20 లక్షల ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా ముందుకుపోతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇండ్లు నిర్మించేలా చూస్తామని తెలిపారు. 16 శాఖల ఇంజనీర్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చి ఇండ్లను సమర్థవంతంగా పూర్తి చేస్తామన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, డ్వాక్రా సంఘాల నుంచి సభ్యులు ఉంటారని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుక సరఫరా విషయంలో సాధ్యాసాధ్యాలపై ఆలోచన చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణానికి కేంద్ర నిధులతోపాటు రుణాలను తీసుకొస్తామని చెప్పారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా ఇండ్ల నిర్మాణం కొనసాగి తీరుతుందని భరోసా ఇచ్చారు. మంఖాల్, నందనవనం ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ కేటాయింపుల్లో కొన్ని అవకతవకలు జరిగాయనీ, వాటిని పరిష్కరించే బాధ్యతను ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించామని మంత్రి తెలిపారు.

క్యూబాపై ఆంక్షలు తొలగించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

రావడానికి ప్రధాన వనరు పర్యాటక రంగమే. పైగా క్యూబాను తీవ్రవాదానికి తోడ్పడుతున్న దేశంగా అమెరికా పేర్కొంది. దీంతో ఆ నిబంధనలకు తలొగ్గి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు క్యూబాకు దూరం పాటిస్తున్నాయి.


ప్రతి ఏటా తీర్మానాన్ని ఆమోదించడానికి ముందు జనరల్ అసెంబ్లీ రెండు రోజులు క్యూబా ఆంక్షలపై చర్చకు ఏర్పాటు చేస్తుంది. ఆంక్షల వల్ల తలెత్తే పర్యవసానాలపై తీవ్రంగా చర్చిస్తుంది. ఈ ఏడాది క్యూబా ఎదుర్కొంటున్న తీవ్రమైన ఒత్తిళ్ళ దృష్ట్యా అనూహ్యమైన రీతిలో పెద్ద సంఖ్యలో ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు.

ఈ తీర్మానాన్ని ఎందుకు ఆమోదించాల్సి వుందో 59మంది కారణాలు చెప్పారు. దాదాపు 30అంతర్జాతీయ సంస్థలు లేదా కూటములు కూడా ఇవే అభిప్రాయాలు వ్యక్తం చేశాయి. వీటిల్లో జి-77, ఆసియాన్, సెలాక్, ఒఐసి, నామ్, కారికామ్ వంటి గ్రూపులు వున్నాయి. అంతర్జాతీయ చట్టాన్ని క్యూబన్ల మానవ హక్కులను ఉల్లంఘిస్తూ అమలు చేస్తున్న ఈ ఆంక్షలను చాలా మంది తీవ్రంగా నిరసించారు. క్యూబాను తీవ్రవాద దేశంగా పేర్కొనడాన్ని ఖండించారు. ఇవన్నీ కలిసి క్యూబా అభివృద్ధిని దెబ్బ తీస్తున్నాయన్నారు. పేద దేశాల మధ్య సహకారం వుండాలని, బహుళ ధ్రువ ప్రపంచం నెలకొనాలని పలువురు ఉద్బోధించారు.

మరికొంతమంది కరోనా సమయంలో క్యూబా సాయానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఇదిలావుండగా, క్యూబాకు మద్దతుగా, ఆంక్షలను వ్యతిరేకిస్తూ అమెరికా కార్యకర్తలు, సంస్థలు వాషింగ్టన్, న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, చికాగో, తదితరచోట్ల పలు ప్రదర్శనలు నిర్వహించారు. క్యూబాకు మద్దతు ప్రకటించిన వెంటనే అర్జెంటైనా విదేశాంగ మంత్రి పదవి పోయింది. మితవాద అధ్యక్షుడు జేవియర్ మిలై ఆమెను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వందశాతం వర్సిటీల ప్రక్షాళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను వందశాతం ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లో సీఎంతో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విశ్వవిద్యాలయాల నూతన ఉపకులపతులు (వీసీ), ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ సమావేశమయ్యారు. గతనెల 18న విశ్వవిద్యాలయాలకు వీసీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. 23న నూతన వీసీలతో గవర్నర్, వర్సిటీల చాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ సమావేశ మయ్యారు. మొదటిసారిగా నూతన వీసీలు సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొత్త వీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఉన్న సమస్యలు, నిధుల కొరత, పరిశోధనలకు కలుగుతున్న ఇబ్బందులు, అధ్యాపక పోస్టుల ఖాళీలు వంటి అంశాల గురించి వీసీలు సీఎం దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కొంతకాలంగా విశ్వవిద్యాలయాలపై నమ్మకం తగ్గుతోందనీ, వాటిపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా పనిచేయాలని కోరారు. వర్సిటీల గౌరవాన్ని పెంచాలని సూచించారు. విశ్వవిద్యాలయాల్లో వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేసి సమస్యల పరిష్కారం కోసం చర్యలు మొదలుపెట్టాలని అన్నారు. అవసరమైతే కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకుని నివేదికను తయారు చేయాలని చెప్పారు. వర్సిటీలకు వీసీల నియామకం ఎవరి ప్రభావితంతో పోస్టులు ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. సామర్థ్యం, సామాజిక సమీకరణాల ఆధారంగానే వీసీలను ఎంపిక చేశామని వివరించారు. కొత్త వీసీలు బాగా పని చేసి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. తప్పు జరిగితే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మంచి పని చేయడానికి వీసీలకు స్వేచ్ఛ ఉంటుందనీ, ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. గతంలో వర్సిటీల వైస్ చాన్సలర్లను విద్యార్థులు ఏండ్ల తరబడి గుర్తు పెట్టుకునేవారనీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వివరించారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపైనా వీసీలు దృష్టిసారించాలని అన్నారు. విద్యార్థులు ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే వారిని గమనించి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ఎం కుమార్, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్, పీఎస్‌టీయూ వీసీ నిత్యానందరావు, ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్, టీయూ వీసీ యాదగిరిరావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ రాజిరెడ్డి, మహిళా విశ్వవిద్యాలయం వీసీ ధనావత్ సూర్య, ఆర్జీయూకేటీ బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ ఎ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమల అందాలు చూసొద్దామా!

నవతెలంగాణ-నాగార్జునసాగర్

రెండేండ్ల తర్వాత నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణాన్ని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రారంభించింది. శనివారం ఉదయం 10 గంటలకు 40 మంది ప్రయాణికులతో బయల్దేరిన లాంచీని నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ పూజలు చేసిన అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. లాంచీ సాయంత్రం నాలుగు గంటలకు శ్రీశైలం చేరుకుంది. ఆదివారం ఉదయం 10 గంటలకు తిరిగి శ్రీశైలం నుంచి బయలుదేరి సాయంత్రం నాలుగు గంటలకు నాగార్జునసాగర్ చేరుకుంటుంది. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం టూరిజం అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. దానిలో భాగంగా టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవల నాగార్జునసాగర్‌ను సందర్శించి పరిశీలించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టూరిజం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నర్సింహ, లాంచీ యూనిట్ మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ. 24 కోట్ల ఖరీదైన వజ్రాలు, నగలు సీజ్

(మొదటిపేజీ తరువాయి)

తనిఖీ చేశారు. ఆ కారులో ఉన్న సుమారు రూ. 24 కోట్ల ఖరీదైన ఆభరణాలను పోలీసులు, ఎన్నికల సంఘం అధికారుల బృందం స్వాధీనం చేసుకుంది. స్వాధీనం చేసుకున్న ఆభరణాల గురించి ఆదాయపు పన్ను శాఖకు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఛత్రపతి, సాంబాజినగర్, అహల్యనగర్, జల్గావ్ జిల్లాల్లో ఆ ఆభరణాలను డెలివరీ చేయాల్సి ఉందని ఆ వ్యక్తులు పోలీసులకు చెప్పారు.అయితే ఇంతభారీ స్థాయిలో ఆభరణాలు పట్టుబడటంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

నాలుగు రోజులకో జర్నలిస్టు హతం

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు గాజాలో అల్ జజీరా జర్నలిస్టులను పదేపదే చంపి బెదిరించారు. వీరిని హమాస్ అనుబంధ సంస్థలుగా వారు ఆరోపించారు. 2022-23లో చంపబడిన జర్నలిస్టులలో 14 మంది మహిళలు ఉన్నారు. కనీసం ఐదుగురు 15-24 మధ్య వయస్సులో ఉన్నవారే మరణించారు. ఈ మరణాలపై 2006 నుంచి యునెస్కో గుర్తించిన 85 శాతం కేసులు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి. జర్నలిస్టులను రక్షించడానికి, ప్రపంచవ్యాప్తంగా మీడియా ఉద్యోగులపై నేరాలను పరిశోధించి, విచారించడానికి ప్రభుత్వాలు "అత్యవసర చర్యలు తీసుకోవాలి" అని యుఎన్ సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ పిలుపునిచ్చారు.

25 నుంచి పార్లమెంట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఈనెల 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలు డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. ఇందులో పలు కీలక అంశాలపై లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు చర్చించనున్నారు. అలాగే పలు బిల్లులను సైతం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు సిద్ధం అవుతోంది. వక్ఫ్ సవరణ బిల్లుపై జేపీసీ నివేదిక పార్లమెంట్ ముందుకు రానుంది. అనంతరం బిల్లును సభలో ప్రవేశపెడతారు. అలాగే జమిలీ ఎన్నికలకు సంబంధించిన బిల్లునూ తీసుకువచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా తీర్మానాన్ని కూడా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. 18వ లోక్‌సభ తొలి వర్షాకాల సమావేశాలు జులై 22 నుంచి ఆగస్టు 9 వరకు జరిగాయి. మొత్తం సెషన్‌లో 15 సమావేశాలు నిర్వహించారు. సుమారు 115 గంటల పాటు సభ నిర్వహణ జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-2025 కేంద్ర బడ్జెట్‌ను జులై 23న సభలో ప్రవేశపెట్టారు. 27.19 గంటల పాటు జరిగిన చర్చలో 181 మంది సభ్యులు పాల్గొన్నారు. సెషన్‌లో 65 ప్రయివేట్ బిల్లులను కూడా ప్రవేశపెట్టారు.

జనవరిలో పంచాయతీ ఎన్నికలు..?

(మొదటిపేజీ తరువాయి)

చూడాలి. ఇందుకు సంబంధించి ఎవరైనా న్యాయస్థానం మెట్లెక్కితే అప్పుడు రేవంత్ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది కూడా ఆసక్తికరమే. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కొత్తేడాదిలో నిర్వహించబోయే పంచాయతీ ఎన్నికలు సర్వత్రా చర్చనీయాంశం కాబోతున్నాయి.

ఎటు తిరిగేనో?

- కివీస్ రెండో ఇన్నింగ్స్ 171/9
- జడేజా, అశ్విన్, సుందర్ మాయ
- శుభ్‌మన్ గిల్, పంత్ అర్ధ సెంచరీలు
- భారత్ తొలి ఇన్నింగ్స్ 263/10

భారత్, న్యూజిలాండ్ మూడో టెస్టు రెండో రోజు

అటు, ఇటు.. ఎటు? ముంబయి వాంఖడె టెస్టు ఏ వైపు టర్న్ తీసుకుంటుందనే ఉత్కంఠ ఎక్కువైంది. తొలి రోజు నుంచే స్పిన్ మాయ మొదలు కావటంతో నేడు తుది ఫలితం ఖాయంగా తేలనుంది. జడేజా, అశ్విన్, సుందర్ త్రయం మాయజాలంతో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 171/9 పరుగుల వద్ద నిలిచింది. ప్రస్తుతం కివీస్ 143 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతుంది. ఈ పిచ్‌పై 150 పరుగుల లక్ష్యం సైతం కష్టసాధ్యమే.. దీంతో ఛేదనలో టీమ్ ఇండియా బ్యాటర్ల ప్రదర్శనపై ఫోకస్ నెలకొంది. గిల్ (90), పంత్ (60) అర్ధ సెంచరీలతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ విలువైన ఆధిక్యం దక్కించుకుంది.

నవతెలంగాణ-ముంబయి





వాంఖడె టెస్టు ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. స్పిన్ మాయజాలంతో మూడో రోజే టెస్టు మ్యాచ్‌లో ఫలితం తేలనుంది. శుభ్‌మన్ గిల్ (90, 146 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (60, 59 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులు చేసింది. 28 పరుగుల విలువైన ఆధిక్యం సొంతం చేసుకుంది. వాషింగ్టన్ సుందర్ (38 నాటౌట్, 36 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (30) రాణించారు. స్పిన్ త్రయం రవీంద్ర జడేజా (4/52), అశ్విన్ (3/63), సుందర్ (1/30) మెరవటంతో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 171/9తో పోరాడుతోంది. విల్ యంగ్ (51, 100 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), గ్లెన్ ఫిలిప్స్ (26), డెవాన్ కాన్వే (22), డార్లీ మిచెల్ (21) రాణించారు. న్యూజిలాండ్ ప్రస్తుతం 143 పరుగుల ఆధిక్యంలో ఉంది. చివరి వికెట్‌ను మరో పది పరుగులు జోడించినా.. నాల్గో ఇన్నింగ్స్‌లో భారత్ లక్ష్యఛేదన కష్టసాధ్యమే కానుంది.



గిల్, పంత్ అర్ధ సెంచరీలు

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులు చేసింది. స్పిన్‌ను అనుకూలించిన పిచ్‌పై సోధి, ఫిలిప్స్, అజాజ్ పటేల్ మాయ చేసినా మనోళ్లు విలువైన ఆధిక్యం దక్కించుకున్నారు. 28 పరుగుల ఆధిక్యంతో న్యూజిలాండ్‌పై పైచేయి సాధించారు. యువ బ్యాటర్లు ఇద్దరూ అర్ధ సెంచరీలు సాధించటంతో ఇది సాధ్యపడింది. శుభ్‌మన్ గిల్ (90), రిషబ్ పంత్ (60) కివీస్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నారు. గిల్ 66 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో అర్ధ సెంచరీ సాధించగా.. పంత్ తనదైన శైలిలో ఫటాఫట్ ఇన్నింగ్స్ ఆడాడు. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాది 36 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఈ జోడీ ఐదో వికెట్‌కు వేగంగా 96 పరుగులు జోడించింది. లోయర్ ఆర్డర్‌లో రవీంద్ర జడేజా (14), సర్ఫరాజ్ ఖాన్ (0), అశ్విన్ (6) మళ్లీ నిరాశపరిచారు. వాషింగ్టన్ సుందర్ (38) నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో వీర విహారం చేశాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో పైచేయి సాధించింది. కివీస్ స్పిన్నర్ అజాజ్ పటేల్ (5/103) ఐదు వికెట్ల ప్రదర్శనతో మాయ చేశాడు. హెన్రీ, ఫిలిప్స్, సోధి తలా ఓ వికెట్ పడగొట్టారు. భారత ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లి, ఆకాశ్ దీప్ రనౌట్‌గా నిష్క్రమించారు.

జడేజా, అశ్విన్ మాయజాలం

భారత స్పిన్ త్రయం మాయ చేసింది. 43.3 ఓవర్లలోనే న్యూజిలాండ్ 9 వికెట్లను కుప్పకూల్చింది. విల్ యంగ్ (51, 100 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో చెలరేగాడు. కానీ ఇతర బ్యాటర్లు ఎవరూ భారత స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయారు. ఓపెనర్ డెవాన్ కాన్వే (22), డార్లీ మిచెల్ (21), గ్లెన్ ఫిలిప్స్ (26) విలువైన పరుగులు జోడించారు. కెప్టెన్ టామ్ లేథమ్ (1), రచిన్ రవీంద్ర (4), టామ్ బ్లండెల్ (4), ఇశ్ సోధి (8) తేలిపోయారు. టీ విరామ సమయానికి 26/1తో నిలిచిన న్యూజిలాండ్.. చివరి సెషన్లో ఏకంగా 8 వికెట్లు కోల్పోయింది. ఇదే సమయంలో న్యూజిలాండ్ వేగంగా పరుగులు పిండుకుంది. 3.93 రన్‌రేట్‌తో స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. రవీంద్ర జడేజా (4/52), అశ్విన్ (3/63), సుందర్ (1/30) మాయ చేసినా.. ఎక్స్‌ట్రాల రూపంలో భారత్ 17 పరుగులు కోల్పోయింది. రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 171/9తో ఆడుతుంది. అజాజ్ పటేల్ (7 నాటౌట్) అజేయంగా క్రీజులో ఉండగా.. విలియం ఓరౌర్క్ బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది. తొలి ఇన్నింగ్స్ లోటు అనంతరం న్యూజిలాండ్ 143 పరుగుల ముందంజలో నిలిచింది.

ఆస్ట్రేలియా పర్యటనలో భారత్, భారత్-ఏ మధ్య జరగాల్సిన మూడో రోజుల వార్మప్ మ్యాచ్ రద్దు చేసినట్టు తెలుస్తోంది. భారత్, ఆసీస్ పెర్త్‌లో తొలి టెస్టులో తలపడనుండగా.. పెర్త్ వేదికగా మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌కు బీసీసీఐ షెడ్యూల్ విడుదల చేసింది. వార్మప్ మ్యాచ్ స్థానంలో మూడు రోజుల పాటు పిచ్‌పై సాధన చేసేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపినట్టు సమాచారం.

స్కోరు వివరాలు :

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : 235/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : జైస్వాల్ (బి) అజాజ్ 30, రోహిత్ (సి) లేథమ్ (బి) హెన్రీ 18, గిల్ (సి) మిచెల్ (బి) అజాజ్ 90, సిరాజ్ (ఎల్బీ) అజాజ్ 0, కోహ్లి (రనౌట్) 4, పంత్ (ఎల్బీ) సోధి 60, జడేజా (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 14, సర్ఫరాజ్ (సి) బ్లండెల్ (బి) అజాజ్ 0, వాషింగ్టన్ నాటౌట్ 38, అశ్విన్ (సి) మిచెల్ (బి) అజాజ్ 6, ఆకాశ్ దీప్ (రనౌట్) 0, ఎక్స్‌ట్రాలు : 3, **మొత్తం :** (59.4 ఓవర్లలో ఆలౌట్) 263.

వికెట్ల పతనం : 1-25, 2-78, 3-78, 4-84, 5-180, 6-203, 7-204, 8-227, 9-247, 10-263.

బౌలింగ్ : మాట్ హెన్రీ 8-1-26-1, ఓరౌర్క్ 2-1-5-0, అజాజ్ 21.4-3-103-5, ఫిలిప్స్ 20-0-84-1, రచిన్ 1-0-8-0, సోధి 7-0-36-1.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ : లేథమ్ (బి) ఆకాశ్ 1, కాన్వే (సి) గిల్ (బి) సుందర్ 22, యంగ్ (సి,బి) అశ్విన్ 51, రచిన్ (స్టంప్డ్) పంత్ (బి) అశ్విన్ 4, డార్లీ మిచెల్ (సి) అశ్విన్ (బి) జడేజా 21, బ్లండెల్ (బి) జడేజా 4, ఫిలిప్స్ (బి) అశ్విన్ 26, సోధి (సి) కోహ్లి (బి) జడేజా 8, హెన్రీ (బి) జడేజా 10, అజాజ్ నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు : 17, **మొత్తం :** (43.3 ఓవర్లలో 9 వికెట్లకు) 171.

వికెట్ల పతనం : 1-2, 2-39, 3-44, 4-94, 5-100, 6-131, 7-148, 8-150, 9-171.

బౌలింగ్ : ఆకాశ్ 5-0-10-1, సుందర్ 10-0-30-1, అశ్విన్ 16-0-63-3, జడేజా 12.3-2-52-4.

కృష్ణ వర్మ పసిడి పంచ్

మరో ఐదుగురు బాక్సర్ల సిల్వర్ షో
అండర్-19 ప్రపంచ చాంపియన్‌షిప్స్

కొలరాడో (యుఎస్ఏ) : అండర్-19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో టీమ్ ఇండియా యువ బాక్సర్లు పతకాల పంట పండిస్తున్నారు. మహిళలు, పురుషుల విభాగాల్లో ఓ పసిడి సహా ఐదు పతకాలు భారత్ సొంతం చేసుకుంది. మహిళల 75 కేజీల విభాగంలో కృష్ణ వర్మ అదరగొట్టింది. 5-0తో ఏకపక్ష విజయం సాధించింది. ఫైనల్లో జర్మనీ బాక్సర్ సిమోన్ లెరికను కృష్ణ వర్మ చిత్తు చేసింది. మహిళల 48 కేజీల విభాగంలో చంచల్ చౌదరి, 57 కేజీల విభాగంలో అంజలి కుమారి సింగ్, 60 కేజీల విభాగంలో ఆకాంక్ష సహా మెన్స్ 75 కేజీల విభాగంలో రాహుల్ ఫైనల్స్‌లో పోటీపడినా సిల్వర్ మెడల్స్‌తో సరిపెట్టుకున్నారు. అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ)కు ప్రత్యామ్నాయంగా ఏర్పాటైన వరల్డ్ బాక్సింగ్ (డబ్ల్యూబి) నిర్వహించిన తొలి టోర్నమెంట్‌లోనే భారత్ ఆరు పతకాలు సాధించింది.



ఓటమి ముంగిట భారత్-ఏ

ఆసీస్-ఏ లక్ష్యం 225, ప్రస్తుతం 139/3

మకాయ్ : ఆస్ట్రేలియా-ఏతో తొలి అనధికార టెస్టులో భారత్-ఏ ఓటమి అంచుల్లో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 107 పరుగులకే కుప్పకూలిన కుర్రాళ్లు.. రెండో ఇన్నింగ్స్‌లో పోరాడింది. రుతురాజ్ (103), పడిక్కల్ (88) పోరాటంతో 312 పరుగులు సాధించింది. ఆస్ట్రేలియా-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత్- 225 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. 139/3తో విజయం దిశగా సాగుతోంది. మార్కస్ హారిస్ (36, 82 బంతుల్లో 4 ఫోర్లు), నాథన్ మెక్స్వీనే (47 నాటౌట), వెబ్‌స్టర్ (19 నాటౌట్) రాణించారు. నేడు ఆసీస్-ఏ విజయానికి 86 పరుగులు అవసరం కాగా.. భారత్-ఏ ఏడు వికెట్ల దూరంలో నిలిచింది.



అదరగొట్టిన టైటాన్స్

బెంగళూర్‌పై 38-35తో గెలుపు

హైదరాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ మూడో విజయం సాధించింది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 38-35తో బెంగళూర్ బుల్స్‌పై గెలుపొందింది. తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు పవన్ సెహ్రావత్ (14 పాయింట్లు), ఆశీష్ నర్వాల్ (6 పాయింట్లు), అజిత్ పవార్ (5 పాయింట్లు), విజయ్ మాలిక్ (5 పాయింట్లు) అదరగొట్టారు. బెంగళూర్ బుల్స్ తరపున ఆల్‌రౌండర్లు పంకజ్ (9 పాయింట్లు), నితిన్ రావల్ (7 పాయింట్లు), రెయిడర్ అజింక్య పవార్ (9 పాయింట్లు) రాణించారు. తెలుగు టైటాన్స్‌కు ఇది ఆరు మ్యాచుల్లో మూడో విజయం కాగా.. బెంగళూర్ బుల్స్‌కు ఆరు మ్యాచుల్లో ఇది ఐదో పరాజయం కావటం గమనార్హం. ఈ విజయంతో తెలుగు టైటాన్స్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. రెయిడర్ పవన్ సెహ్రావత్ సీజన్లో అత్యధిక రెయిడ్ పాయింట్లు (65) సాధించిన ఆటగాడిగా నిలిచాడు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్‌పై పట్నా పైరేట్స్ 42-37తో విజయం సాధించింది.



నవచిత్రం

హిట్ కొట్టేశాం అంటున్నారు



కిరణ్ అబ్బవరం, నయన్ సారిక

హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ మూవీ 'క'. దీపావళి కానుకగా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.
ఈ సినిమా రెండు రోజుల్లో 13.11 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ నేపథ్యంలో శనివారం సక్సెస్‌మీట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.
నిర్మాత చింతా గోపాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, 'నేనేనా ఇంత పెద్ద సూపర్ హిట్ సినిమా చేశాననిపిస్తోంది. ఇంకా నమ్మకం కుదరడం లేదు. అందుకే సక్సెస్ కిక్ రావడం లేదు. నా టీమ్ అందరికీ శుభాకాంక్షలు చెబుతున్నా' అని చెప్పారు.
'ఈ సినిమా నా దగ్గరకు తీసుకొచ్చినప్పుడు ఈ సినిమాతో ఏదో మ్యాజిక్ జరుగుతుంది. మనం ఇరవై కోట్లు కాదు వంద కోట్ల సినిమా కొడుతున్నాం అని హీరో కిరణ్ చెప్పాడు. అతని మాటలే నాలో ఎంతో నమ్మకాన్ని కలిగించాయి. ఆ నమ్మకం ఈ రోజు నిజమైంది' అని డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'ఘన విజయాన్ని అందించి ఈ దీపావళికి నాకు పెద్ద గిఫ్ట్ ఇచ్చారు. థియేటర్స్ పెంచాలనే డిమాండ్ పెరుగుతోంది. సినిమా పరిశ్రమ నుంచి కూడా చాలామంది అప్రిషియేట్ చేస్తున్నారు. హిట్ కొట్టాడు అనకుండా హిట్ కొట్టేశాం అంటున్నారు. ఇది తమ విజయంగా భావిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని తెలిపారు.



సాయి రాజేష్, అనంత శ్రీరామ్, ఎస్‌కేఎన్

'బేబీ'కి మరో ప్రతిష్టాత్మక అవార్డు

ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్‌కేఎన్ నిర్మాణంలో, దర్శకుడు సాయి రాజేష్ రూపొందించిన చిత్రం 'బేబీ'. ఈ సినిమాకి మరో గౌరవం దక్కింది. ఈ చిత్రానికి లిరిక్స్ అందించిన అనంత శ్రీరామ్ బెస్ట్ లిరిక్ రైటర్‌గా ఐఫా అవార్డ్ సొంతం చేసుకున్నారు. ఆయన రాసిన 'ఓ రెండు మేఘాలిలా..' పాటకు ఐఫా అవార్డ్ దక్కింది. దీంతో ఈ సినిమాకు ఆయన బెస్ట్ లిరిక్ రైటర్‌గా అన్ని మేజర్ అవార్డ్స్‌ని స్వీప్ చేశారు.
ఈ సినిమాకు ఇప్పటిదాకా ఫిలింఫేర్, సైమా, గామా వంటి అనేక గొప్ప పురస్కారాలు దక్కాయి. ఈ సినిమాకు ప్రేక్షకుల రివార్డ్స్‌తో పాటు ప్రతిష్టాత్మక అవార్డ్స్ దక్కుతున్నాయంటే ఆ ఘనత ఈ ప్రేమ కథను హృద్యంగా తెరపై ఆవిష్కరించిన డైరెక్టర్ సాయి రాజేష్‌కే దక్కుతుంది. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్, డైరెక్టర్ సాయి రాజేష్ కాంబినేషన్‌లో ఈ సినిమా బాలీవుడ్‌లో రీమేక్ అవుతోంది అని చిత్ర బృందం పేర్కొంది.


'మట్కా' పక్కా మాస్ ఎంటర్‌టైనర్



మీనాక్షి చౌదరి, వరుణ్ తేజ్

వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న చిత్రం 'మట్కా'.
వరుణ్ తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వం వహించారు. శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ని చిరంజీవి లాంచ్ చేశారు.
ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ,'ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఆడియెన్స్‌కి ఒక కొత్త అనుభూతి ఇవ్వడానికి మా టీమ్ అంతా చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశాం. ఈనెల 14న ఈ సినిమా మీ ముందుకు వస్తోంది. నేను మాస్ సినిమా చేసి కొంచెం గ్యాప్ వచ్చింది. ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుందని నమ్మకం ఉంది. ఫ్యాన్స్ అందర్నీ హ్యాపీ చేసే సినిమా అవుతుంది. చిరంజీవికి ట్రైలర్ చాలా నచ్చింది. చాలా మాస్‌గా ఉందని ఆయన కాంప్లిమెంట్ ఇవ్వడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇది చాలా ఇంపాక్ట్‌ఫుల్ స్టోరీ. పాత్రల తీరు తెన్నులు, వరల్డ్ బిల్డింగ్ చాలా కొత్తగా ఉంటాయి. వాసు క్యారెక్టర్‌తో ఆడియెన్స్ ట్రావెల్ అవుతారు. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే సినిమా ఇది' అని తెలిపారు.
'ఇదొక స్పెషల్ ప్రాజెక్ట్. ఒక కొత్త వరల్డ్‌ని క్రియేట్ చేసాం. ఇందులో చాలా మంచి క్యారెక్టర్ చేశాను. ట్రైలర్ అదిరిపోయింది. జీవి ప్రకాష్ మ్యూజిక్ అద్భుతంగా ఉంది' అని హీరోయిన్ మీనాక్షి చౌదరి చెప్పారు.
డైరెక్టర్ కరుణ్ కుమార్ మాట్లాడుతూ,'మెగా అభిమానులందరికీ నేను ఒక ప్రామిస్ చేయదల్చుకున్నాను. వరుణ్‌ని మీరు ఎలా చూద్దామనుకుంటున్నారో, ఎలాంటి సినిమాలో చూద్దాం అనుకుంటున్నారో ఆ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉన్న సినిమా ఇది. నటుడిగా ఆయనలోని అన్ని కోణాల్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుంది. 40 ఏళ్ల క్రితం జరిగిన ఒక ట్రూ ఇన్సిడెంట్‌ని బేస్ చేసుకుని తీసిన సినిమా ఇది' అని అన్నారు.
'చాలా కాన్ఫిడెంట్‌గా చెప్తున్నాను ఈ సినిమా మీ అందరికీ మంచి మాస్ ఎంటర్టైనర్' అని ప్రొడ్యూసర్ రజిని తాళ్లూరి చెప్పారు. మరో ప్రొడ్యూసర్ డాక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ,'టీజర్ లాంచ్‌లో చెప్పినట్టు కరుణ్ కుమార్ కథ ఫస్ట్ డే విన్నప్పుడు నుంచి ఇప్పుడు చూసిన ట్రైలర్‌కి, నిన్న చూసిన ఎడిట్ రూమ్ అవుట్‌పుట్‌కి చాలా తేడా ఉంది. సినిమాని ఇంత అద్భుతంగా మలచిన డైరెక్టర్‌కి థ్యాంక్స్. వరుణ్ క్రేజీగా కనిపిస్తున్నారు' అని తెలిపారు.
హీరో కార్తికేయ మాట్లాడుతూ, 'నన్ను నమ్మి ఇందులో నటించే అవకాశం ఇచ్చిన కరుణ్ కుమార్‌కి థాంక్స్. నేను నా బెస్ట్ ఇచ్చాను. ఈనెల 14న థియేటర్లో ఒక కొత్త వరల్డ్‌ని ప్రేక్షకులు చూడబోతున్నారు' అని అన్నారు.


ఆద్యంతం వినోదభరితం



చేతన్‌కృష్ణ, అనిల్ రావిపూడి

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించిన సినిమా 'ధూం ధాం'. సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.
ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎం.ఎస్. రామ్‌కుమార్ నిర్మిస్తున్నారు.
సాయి కిషోర్ మచ్చా దర్శకుడు. గోపీ మోహన్ స్టోరీ, స్క్రీన్ ప్లే అందించారు. ఈ నెల 8వ తేదీన ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఫుల్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ ఇది. ట్రైలర్ ఆకట్టుకుంది. ఇండస్ట్రీలోని 80% ఆర్టిస్టులు ఈ సినిమాలో నటించారు. ప్రొడ్యూసర్ రామ్ కుమార్, డైరెక్టర్ సాయి కిషోర్ చేసిన ఈ ప్రయత్నం సక్సెస్ కావాలి. సినిమాకు మంచి రెవెన్యూ రావాలి' అని తెలిపారు.
భూపతి ఫ్యామిలీలో కాబోయే అల్లుడిగా ఎన్ఆర్ఐ వెన్నెల కిషోర్ అడుగు పెట్టడంతో ట్రైలర్ బిగిన్ అయ్యింది. ఆయన కజిన్‌గా హీరో చేతన్ అరంగేట్రం చేస్తాడు. పెళ్లి ఇంట హీరోతో పాటు వెన్నెల కిషోర్ చేసిన హంగామా కావాల్సినంత ఫన్ క్రియేట్ చేసింది. ఫారిన్‌లో ఉన్నప్పుడే అతనికి హీరోయిన్‌తో లవ్ స్టోరీ ఉంటుంది. హీరో ప్రేమకథకు, అతను ఈ ఊరికి రావడానికి సంబంధం ఏంటి?, తండ్రిని ప్రాణంగా ప్రేమించే కొడుకుగా హీరో ఆయన కోసం ఏం చేశాడు? అనేది ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. గోపీసుందర్ కంపోజ్ చేసిన మూడు ఛాట్‌బస్టర్ సాంగ్స్ ట్రైలర్‌కు ఆకర్షణగా నిలిచాయి. ఎంటర్‌టైన్‌మెంట్, లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్, సూపర్ హిట్ మ్యూజిక్‌తో సాగిన ట్రైలర్ థియేటర్‌లో సినిమా చూసేందుకు కావాల్సినంత ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది అని చిత్ర యూనిట్ తెలిపింది.

భారీ స్థాయిలో రిలీజ్



లక్ష్మీ రాయ్

లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురుప్రసాద్ దర్శకత్వంలో తమిళంలో విడుదలై, ఘన విజయాన్ని సాధించిన ఈ చిత్రం ఈనెల 22న తెలుగులో విడుదలకు సిద్ధమైంది. ఆర్ కె ఫిలిమ్స్ పతాకంపై డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ నిర్మాతగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'తమిళంలో సూపర్ హిట్ అయిన ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. లక్ష్మీ రాయ్ త్రిపాత్రాభినయం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. ఈ చిత్రానికి ఫైట్స్ కూడా హైలెట్‌గా నిలుస్తాయి. మా ఆర్ కె బ్యానర్‌కు మంచి పేరు తెచ్చే చిత్రమిది. లక్ష్మీ రాయ్ చేసిన మూడు క్యారెక్టర్స్ డిఫరెంట్ షేడ్స్‌లో ఉంటాయి. విద్యార్థులను మాదక ద్రవ్యాలకు అలవాటు చేసి, యువత భవిష్యత్‌ను పెడదారి పట్టించే డ్రగ్స్ ముఠా ఆటకట్టించే ఐపిఎస్ ఆఫీసర్‌గా, గ్రామాల్లో రౌడీల అగడాలకు అడ్డుకట్ట వేసే ఉగ్రనారిగా, కుర్రకారును ఉర్రూతలూగించే గ్లామర్ పాత్రల్లో లక్ష్మీ రాయ్ తన నట విశ్వ రూపాన్ని ప్రదర్శించింది. విజయశాంతి నటించిన 'కర్తవ్యం' ఇలాంటి సినిమాలకు స్ఫూర్తి. ఆ సినిమాతోనే విజయశాంతి లేడీ సూపర్‌స్టార్‌గా ఎదిగారు. ఆ చిత్రం ఎలాంటి విజయాన్ని సాధించిందో, ఈ చిత్రం కూడా ఘన విజయాన్ని సాధిస్తుంది. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈనెల 22న ప్రపంచవ్యాప్తంగా అత్యధిక థియేటర్లలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు.

అద్భుతమైన ట్విస్టులతో 'బ్లాక్ మ్యాజిక్'



రజిత్ రావు

ఏ2బీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై 'బ్లాక్ మ్యాజిక్' చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు నిర్మాత రజిత్ రావు తెలిపారు. దీపావళి సందర్భంగా ఈ మూవీ టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను లాంచ్ చేశారు.
ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అందరిలోనూ ఆసక్తిని పెంచుతోంది. మలయాళ దర్శకుడు సురేష్ ఉన్నితన్ దర్శకత్వం వహిస్తున్నారు. 'ప్రేమిస్తే' భరత్ హీరోగా నటిస్తున్నారు. లేఖ ప్రజాపతి, స్నేహ అజిత్ హీరోయిన్లు. సీనియర్ నటులు లాల్, అజ్మల్ అమీర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.
ఈ సందర్భంగా నిర్మాత రజిత్ రావు మాట్లాడుతూ, 'ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ పూర్తయ్యింది. డిసెంబర్‌లో సినిమా రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నాం. మంచి కాన్సెప్ట్ ఉన్న కథ ఇది. బ్లాక్ మ్యాజిక్ అని టైటిల్ పెట్టామంటే.. ఈ కథ ఏ తరహాలో ఉంటుందో వేరే చెప్పక్కర్లేదు. నెక్ట్స్ ఏం జరుగుతుందనే క్యూరియాసిటీ మాత్రం సినిమా ఆసాంతం ప్రేక్షకులకు ఉంటుంది. ట్విస్టులు, టర్నులు అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తాయి' అని తెలిపారు.
'ఈ చిత్రంలో అద్భుతమైన ట్విస్ట్‌లు ఉంటాయి. థియేటర్స్‌లో ప్రేక్షకులు థ్రిల్ ఫీల్ అయ్యే సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి మంచి కాన్సెప్ట్‌తో ఉన్న సినిమాకి దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చిన నిర్మాత రజిత్‌రావుకు థ్యాంక్స్. ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది' అని దర్శకులు సురేష్ ఉన్నితన్ చెప్పారు.ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే : శ్రీ కుమార్ అర్యాటీ, సినిమాటోగ్రాఫర్ : జామ్ అయ్యనాథ్, సంగీతం : బిజిబాల్, ఆర్ సోమశేఖరన్.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886